


శనివారం
27.9.2025
సంపుటి : 22
సంచిక : 08
పేజీలు : 12 + 24
వెల : రూ. 6/-

# ది క్రైమ్ న్యూస్
Crime News
తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada Circulated from TS and AP.: Warangal, Nizamabad, Nalgonda, Mahabubnagar, Khammam, Karimnagar, Hyderabad, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Anantapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam


## వైకాపా హయాంలో దెబ్బతిన్న
# రాష్ట్రం ఇమేజ్
### కార్గో రవాణాలో గుజరాత్ తర్వాత మనమే



- నాలుగు కొత్త పోర్టుల వల్ల కార్గో రవాణా పెరుగుతుంది
- నాణ్యమైన లాజిస్టిక్స్ ఏపీకి వచ్చేలా ప్రణాళికలు
- లాజిస్టిక్స్‌లో ప్రస్తుతం 3లక్షల మంది పని
- త్వరలోనే ఐటీ హబ్‌గా విశాఖపట్టణం
- అసెంబ్లీలో సిఎం చంద్రబాబునాయుడు

కార్గో రవాణాలో గుజరాత్ తర్వాత మనమే ఉన్నాం అని సిఎం చంద్రబాబు అన్నారు. కొత్తగా వచ్చే నాలుగు పోర్టుల వల్ల కార్గో రవాణా పెరుగుతుం దన్నారు. పోర్టుల నిర్మాణంలో టార్గెట్‌లు పెట్టుకుని పనిచేస్తున్నాం. ఫిషింగ్ హార్బర్లు, ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు కూడా వస్తున్నాయి. రవాణాకు ఇన్‌లాండ్ మార్గాలు ఉపయోగించుకుంటాయి.

**అమరావతి,** ప్రపంచంలో నాణ్యమైన లాజిస్టిక్స్ ఏపీకి వచ్చేలా ప్రణాళి కలు రూపొందిస్తున్నాం. లాజిస్టిక్స్‌లో ప్రస్తుతం 3లక్షల మంది పనిచేస్తున్నారు. ఆ రంగంలో యువ తకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇస్తాం అని వివరించారు. లాజి స్టిక్స్, పరిశ్రమలు, ఉపాధి, ఉద్యోగ అవకాశాల అంశంపై ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రసంగించారు. వైకాపా పాలనలో పరిశ్రమల యజ మానులను బెదిరించి పంపించేశారు. దాంతో పెట్టుబడి దారుల కు మన రాష్ట్రంపై నమ్మకం పోయింది. వైకాపా హయాంలో రాష్ట్రం ఇమేజ్‌ను బాగా దెబ్బతీ శారు. పెట్టుబడిదారుల్లో నమ్మ కం కలిగించేందుకు అనేక చర్యలు చేపట్టాం. అన్ని రకా లుగా అండగా ఉంటామని పెట్టుబడి దారులకు నమ్మకం కల్పించాం. త్వరలోనే విశాఖ ఐటీ హబ్‌గా మారుతుంది. విశాఖకు గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్, యాక్సం చర్ వస్తున్నాయి. 2026 ఆగస్టు నాటికి భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణం పూర్తి చేస్తాం. డిమాం డ్ మేరకు టెర్మినళ్లు, రన్‌వేలు విస్తరిస్తాం. దసరా ఉత్సవాల్లో కోల్‌కతా, మైసూర్ సరసన విజయవాడను చేర్చాం అని చంద్ర బాబు వివరించారు. వస్తు రవాణా, ప్రయాణికుల రవాణా లాంటి మాధ్యమాలను మరింత అభివృద్ధి చేయాల్సి ఉందని తెలిపారు. పోర్టులు, ఎయిర్ పోర్టులు, రహదారి మార్గాలు, రైల్వే ఇలా వేర్వేరు రంగాలను విస్తృతం చేయాలని సూచించారు. భారత్‌లో లాజిస్టిక్స్ వ్యయం రూ.24. 01 లక్షల కోట్లుగా ఉందని చెప్పుకొచ్చారు. జీడీపీలో లాజిస్టిక్స్ వాటా 7.97 శాతంగా ఉందని వివరించారు. రవాణా రంగంలో రోడ్ల ద్వారా జరిగే రవాణా 41 శాతం మేర వాటా కలిగి ఉందని తెలిపారు. లాజిస్టిక్స్‌కు అయ్యే వ్యయాన్ని తగ్గించగలిగితే ఉత్పత్తి వ్యయమూ తగ్గుతుందని వెల్లడించారు. ఇది ఉత్పత్తిదారులు, వినియోగదా రుల తోపాటు అందరికీ ప్రయోజనం చేకూరుస్తుందని పేర్కొన్నారు. లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ ఎకో సిస్టమ్‌లో రైలు, రోడ్డు, జల రవాణాతోపాటు ➤ 2వ పేజిలో..

## చరంజీవిని తిడితే
# పవన్ స్పందించరా

- జనసేన కూడా ఎందుకు మౌనం వహించింది
- బాలకృష్ణ వ్యాఖ్యలను సరియస్‌గా తీసుకోలేదా
- వైకాపా నేత, మాజీమంతరి జోగి రమేశ్ విమర్శలు



బాలకృష్ణఅసెంబ్లీలో తిడితే పవన్ కళ్యాణ్ ఎందుకుస్పందించలేదని మాజీమంత్రి జోగి రమేశ్అన్నారు. పవన్ సినిమాల్లోనూ, రాజకీయంగా ఎదగటానికి చిరంజీవే కారణం. మరిఅలాంటి చిరంజీవిని తిడితే పవన్, జనసేనఎందుకు స్పందించలేదన్నారు. . చిరంజీవిపైఏమాత్రం అభిమానం ఉన్నా వెంటనే పవన్‌కళ్యాణ్ స్పందించాలి. జగన్ సినిమా వాళ్లనుఎంత గౌరవించారో ఆరోజు వచ్చిన ఆ సినీ ప్రముఖులనే అడగాలని జోగి రమేష్ ఫైర్ అయ్యారు. సోషల్ ➤ 2వ పేజిలో..



## కోస్తాంధ్రకు వాయుగండం

- పలు జిల్లాలకు వర్ష హెచ్చరిక
- మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరిక

వాయవ్య, మధ్య బంగాళా ఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం.. పశ్చిమ దిశగా కదిలి వాయుగుండంగా బలపడే ➤ 2వ పేజిలో..



## ఉల్లి దండతో షర్మిల యాత్ర

### సిఎం చంద్రబాబును కలిసేందుకు యత్నం - అడ్డుకున్న పోలీసులు

రైతు సమస్యల పరిష్కారం కోసం సీఎం చంద్రబాబును కలసివినతిపత్రం అందజేస్తానని బయలుదేరినకాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను పోలీసులు అడ్డుకున్నారు. మధ్యాహ్నం విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో 'రైతన్నకు అండగా కాంగ్రెస్' కార్యక్రమాన్ని చేపట్టారు. సీఎంను కలిసేందుకు ఏపీ కాంగ్రెస్ కార్యాలయం నుంచి వైఎస్ షర్మిల బయదేరారు. మెడలో ఉల్లిపాయల ➤ 2వ పేజిలో..

## అనంత వర్సిటీలో అక్రమాలపై కమిటీ



### ఆంధ్రా వర్సిటీ విషయంలో ఆందోళన సరికాదా
### అసెంబ్లీలో మంత్రి లోకేశ్ వెల్లడి

**అమరావతి,** అనంతపురం శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలో 2019-24 నడుమజరిగిన అక్ర మాలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని విద్యా శాఖ మంత్రి

2



### బాలకృష్ణ వ్యాఖ్యలు వినటానికే
## సిగ్గు పడుతున్నాం

- స్పీకర్ ఎందుకు వారించలేక పోయారో
- మాజీసీఎం, నటుడు చిరంజీవిని అవమానించినా లెక్కలేదా
- మండలిలో విపక్షనేత బొత్స సత్యనారాయణ ఆగ్రహం


### భారత్, అమెరికా
## వాణిజ్య చర్చలు

- పరస్పర విశ్వాసంతో అడుగులు
- పీయూష్ గోయెల్ నేతృత్వంలో బృందం వెల్లడి



**న్యూఢిల్లీ:**భారత్, అమెరికాలకు మేలు చేసేలా, సాధ్యమైనంత త్వరగా ద్వైపాక్షిక వాణిజ్య ఒ ప్పందం కుదర్చుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర వాణిజ్య శాఖ వెల్లడించింది. వాణిజ్య సమస్యలపై చర్చల కోసం ➤ 2వ పేజిలో..

## మరోమారు ట్రంప్ సుంకాల బాదుడు



- ఫార్మా ఉత్పత్తులపై వందశాతం టాక్స్
- భారతీయ ఔషధ పరిశ్రమలు లక్ష్యంగా సుంకాలు

**వాషింగ్టన్:**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సుంకాలతో విరుచుకు పడ్డారు. ఫార్మా దిగుమతులపై భారీగా సుంకాలు విధిస్తూ బాంబు పేల్చారు. బ్రాండెడ్, పేటెంట్ ఉన్న ఔషధ ఉత్పత్తుల దిగుమ తులపై 100 శాతం సుంకాలు విధిస్తామని ప్రకటించారు. అమెరికాలో ప్లాంట్‌లను నిర్మిస్తున్న విదేశీ ఔషధ తయారీ సంస్థలకు ఈ సుంకాలు వర్తించవని పేర్కొన్నారు. అదేవిధంగా అప్‌హోస్టర్డ్ ఫర్నిచర్‌పై 30 శాతం, భారీ ట్రక్కులపై 25 శాతం దిగుమతి సుంకాలు విధించ నున్నట్లు వెల్లడించారు. అలాగే కిచెన్ క్యాబినెట్, బాత్‌రూమ్ వానిటీ లపై 50 శాతం టారీఫ్‌లు విధిస్తున్నట్లు చెప్పారు. ఈ నిర్ణయం అక్టోబర్ 1 నుంచి అమల్లోకి తీసుకొస్తామన్నారు. జాతీయ భద్రతతో పాటు ఇతర కారణాలను పరిగణనలోకి తీసుకుని ➤ 2వ పేజిలో..

## బీహార్‌లో ఎన్నికల తాయిలం

- ఒక్కో మహిళ ఖాతాలో పదవేలు
- మహిళా రోజ్‌గార్‌కు ప్రధాని మోదీ ప్రారంభం



**న్యూఢిల్లీ/పాట్నా:**అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తోన్న తరుణంలో బిహార్ ప్రభుత్వం అక్కడి మహిళలకు నవరాత్రి కానుక అందించింది. ఒక్కొక్కరికీ రూ.10వేలు చొప్పున 75లక్షల మంది మహిళల ఖాతాల్లో డబ్బు జమ చేసింది. శుక్రవారం ప్రధాని నరేంద్రమోదీ 'ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన' ప్రారంభించడం ద్వారా నేరుగా వారి ఖాతాల్లోకి నగదు బదిలీ చేశారు. దిల్లీలో ఉన్న మోదీ వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దీనికి బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్, ఇతర మంత్రులు హాజరయ్యారు. రూ.7,500 కోట్లతో బిహార్‌లోని ఎన్డీయే ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకు వచ్చింది. మహిళా సాధికారత, స్వయంఉపాధి కల్పించడం దీని ఉద్దేశం. ప్రతి కుటుంబంలో ఒక మహిళకు ఈ స్కీమ్ కింద రూ.10వేలు నేరుగా అందాయి.

తర్వాత వివిధ దశల్లో ఆ సహా యం రూ.2 లక్షల వరకు ఉండనుంది. స్వయంఉపాధి కోసం పశుపోష ణ, వ్యవసాయం, –టైలరింగ్ వంటి రంగాల్లో ఆ మొత్తాన్ని ఉపయో గించుకోవచ్చని ప్రభుత్వం ఓ ప్రకటనలో వెల్లడించింది.. ఈ కార్యక్రమం సందర్భంగా లబ్ధిదారులను ఉద్దేశించి మోదీ మాట్లాడారు. ఈ నవరాత్రి సందర్భంగా బిహార్ మహిళల సంతోషంలో నేనూ భాగమైనందుకు ఆనందంగా ఉంది. ఇక్కడ నాకు స్క్రీన్‌పై లక్షలాదిమంది మహిళలు కనిపిస్తున్నారు. వారి ఆశీర్వాదాలు మాకు గొప్ప బలం అని పేర్కొన్నారు. ప్రధానమంత్రి మోదీ మీకోసం పని చేస్తున్నారు. గత ప్రభుత్వం అలా కాదు. లాలూ ప్రసాద్ యాదవ్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ... సీఎం పదవిని కోల్పోయినప్పుడు.. తన సతీమణిని ముఖ్యమంత్రిని చేశారు. తన కుటుంబం గురించి మాత్రమే ఆందోళన చెందారు. మేం మాత్రం బిహార్ ప్రజలందరి కోసం పనిచేస్తామని విపక్ష ఆర్జేడీపై నీతీశ్‌కుమార్ విమర్శలు చేశారు.

# ఆర్థిక వృద్ధిపై మొండి బకాయిలదెబ్బ


### ఎగవేత దారుల్లో కనిపించని భయం - సామాన్య ఖాతాదారులే బలిపశువులు



**ముంబయి:**పెద్దలు ఎగవేసిన మొత్తాల కారణంగా సామాన్యులకు గుదిబండగా మారింది. సామాన్యులు రూపాయి బాకీ ఉన్నా ముక్కుపిండి వసూలు చేస్తున్న బ్యాం కర్లు పెద్దల అప్పులపై నోరు మెదపడం లేదు. మొండి బాకీల భారం సామాన్యులపై భారీగా పడుతోంది. వాటి నష్టాన్ని పూడ్చుకోవడానికే అన్నట్లుగా బ్యంకులు ఖాతాదారులపై ఇష్టం వచ్చినట్లుగా ఛార్జీలు వేస్తున్నారు. కొన్ని కేసుల్లో రుణగ్రహీతలను వదిలి బ్యాక్ అధికారులను బాధ్యులను చేస్తున్నారు.అక్రమ రుణాలకు సహకరించిన బ్యాంక్ అధికారులు మాత్రం ఊచలు లెక్కిస్తున్నారు. ఇలాంటి వారి భరతం పట్టే ఉపాయాలు ఆలోచించడం లేదు. తాజాగా బ్యాంకుల్లో దోపిడీ ఘటనలు ఆందోళన కలిగిస్తు న్నాయి. తాకట్టు బంగారాన్ని మాయం చేస్తున్నారు. నకిలీ బంగారంతో రుణాలు ఇప్పి స్తున్నారు. బ్యాంక్ ఖాతాల్లో ఉన్న నగదను మార్చేస్తున్నారు. ఇవి కొత్త తరహా మోసాలు బయట పడుతున్నాయి. సామాన్యుల రుణాల విషయంలో ముక్కుపిండి వసూలు చేస్తున్న బ్యాంకులు పెద్దల విషయంలో మిన్నకుంటున్నారు. ➤ 2వ పేజిలో..

### ఆందోళన విరమించిన
## ఎయూ విద్యార్థులు

### ఎయూ ఘటనపై విచారణకు కమిటీ ఏర్పాటు




**విశాఖపట్నం, (ని:** ఏయూ విద్యార్థులు నిరసన విరమించారు. జిల్లా కలెక్టర్ ప్రతినిధిగా కోపరేటివ్ సొసైటీ అధికారిణి త్రివేణి వర్సిటీకి వచ్చారు. కేజీహెచ్ సూపరింటెండెంట్, ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, మరొక వైద్య నిపుణుడితో కలిసి కమిటీ వేస్తున్నట్లు చెప్పారు. దసరా సెలవులు పూర్తయ్యేలోగా డిస్పెన్సరీకి ➤ 2వ పేజిలో..

## బాలకృష్ణ వ్యాఖ్యలు

# వినటానికే సిగ్గు పడుతున్నాం

అమరావతి, (నినాదం): అసెంబ్లీలో టీడీపీ ఎమ్మెల్యే, నటుడు నందమూరి బాలకృష్ణ వ్యాఖ్యలు వినటానికి సిగ్గుపడుతున్నాం అని మండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ అన్నారు. బాలయ్య అసెంబ్లీలో మామూలుగా ఉన్నాడా? అని ప్రశ్నించారు. మాజీ సీఎం వైఎస్ జగన్, చిత్ర పరిశ్రమలో ముఖ్య హీరో చిరంజీవిని అవమానించడం సరికాదని మండిపడ్డారు. మండలి చైర్‌లో ఒక దళితుడు కూర్చున్నాడని అవమానించాలని చూస్తున్నారన్నారు. రాజ్యాంగంలో ప్రతీ ఒక్కరికీ ప్రతిపాదించిన హక్కులు కాపాడాలని, కానీ చట్టసభల్లో ఇలా జరగటం దురదృష్టకరం అని మండలి విపక్షనేత బొత్స పేర్కొన్నారు. సభలో నారా లోకేష్ మమ్మల్ని ఎవరేం పీకుతారు అన్నారు. వాళ్ళ వ్యవహారశైలి అలాగే ఉంది. మాజీ ముఖ్యమంత్రి అన్నా గౌరవం లేదు, సినీ పరిశ్రమకు చెందిన మాజీ కేంద్ర మంత్రి అన్న గౌరవం లేదు. బాలకృష్ణ పెద్ద పూడింగి అనుకుంటున్నారు. ఏం చూసి మీ అహంభావం. వాళ్ళ పార్టీ నుంచి ఇంతవరకు వివరణ లేదు. స్పీకర్ చాలా పెద్ద మాటలు మాట్లాడుతాడు.. ఎందుకు స్పందించలేదు. ఒక మాజీ సీఎం, చిత్ర పరిశ్రమకు చెందిన వ్యక్తిని అవమానిస్తే పట్టించుకోరా?. మేం కేవలం సభా సంప్రదాయాల గురించి మాట్లాడుతున్నాం. చిరంజీవికి అవమానిస్తే జనసేన ఎందుకు స్పందించలేదనేది మాకు అనవసరం, వారి విజ్ఞతకే వదిలేస్తున్నాం అని బొత్స అన్నారు. శాసనసభ, మండలిని ఏ ప్రభుత్వం కూడా స్వప్రయోజనాల కోసం చూడలేదు. చంద్రబాబు నాయకత్వంలో ఉభయ సభలను తమ జేబు సంస్థగా చూస్తున్నారు. మండలి సభ్యులకు రాజ్యాంగ పరంగా వచ్చే హక్కులు ఇవ్వటం లేదు. మండలి చైర్మన్ కు కూడా ప్రోటోకాల్ కూడా ఇవ్వటం లేదు. మండలిలో ఇదే అంశంపై ప్రశ్నిస్తే సమాధానం లేదు. నిన్న అసెంబ్లీ సముదాయంలో ఒక బిల్డింగ్ ప్రారంబించారు. ఆ శిలాఫలకాల మీద వాళ్లకు సంబంధించిన ముఖ్యుల పేర్లు వేయించారు, ఎక్కడా చైర్మన్ పేరు లేదు. వీరికి రాజ్యాంగ వ్యవస్థల మీద గౌరవం లేదు. తిరుపతిలో జరిగిన మహిళా సదస్సుకు లోక్ సభ స్పీకర్ వచ్చారు. ఆ కార్యక్రమానికి స్పీకర్, డిప్యూటీ- స్పీకర్, కౌన్సిల్ డిప్యూటీ- స్పీకర్ లకు ఆహ్వానించారు. కనీసం సంప్రదాయం ప్రకారం అయినా గౌరవించాలి. జీవో 59 ప్రకారం మండలి చైర్మన్ ను ఆహ్వానించాలి. ప్రయారిటీ- ఆఫ్ ఆర్డర్ ప్రకారం రాజ్యాంగం కల్పించిన హక్కులు కాలరాస్తున్నారు. ఇది జేబు సంస్థా లేక టీ-డీపీ ఆఫీసా. అసెంబ్లీని రాజకీయాలకు వాడుకోవటాన్ని ఖండిస్తున్నాం. సభ్యులకు పెట్టిన క్రీడా పోటీ-ల్లో కూడా చైర్మన్ ను గౌరవించలేదు. దీనికి ఎవరు బాధ్యులు అని సీఎం సమాధానం చెప్పాలి. తక్షణమే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. దేవాలయం లాంటి ప్రాంగణాన్ని కాపాడుకోవాలి. ప్రభుత్వం సమాధానం చెప్పే వరకు నిరసనలు కొనసాగుతాయని బొత్సహెచ్చరించారు.

## మరోమారు ట్రంప్

# సుంకాల బాదుడు

ఈ టారిఫ్‌లు విధిస్తున్నట్లు తన సోషల్ మీడియా మాధ్యమం ట్రూత్ ద్వారా ట్రంప్ తెలిపారు. అమెరికా అధ్యక్షుడు తీసుకున్న ఈ నిర్ణయంతో భారతీయ ఫార్మా పరిశ్రమపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. భారత ఫార్మా కంపెనీలకు అమెరికా అతిపెద్ద మార్కెట్‌గా ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో భారత్ మొత్తంగా 27.9 బిలియన్ డాలర్ల విలువైన ఫార్మా ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసింది. ఇందులో 8.7 బిలియన్ డాలర్ల విలువైన ఔషధాలు అమెరికాకే ఎగుమతి అయ్యాయి. అంటే మొత్తం ఎగుతుల్లో ఇది 31 శాతం. ఇక అగ్రరా జ్యంలో ఉపయోగించే జనరిక్ ఔషధాల్లో 45 శాతం, బయోసిమిలర్ ఔషధాల్లో 15 శాతం మన దేశం నుంచి సరఫరా చేసినవే కావడం గమనార్హం.

## భారత్, అమెరికా

# వాణిజ్య చర్చలు

అమెరికాకు వెళ్లిన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూశ్ గోయల్ నేతృత్వంలోని భారత ప్రతినిధి బృందం ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది. అగ్రరాజ్యం సైతం భారత్‌లో తమ వ్యాపార కార్యకలాపాలను మరింత పెంచుకోవాలనే ఆలోచనను వ్యక్తం చేసినట్లు తెలిపింది. భారత్‌తో టారిఫ్ చర్చలు గొప్పగా జరుగుతున్నాయని అమెరికా వాణిజ్య కార్యదర్శి హోవార్డ్ లుట్నిక్ తెలిపారు. ఇరుదేశాలు సమష్టిగా ప్రయోజనాలను గుర్తించాయన్నారు. పరస్పర ప్రయోజనకర వాణిజ్య ఒప్పందం కోసం ఇరు దేశాల చర్చలు సానుకూల దృక్పథంతో కొనసాగుతున్నా యని.. ఈ చర్చలు ఫలప్రదమై త్వరలోనే ఒప్పందం ఖరారవుతుందనే సంకేతాలు కనిపిస్తున్నట్లు పేర్కొంది. వాణిజ్య ఒప్పందంలోని వివిధ అంశాలపై భారత ప్రతినిధి బృందం అమెరికా ప్రభుత్వంతో నిర్మాణాత్మక సమావేశాలు నిర్వహించినట్లు వాణిజ్య శాఖ వెల్లడించింది. మరో వైపు అక్టోబరులో మలేసియా వేదికగా జరగనున్న ఆసియాన్ శిఖరాగ్ర సమావేశానికి ప్రధాని మోదీ, ట్రంప్ హాజరవ్వనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ సదస్సుకు అనుబంధంగా జరగనున్న మోదీ-ట్రంప్ మధ్య ద్వైపాక్షిక భేటీలో వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన విషయాలపై చర్చించే అవకాశం ఉన్నట్లు- తెలుస్తోంది. ఇప్పటికే రష్యా చమురు కొనుగోలు చేస్తుందన్న కారణంతో భారత్‌పై ట్రంప్ 50శాతం సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. దానిపై ఇరుదేశాల మధ్య వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయి. ఈ పరిణామాల వేళ ట్రంప్ తాజాగా ఫార్మా ఉత్పత్తులపై టారిఫ్‌లు విధించారు. దీంతో పరిస్థితులు మరింత గందరగోళంగా మారాయి. అమెరికాలో ఉపయోగించే జనరిక్ ఔషధాల్లో 45శాతం, బయోసిమిలర్ ఔషధాల్లో 15శాతం భారత్ సరఫరా చేసినవే. డాక్టర్ రెడ్డీస్, అరబిందో ఫార్మా, జైడస్, సన్‌ఫార్మా, గ్లాండ్ ఫార్మా వంటి సంస్థల మొత్తం ఆదాయంలో 30-50శాతం అమెరికా మార్కెట్ నుంచే లభిస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇప్పుడు ట్రంప్ విధించిన టారిఫ్‌లతో అమెరికా మార్కెట్‌లో ఈ ఔషధాల ధరలు రెట్టింపు కానున్నాయి.

## ఆందోళన విరమించిన

# ఏయూ విద్యార్థులు

సంబంధించి అన్నీ పూర్తి స్థాయిలో సమకూర్చేందుకు అంగీకరించారు. విద్యార్థులు 10 డిమాండ్లు తమ ముందుంచారని, వాటిని పరిశీలించి దసరా సెలవులు పూర్తయ్యేలోపు పరిష్కరిస్తామని వీసీ హామీ ఇచ్చారు. ఏయూలోని శాతవాహన వసతిగృహంలో ఉంటున్న విద్యార్థి మణికంఠ గురువారం మృతిచెందిన విషయం తెలిసిందే. ఏయూ డిస్పెన్సరీ విభాగంలో సరైన సౌకర్యాలు లేక మృతి చెందాడని నినాదాలు చేస్తూ గత రెండు రోజులుగా ఆందోళన చేపట్టారు. పోలీసులను వెనక్కి పంపాలని.. మృతుడి కుటుంబానికి రూ.కోటి పరిహారం అందించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. శుక్రవారం అక్కడికి వచ్చిన వీసీకి వ్యతిరేకంగా విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ క్రమంలో పోలీసులు, విద్యార్థుల మధ్య తోపులాట చోటు-చేసుకుంది. దీంతో జిల్లా అధికార యంత్రాంగం జోక్యం చేసుకొని పరిస్థితిని చక్కదిద్దారు.

# వైకాపా హయాంలో దెబ్బతిన్న రాష్ట్రం ఇమేజ్

పైప్‌లైన్ మార్గం కూడా కీలకంగా మారిందని చెప్పుకొచ్చారు. పైప్‌లైన్ ద్వారా గ్యాస్, నీరు, స్లర్రీ లాంటివి రవాణా చేసేందుకు ఆస్కారం ఉందని వెల్లడించారు. మల్టీమోడల్ ట్రాన్స్‌పోర్టు సిస్టమ్ ద్వారా హైయ్యర్ కార్గో రవాణా చేస్తే వ్యయం తక్కువ అవుతుందని వివరించారు. ఏపీకి ప్రస్తుతం డ్రై పోర్టుల ప్రాజెక్టులు పెద్దఎత్తున వస్తున్నాయని పేర్కొన్నారు. లాజిస్టిక్స్ ఎకో సిస్టమ్ లో మౌలిక సదుపాయాలే ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని ఉద్ఘాటించారు. దీని కోసం ఓ బ్లూ ప్రింట్ తయారు చేసి వ్యయం తగ్గించటమే లక్ష్యంగా పనిచేస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. భారతదేశ లాజిస్టిక్స్ కాస్ట్ రూ.24 లక్షల కోట్లు-. పాత్ హోల్స్ ఫ్రీ రోడ్లు చేయడానికి అన్ని ప్రయత్నాలు చేశాం. ఇంకా చాలా చేయాల్సి ఉంది. డబ్బులు ఎంతైనా ఫర్వాలేదు.. అయితే పాత్ హోల్ ఉంటే వదిలిపెట్టనని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని ఆదేశించాను. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో బ్లాక్ సాయిల్ అవ్వడంతో వెంటనే రోడ్లు దెబ్బతింటున్నాయి. రాయలసీమలో ఆ ఇబ్బంది ఉండదు. మొదట్లో గుంతల మూలంగా కోల్‌కత్తా నుంచి చెన్నైకి వెళ్లాలంటే నాలుగైదు రోజులు పట్టేది. అప్పటి ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పాయితో మాట్లాడి స్వర్ణ చతుర్భుజికి శ్రీకారం చుట్టాం. రోడ్లు నాగరికతకు చిహ్నం. 4,739 కిలోమీటర్లు జాతీయ రహదారులు ఏపీలో ఉన్నాయి. వెయ్యి స్కేర్ కిలోమీటర్లకు 53 కిలోమీటర్ల మేర జాతీయ రహదారులు ఉన్నాయి. ఇప్పుడున్నవి కాకుండా రెండు లైన్లు, నాలుగు రైల్వే లైన్లు చేస్తామని కేంద్ర ప్రభుత్వం చెప్పింది. అలాగే హైస్పీడ్ రైల్వే కారిడార్‌కూ కేంద్రం అంగీకరించింది' అని సీఎం చంద్రబాబు గుర్తుచేశారు. హైదరాబాద్- బెంగళూరు కారిడార్, హైదరాబాద్ చెన్నై కారిడార్ నాలుగు లైన్ల రైల్వే లైన్లు రాబోతు న్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విశాఖపట్నంలో రైల్వేజోన్‌ను ఏర్పాటు చేశాం. ఆంధ్రప్రదేశ్ నుంచి హైస్పీడ్ రైళ్లు కూడా వెళ్లనున్నాయి. 1053 కిలోమీటర్ల సమద్రతీర ప్రాంతం ఏపీకి ఉంది. గుజరాత్ తర్వాత 320 మిలియన్ టన్నుల కెపాసిటీతో మనం హ్యాండిల్ చేయొచ్చు. అయితే 12 మిలియన్ టన్నులను మాత్రమే.. ఇప్పుడు హ్యాండిల్ చేయగలిగే రెండో స్థానంలో ఏపీ ఉంది. రామాయ పట్నం ఏప్రిల్ 26వ తేదీకి, మచిలీపట్నం డిసెంబర్ 26వ తేదీకి పూర్తిచేయాలని టార్గెట్‌గా పెట్టుకున్నాం. ఫిషింగ్ హర్బర్‌లు అన్ని పూర్తయితే మత్స్యకారులకు ఉపాధి లభిస్తోందన్నారు. అమరావతి నుంచి కృష్ణా నదిలో ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ కనెక్ట్ చేశాం. ఏపీలో ఆరు ఎయిర్‌పోర్టుల ఆపరేషన్ జరుగుతున్నాయి.. ఇంకొక్కటి విశాఖప ట్నం ఎయిర్ పోర్టు నడుస్తోంది. విశాఖపట్నంలో రానున్న ఆగస్టు కల్లా మరో ఎయిర్ పోర్టు ఆపరేషన్‌కు వస్తుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్యాసింజర్ ట్రాఫిక్ పెరిగిందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. స్థానిక భూములు, ట్రాఫిక్ పరిస్థితులు చూసి రోడ్లు వేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. హైవేల విషయంలో దేశంలో రెండో స్థానంలో ఉన్నాం. హైవేల్లో రూ.లక్షన్నర కోట్ల విలువైన పనులు జరుగుతున్నాయి. రైల్వే డబుల్ లైన్లను నాలుగు వరుసలుగా మార్చే అవకాశముంది. రైల్వేలో హైదరాబాద్- బెంగళూరు, హైదరాబాద్- చెన్నై మధ్య హైస్పీడ్ ఎలివేటెడ్ కారిడార్లపై చర్చలు జరుగు తున్నాయి. మన రాష్ట్రంలో రైల్వేలో 145 రకాల పనులు జరుగుతున్నాయి. మేం వచ్చిన వెంటనే విశాఖ రైల్వే జోన్ ప్రారంభించాం. దీర్ఘకాలంగా ఉన్న పెండింగ్ అంశాలపై దృష్టి సారించాం. నియోజకవర్గాల్లో జరిగే అభివృద్ధిపై ఎమ్మెల్యేలు దృష్టి పెట్టాలి. లాజిస్టిక్స్‌పై రూ.2.5లక్షల కోట్లు- ఖర్చు పెట్టే అవకాశం ఉంది. కియా కోసం 8 నెలల్లో రిజర్వాయర్ పూర్తి చేసి నీరు ఇచ్చాం. పక్క రాష్ట్రాలకు వెళ్తామన్న అనేక కంపెనీలను ఏపీకి తెచ్చాం. సత్సంబంధాలు ఉంటేనే పరిశ్రమలు వస్తాయి.. బెదిరిస్తే రావు. పరిశ్రమలను ఇక్కడికి తెచ్చేందుకు అనేక కష్టాలు పడ్డాం అని అన్నారు..

# జిఎస్టీ సంస్కరణలతో 8వేలకోట్ల లబ్ది

జీఎస్టీ సవరణ బిల్లును ఆయన శాసనసభలో ప్రవేశపెట్టగా ఆమోదం పొందింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జీఎస్టీ వంటి విప్లవాత్మక మార్పు ప్రపంచంలోనే ఎక్కడా జరగలేదని తెలిపారు. ఈ ఘనత ప్రధాని నరేంద్ర మోదీకి దక్కుతుందని పేర్కొన్నారు. శాసనసభలో ఆమోదం పొందిన 7 బిల్లులకు మండలి ఆమోదముద్ర వేసింది. సంబంధిత శాఖల మంత్రులు సభలో బిల్లులను ప్రవేశపెట్టి వాటిని ఆమోదించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ సవరణ బిల్లు 2025కు శాసన మండలి ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయం సవరణ బిల్లు 2025, ఆంధ్రప్రదేశ్ పురపాలక శాసనాల సవరణ బిల్లు-2025కు శాసన మండలి ఆమోద ముద్ర వేసింది. ఆంధ్రప్రదేశ్ పురపాలక శాసనాల రెండో సవరణ బిల్లు-2025, ఆంధ్రప్రదేశ్ పురపాలక శాసనాల మూడో సవరణ బిల్లు 2025, ఆంధ్రప్రదేశ్ పురపాలక శాసనాల నాలుగో సవరణ బిల్లు-2025, ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటీల సవరణ బిల్లు 2025కు శాసన మండలి ఏకగ్రీవంగా ఆమోద ముద్ర వేసింది.పల్నాడు జిల్లా గుండ్లపల్లికి చెందిన తెదేపా కార్యకర్త తోట చంద్రయ్యను అత్యంత దారుణంగా హత్య చేశారు. అప్పట్లో ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు ఆ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి రూ.25 లక్షలు ఆర్థిక సాయం చేయడంతో పాటు- పాడె మోశారు. రాజకీయ ప్రేరేపిత హింసకు బలైపోయిన వారికి అండగా నిలబడేందుకు ప్రభుత్వ ఉద్యోగం హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ దిశగా చర్యలు తీసుకున్నాం. తోట చంద్రయ్య కుమారుడు తోట వీరాంజనేయులుకు ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయించాం. సీఎంతో పాటు- మంత్రి నారా లోకేశ్ ఈ విషయంలో చొరవ చూపారు. తీవ్రవాదుల హింసకు బలైపోయిన వారికి ఉద్యోగాలు ఇచ్చిన చరిత్ర గతంలో ఉంది. అదే క్రమంలో ఇప్పుడు రాజకీయ హింసకు బలైపోయిన వారికి ఉద్యోగం ఇస్తున్నారు' అని పయ్యావుల తెలిపారు. నాలా చట్టం రద్దు చేస్తూ ఏపీ శాసనసభ నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన బిల్లును రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ అసెంబ్లీలో ప్రవేశపెట్టగా.. సభ ఆమోదించింది. నాలా చట్టం వల్ల స్థానికంగా ఇబ్బందులు వస్తున్నాయని. భూ మార్పిడి చాలా ఇబ్బంది అవుతోందని మంత్రి తెలిపారు. దీనివల్ల పరిశ్రమల స్థాపన, స్థిరాస్తి రంగం అభివృద్ధికి ఇబ్బందులు వస్తున్నాయన్నారు. అందుకే చట్టాన్ని రద్దు చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారని సభకు వివరించారు.

# ఆర్థిక వృద్ధిపై మొండి బకాయిలదెబ్బ

ఇకపోతే ఆయా బ్యాంకులు విధిస్తున్న ఛార్జీలు చూస్తే బ్యాంక్ ఖాతా లేకపోవడమే ఉత్తతమని ప్రజలు భావిస్తున్నారు. మరోవైపు పాతబకాయిల వసూలుకు సంబంధించి నిర్దుష్ట విధానం అవలంబించడం లేదు. మొండి బకాయిదారుల పేర్లను వెల్లడించాలని గతంలో సుప్రీం ఆదేశించినా ఎందుకనో ఆర్‌బిఐ ముందుకు రావడం లేదు. మొత్తంగా మొండి బకాయిల దెబ్బకు బ్యాంకుల నడ్డి విరుగుతోంది. దేశంలోని 50 అతిపెద్ద రుణ ఖాతాల మొండి బాకీల వల్ల వివిధ బ్యాంకులు దాదాపుగా రూ.2.4 లక్షల కోట్లు వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ గతంలోనే విశ్లేషించింది. ఈ నివేదిక ప్రకారం యాబై కంపెనీలకు ఇచ్చిన అప్పుల్లో మొండి బాకీలుగా మారిన మొత్తంలో 60 శాతం మేర రద్దు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. వీటి మొండిబకాయిలు రూ.4 లక్షల కోట్ల మేర ఉన్నాయి. 50 కంపెనీల్లో 30 శాతం అప్పులు మెటల్ రంగానివే అని గుర్తించారు. నిర్మాణ రంగం 25 శాతం, విద్యుత్ 15 శాతం చొప్పున బ్యాంకులకు నిరర్థక ఆస్తులను మిగిల్చాయి. బ్యాంకుల మొత్తం మొండి బాకీలు రూ.8 లక్షల కోట్లలో ఈ 50 కంపెనీల వాటా దాదాపుగా సగం మేర ఉన్నాయి. మొత్తం నిరర్థక ఆస్తుల్లో కనీసం సగానికి పైగా రుణాలు ఈ రంగాలివే. భారత జిడిపిలో ఇవి 5 శాతం. ఆర్థిక విలువ ఆధారితంగా ఈ రైటాఫ్ విలువను లెక్కించామని క్రిసిల్ రేటింగ్స్ ప్రతినిధి ఒకరు వెల్లడించారు. చివరిగా తీసుకునే రైటాఫ్ విలువ, బ్యాంకుల అంచనాలు, సబ్సిడరీలు వాల్యుయేషన్, కమోడిటీతో మిలితమయ్యే రంగాల ధరల అవుట్‌లుక్‌తో ప్రభావితమై ఉంటుందని క్రిసిల్ వివరించింది. ఈ కంపెనీలన్నీ వ్యాపారంలో సమగ్రత కలిగిలేవని పేర్కొన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న బ్యాంకింగ్ రంగంలో నూతన విధానాలు అమలు చేయడంలో ఆలస్యం వల్ల బ్యాంకులు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. నిర్వహణ వ్యయం పెరగడం, ప్రాజెక్టులకు తగు సమయంలో అనుమతులు లభించకపోవడం తదితర పరిణామాలు కంపెనీల చెల్లింపులపై ఒత్తిడిని పెంచాయి. ఇప్పటికే బ్యాంకులు మొండి బాకీల కింద కేటాయింపులు చేశాయని క్రిసిల్ రిపోర్టులో పేర్కొంది. తాజాగా మరో 20 శాతం పెంచాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నష్టాలను తట్టుకోవడానికి బ్యాంకులకు సరిపడ మూలధనం అవసరం ఉంటుంది.

# విమర్శలతో పాపాలను కడక్కోలేరు

## ప్రజలకు అందుబాటులోకి రాని కెసిఆర్

హైదరాబాద్: బిఆర్ఎస్ విమర్శలు కోటలు దాటుతున్నాయి. ఓ వైపు హరీష్ రావు, మరోవైపు కెటిఆర్ చేస్తున్న విమర్శలు గురివింద సామెతను గుర్తు చేస్తున్నాయి. బంగారు తెలంగాణ జరిగివుంటే ఇన్ని సమస్యలు మళ్లీ ఎందుకు వచ్చాయన్నది ఆలోచించాలి. ఇకపోతే కెసిఆర్ సామాన్యులకు అందుబాటులో ఉండడన్న విషయం అధికారంలో ఉన్నప్పుడే అందరికీ తెలుసు. అలాగే అధికారం కోల్పోయినా అలాగే వ్యవహరిస్తున్నారు. ఉద్యమ సమయంలో కూడా అదే ధోరణి కనబర్చారు. ఆయన నేరుగా ప్రజలను కలుసుకునే వీలు లేకుండా తన వైఖరిని ధృడపర్చుకున్నారు. అందుకే ప్రజలు ఆయనను కలవడానికి అవకాశం లేదు. ప్రజలను కలవకుండా,నేతలతో చర్చించకుండా బలమైన నేతగా ఎక్కువ కాలం మనలేరని కూడా రుజువు చేసుకున్నారు. గత పదేళ్ల ఆయన పాలనలో తనకు తానుగా నిర్మించుకున్న ఇనుపగోడల కారణంగా ప్రజల అవసరాలను గుర్తించలేక పోయారు. సమస్యలను ప్రస్తావిస్తే దాటవేతలు లేదా విమర్శలు ఎక్కువయ్యాయి. తెలంగాణ ఏర్పడ్డది మొదలు ప్రజల పక్షాలన నిలిచి పనులు చేసుకుంటూ పోతే ఇవాళ బిఆర్ఎస్ ఇంతగా ఇతర పార్టీలను విమర్శించాల్సిన అవసరం ఏర్పడేది కాదు. ప్రజలను పట్టించుకుని ఉంటే తెలంగాణ ఆకాంక్షను నెరవేర్చిన నేతగా కెసిఆర్‌కు ప్రజలు బ్రహ్మరథం పట్టేవారు. కానీ దాదాపు పదేళ్ల పాటు భరించారు. లాభం లేదనుకుని తీర్పు ఇచ్చారు. దీనిని బిఆర్ఎస్ నేతలు అర్థం చేసుకోవడం లేదు.

తమ పదేళ్ల కాలంలో అంతా బ్రహ్మాండంగా చేశామని డప్పు కొట్టుకుంటున్నారు. అందుకే అదేపనిగా విమర్శల ద్వారా ప్రజల్లో ఉండాలని చూస్తున్నారు. వీరు గతంలోనే ప్రజలకు దగ్గరగా ఉంటే ఆ పార్టీని ప్రజలు విస్మరించేవారూ కాదు. కానీ పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. ఇంకా కాంగ్రెస్,టిడిపి, బిజెపిలను తిడుతూ, సెంటిమెంట్‌ను రెచ్చగొడుతూ పోతే ఓట్లు రాలే పరిస్థితి ఇప్పుడు కూడా లేదు. ఆరుదశాబ్దాల వివక్ష కారణంగా దెబ్బతిన్న తెలంగాణ ప్రాంతానికి నూతన దిశానిర్దేశం చేయడానికి, చరిత్రలో ఒక విశిష్ట నాయకుడిగా నిలవడానికి వచ్చిన అవకాశాలను కెసిఆర్ తనకు తానుగా చేజార్చుకున్నారు. ఎందరో బలిదానాలు చేస్తే తెలంగాణ రాష్ట్రం సిద్ధించినా, ఆ విజయం తనదేనని కెసిఆర్ అన్నా ఎవరుకూడా పెద్దగా అభ్యంతరం చెప్పలేదు. ఒక ఆశయం కోసం సుదీర్ఘపోరాటం జరిపి, దాని విజయాన్ని ప్రజలంతా కెసిఆర్ చేతిలో పెట్టారు. అయితే కెసిఆర్ సిఎం అయ్యాక అధికారాన్ని సంఖ్యాబలాన్ని సుస్థిరం చేసుకోవడానికి ప్రజలకు పింఛన్లు, తాయిలాలు ఇస్తూ సాదాసీదా నాయకుడిగా మిగిలిపోయారు. ప్రజలు ఇలాంటి పందేరాలను కోరుకోలేదు. పనులు చేయాలని చూశారు. హామీలను అమలు చేసి కొత్త తెలంగాణకు తెరతీయాలని చూశారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కోసం ఆయన కులవృత్తులకు ఆర్థిక సాయం అందించినా అది ఓట్ల కోసం చేస్తున్న ప్రయత్నంగా నిరూపితమయ్యింది. ఓటుకునోటు పథకాలు అమలవు తున్నాయన్న భావన ప్రజల్లో ఏర్పడింది. చెరువుల పూడికతీత అంతా ఆర్భాటపు ప్రచారంగా సాగింది. మిషన్ భగీరథ కూడా అంతే. ఇలాంటి వాటి ద్వారా లబ్ది పొందాలనుకున్నప్పుడు పటిష్టంగా కార్యక్రమాలు అము చేసి ఉంటే బాగండేది. అవేవీ చేయకుండా కేవలం కేంద్రాన్ని,ఎదుటి వారిని తిట్టడం ఇప్పుడు రాజకీయ ప్రచారంగా మారింది. విమర్శలతో ఒనగూరే ప్రయోజనం సున్నా బిఆర్ఎస్ నేతలు తెలుసుకోవాలి. కవత పార్టీ నుంచి వెళ్లడానికి, ఆమె చేస్తున్న విమర్శలకు ముందు సమాధానం చెప్పాలి. కెసిఆర్ కూడా ఫామ్‌హౌజ్ వీడి బయటకు రావాలి. తమ హయాంలో జరిగిన తప్పులను గుర్తించి చర్చించాలి. అప్పుడే ప్రజలు నమ్ముతారు.

# అనంత వర్సిటీలో అక్రమాలపై కమిటీ

నారా లోకేశ్ శాసనసభలో తెలిపారు. కంప్యూటర్ల కొనుగోలులో దుర్వినియోగం, యూనివర్సిటీ వాహనాలను వ్యక్తిగత అవసరాలకు వినియోగించడం, నిబంధనలకు విరుద్ధంగా పదోన్నతులు, నియామకాలు, రిక్రూటమెంట్‌లో రూల్స్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకపోవడంపై కమిటీ వేస్తామన్నారు. వంద రోజుల్లో నివేదిక తెప్పించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ప్రశ్నోత్తరాల సమయంలో శాసనసభ్యులు ఎంఎస్ రాజు, పల్లె సింధూర రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేశ్ సమాధానమిస్తూ... పారదర్శకంగా విశ్వవిద్యాలయాలు నడిపించాలనే లక్ష్యంతో ప్రజాప్రభుత్వం ఉందని తెలిపారు. గురువారం ఆంధ్రా యూనివర్సిటీలో ఒక విద్యార్థి ఫిట్స్‌తో చనిపోయారని.. దీనిపై కొన్ని విద్యార్థి సంఘాలు ఆందోళన చేయడం సరికాదన్నారు. ప్రభుత్వపరంగా ఎలాంటి తప్పు లేకపోయినా రాజకీయాలు చేయడం సరికాదని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా పారదర్శకంగా యూనివర్సిటీ వీసీలను నియమిస్తున్నట్లు- తెలిపారు. ఆంధ్రా యూనివర్సిటీని టాప్ 100 వర్సిటీల్లో ఒకటిగా తీర్చిదిద్దే బాధ్యతను ముఖ్యమంత్రి తనకు అప్పగించారని పేర్కొన్నారు. కొంతమంది వారి స్వార్థం కోసం కావాలని విశ్వవిద్యాలయాల్లో గొడవలు సృష్టించడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో భవనాలు లేని పాలిటెక్నిక్ కళాశాలలకు నూతన భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు మంత్రి నారా లోకేశ్ శాసనసభలో తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రెండు కళాశాలల భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. చోడవరం, పొన్నూరు, బేతంచర్ల, మైదుకూరు, గుంతకల్లు కాలేజీలకు భూములు కేటాయించామని.. మచిలీపట్నం, కేఆర్ పురం, అనపర్తిలో త్వరలో కేటాయిస్తామని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఎంపీ లాడ్స్, సీఎస్ఆర్ నిధులను అనుసంధానించి సొంత భవనాల నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు. పాలిటెక్నిక్‌లలో అడ్మిషన్లు 70శాతంగా ఉన్నాయన్నారు. కన్వెన్షనల్ కోర్సులకు ఎవరూ రావడం లేదని..వాటిని రీడిజైన్ చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

# ఉల్లి దండతో షర్మిల యాత్ర

మాల వేసుకుని ట్రాక్టర్ ఎక్కారు. ట్రాక్టర్‌తోనే రోడ్డు మీదకు వెళ్లే ప్రయత్నం చేయగా.. అనుమతి లేదంటూ పోలీసులు ఆమెను అడ్డుకున్నారు. రైతుల గురించి ఎవరూ ఏపీలో మాట్లాడటం లేదు. ఒకప్పుడు రైతు గురించి వైఎస్ రాజశేఖర రెడ్డి పట్టించుకున్నారు. రాజశేఖర రెడ్డి రైతులకు రుణమాఫీ చేశారు. రైతులు ఆత్మహత్యల విషయంలో ఏపీ 3వ స్థానంలో ఉంది. ఏపీలో రైతుకు అసలు భరోసానే లేదు. మాటలే చెపుతున్నారు కానీ ఏమీ చేయడం లేదు. మిర్చి, పొగాకు, జొన్న, పత్తి రైతులకు గిట్టు-బాటు- ధర రావడం లేదు. ఉల్లిపాయకు 1200 రూపాయలు ఇస్తామన్నారు, 400 కూడా మార్కెట్ ధర రావడం లేదు. ఉల్లి పంట పారబోసుకుంటు-న్నారు. అసెంబ్లీకి వెళ్ళకుండా, సీఎం చంద్రబాబును కలవకుండా మమ్మల్ని అడ్డుకోవడానికి పోలీసులను మోహరించారు. చంద్రబాబుకు మెమొరాండం ఇవ్వాలి, పోలీసులు ఓవరాక్షన్ చేసి అడ్డుకోవద్దు. యూరియా కూడా తెచ్చుకునే పరిస్థితి కూడా ఈ ప్రభుత్వానికి లేదని వైఎస్ షర్మిల మండిపడ్డారు.

# చరంజీవిని తిడితే పవన్ స్పందించరా

మీడియా యాక్టివిస్టు సవీంద్రారెడ్డి అక్రమ అరెస్ట్ కేసు సీబీఐకి అప్పగించటం శుభపరిణామం అని వైసీపీ మాజీమంత్రి జోగి రమేష్ అన్నారు. ప్రజల గొంతు నులుమే సీఎం చంద్రబాబు ప్రభుత్వానికి ఇది చెంపపెట్టు అని.. లీగల్‌గా, టెక్నికల్‌గా తప్పులు చేయటంలో చంద్రబాబు నేర్పరి అని విమర్శించారు. నేరాలు చేసి ఎలా తప్పించుకోవాలో కూటమి నేతలకు చంద్రబాబు నేర్పుతున్నారని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో వైఎస్ జగన్ నామస్మరణే తప్ప.. మరేమీ కనపడటం లేదని మండిపడ్డారు. ప్రజల మేలు కోసం అసెంబ్లీలో ఎలాంటి చర్చా జరగటం లేదని జోగి రమేష్ పేర్కొన్నారు.రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదు. ప్రజల గొంతు నులుముతున్నారు. సోషల్ మీడియాలో ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారు. చేతగాని, చవట, సన్నాసి ప్రభుత్వం చంద్రబాబుదని మండిపడ్డారు. 16 నెలల తన పాలనపై చంద్రబాబు అసెంబ్లీలో మాట్లాడతారనుకున్నాం కానీ మోసం చేసినప్పుడు దొరక్కుండా లీగల్‌గా, టెక్నికల్‌గా ఎలా తప్పించుకోవాలో వివరించారు. తన దగ్గర ఉన్న ఈ విద్యని కూటమి సభ్యులకు వివరించారు. స్కిల్ స్కాంలో దోపిడీ చేసి అరెస్టు అయి బెయిల్ మీద ఉన్న వ్యక్తి చంద్రబాబు. ఓటుకు నోటు కేసులో రికార్డులతో సహా దొరికిన దొంగ చంద్రబాబు. కానీ లీగల్‌గా, -టె-క్నికల్‌గా తప్పించుకోవటానికి ప్రయత్నిస్తున్నారు. అచ్చెనాయుడు ఈఎస్ఐ స్కాంలో దొరికితే ఆయన్ను అరెస్టు చేయటం తప్పా?. చింతమనేని ప్రభాకర్ జనాన్ని పీడిస్తుంటే అరెస్టు చేస్తే తప్పా?. అంగళ్లు ఘర్షణకు చంద్రబాబే కారణం. పోలీసులు పర్మిషన్ ఇచ్చిన మార్గంలో కాకుండా వేరే దారిలో వెళ్ళి ఘర్షణకు దిగారు. ఒక కానిస్టేబుల్ కళ్లు పోవటానికి కారణమయ్యాడు. ఇవన్నీ వదిలేసి అసెంబ్లీలో ఇంకా జగన్ గారిని దూషించటమే పనిగా పెట్టు-కున్నారు. రైతులకు యూరియా దొరక్క ఇబ్బంది పడుతున్నారని సోషల్ మీడియాలో పోస్టు పెడితే అరెస్టు చేస్తారా?' అని జోగి రమేష్ ప్రశ్నించారు. 'ప్రజా సమస్యలపై పోరాటం చేసే వ్యక్తి వైఎస్ జగన్. తప్పులు చేస్తున్న చంద్రబాబును ప్రశ్నించటం తప్పా?. మెడికల్ కాలేజీల ప్రయివేటీ-కరణపై ప్రశ్నిస్తే కేసులు పెట్టారు. ఇదేనా భావప్రకటన స్వేచ్ఛకు ఇచ్చే గౌరవం?. చేతగాని, సన్నాసి ప్రభుత్వం చంద్రబాబుది. మమ్మల్ని అణచి వేయాలనుకుంటే అది సాధ్యం కాదు. ఏం చేసినా మా నిర్ణయాన్ని నిర్భయంగా ప్రకటిస్తాం. జగన్ కుటుంబాన్ని ఎంత నీచంగా ట్రోల్స్ చేసినా దిగమింగుకున్నాం. ఆ ట్రోల్స్‌పై కూటమి ప్రభుత్వం ఎందుకు స్పందించలేదు?. ఇచ్చిన హామీలు ఎప్పుడు అమలు చేస్తారని జనం చంద్రబాబుని ప్రశ్నిస్తున్నారు. ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, ఆసరా, 20 లక్షల ఉద్యోగాలు, యాభై ఏళ్లకే పెన్షన్లు ఏవీ? ఎప్పుడు ఇస్తారని నిలదీసారు.

## కోస్తాంధ్రకు

# వాయుగండం

అవకాశం ఉందని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం అధికారి తెలిపారు. శనివారం ఉదయానికి దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర మధ్య తీరం దాటే అవకాశం ఉన్నట్లు చెప్పారు. దీని ప్రభావంతో రానున్న ఐదు రోజుల్లో ఏపీలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. మరోవైపు రానున్న 24 గంటల్లో కోస్తా జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖ, అనకాపల్లి, ఏలూరు, ఎన్టీఆర్, ప్రకాశం జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. అల్లూరి, కాకినాడ, పశ్చిమగోదావరి, కోనసీమ, కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప, పల్నాడు, ప్రకాశం, నంద్యాల, కర్నూలు, అనంతపురం జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. వాయుగుండం ప్రభావంతో కోస్తా తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది. ఐదు రోజుల పాటు మత్స్యకారులు వేటకు వెళ్ల వద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. కృష్ణపట్నం ఓడరేవు మినహా మిగతా అన్ని ఓడరేవుల్లోనూ మూడో నెంబరు ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. తీరం వెంబడి 50 నుంచి 60 కిమీ గరిష్ఠ వేగంతో ఈదురుగాలులు వీస్తుండగా.. సముద్రం అలజడిగా మారింది. వాయుగుండం ప్రభావంతో రాగల 48 గంటలు ఉత్తర, దక్షిణ కోస్తా జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురవనున్నాయి. నెల్లూరు, తిరుపతి మినహా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ విస్తారంగా వర్షాలు కురుస్తాయని విశాఖ తుఫాన్ హెచ్చరికల కేంద్రం చెప్పింది. ఇప్పటికే వాయుగుండం ప్రభావం ఉత్తరాంధ్ర మీద మొదలైంది. ఉత్తర, దక్షిణ కోస్తా జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురవనున్నాయి. ఐదు రోజులు పాటు- మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరించారు.

# రాష్ట్రానికి భారీ వర్షం హెచ్చరిక

# అప్రమత్తం అయిన ప్రభుత్వం

## - అధికారులతో మంత్రి టెలీకాన్ఫరెన్స్



**హైదరాబాద్, సెప్టెంబర్26:** రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వచ్చే 24 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాల కలెక్టర్లతో పాటు- సంబంధిత శాఖలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయా జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు.భారీ వర్షాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు మంత్రి గారు శు క్రవారం నాడు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, డీజీపీ జితేందర్‌తో కలిసి కలెక్టర్లు, ఎస్పీలు, హైడ్రా, జీహెచ్ఎంసీ అధికారులతో -టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గడిచిన 24 గంటల్లో భారీ వర్షాలు కురిసిన ప్రధానంగా రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో చేపట్టాల్సిన చర్యలు, వచ్చే 24 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న జిల్లాల్లో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై అధికారులకు మార్గనిర్దేశర చేశారు. ఇరిగేషన్, రవాణా, విద్యుత్, హైడ్రా, జీహెచ్ఎంసీ, రెవెన్యూ విభాగాలు సమన్వయంతో పనిచేసి జనజీవనానికి ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణలో అతిపెద్ద పండుగైన దసరాకు ముఖ్యంగా హైదరాబాద్ నగరం నుంచి ప్రజలు సొంత గ్రామాలకు వెళతారని, వారి రవాణాకు ఎలాంటి ఆటంకాలు ఏర్పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకొని ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయాలని సూచించారు. వికారాబాద్ జిల్లాలో కురిసిన అతిభారీ వర్షాల వల్ల మూసీ నదిలోకి భారీ వరద వస్తోందని, దీనిని దృష్టిలో పెట్టు-కొని మూసీ పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, అవసరమైనచోట ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే శివాజీ బ్రిడ్జి కింద భూలక్ష్మి ఆలయం సమీపంలోని లోతట్టు- ప్రాంతాల్లో నివసిస్తున్న 55 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు- వెల్లడించారు. మూసీ నదిలో నీటి ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు నిరంతరం పర్యవేక్షణలోనే ఉండాలని సూచించారు. ముఖ్యంగా హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ జలాశయాలకు భారీ వరద వస్తున్నందున ముందు జాగ్రత్త చర్యగా వస్తున్న వరదను అంచనా వేసి అంతే పరిమాణంలో ఈ రెండు జలాశయాల నుంచి దిగువకు నీటిని విడుదల చేయాలని ఆదేశించారు. రెండు జలాశయాల నుంచి నీటిని విడుదల చేసే సమయంలో లోతట్టు- ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, అవసరమైతే షెల్టర్ హోమ్‌లను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే రాష్ట్రంలో చెరువులు, కుంటలు పూర్తి స్థాయిలో నిండాయని, రాబోయే వర్షాల వల్ల చెరువులు, కుంటలకు గండ్లు పడకుండా నీటిపారుదల శాఖ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సూచించారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండే లో-లెవెల్ కాజ్‌వేలు వద్ద ప్రమాదాలు జరగకుండా పోలీస్ బందోబస్తును ఏర్పాటు- చేయాలని ఆదేశించారు. జలాశయాలు, జల వనరుల వద్ద సెల్ఫీలు దిగకుండా యువతను నివారించాలని సూచించారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు రెస్క్యూ ఆపరేషన్ టీ-మ్‌లను, అలాగే ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దించాలని ఆదేశించారు.

# రాహుల్ అమెరికా వ్యాఖ్యల దుమారం

## రివిజన్ పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు



**అలహాబాద్, సెప్టెంబర్26):** సిక్కుల గురించి వివాదాస్పద వ్యాఖ్యల కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పిటిషన్ ను అలహాబాద్ హైకోర్టు తిరస్కరించింది. ఈ కేసులో రివిజన్ పిటిషన్ స్వీకరించిన వారణాసి స్పెషల్ కోర్టు ఉత్వర్తులను సవాలు చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్ ను హైకోర్టు కొట్టివేసింది. దీంతో ఈ కేసులో విచారణ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. రాహుల్ గాంధీ 2024లో అమెరికా పర్యటన సందర్భంగా చేసిన వ్యాఖ్యలు అప్పట్లో వివాదాస్పదం అయ్యాయి. భారతదేశంలోని సిక్కులు తలపాగాలు లేదా కారా ధరించడానికి అనుమతి లేదని, గురుద్వారాలలోకి ప్రవేశించడానికి కూడా అనుమతి లేదని ఆయన చేసిన వ్యాఖ్యలపై పిటిషన్ దాఖలైంది. సిక్కులకే కాకుండా ఇండియాలో అన్ని మతాల ప్రజలకు స్వేచ్ఛగా తమ మతాన్ని అనుసరించే అవకాశం లేదని ఆయన విర్జీనియాలో ఓ మీటింగ్ సందర్భంగా అన్నారు. రాహుల్ వ్యాఖ్యలపై 2024 నవంబర్ 28న దాఖలైన పిటిషన్‌ను ప్రత్యేక కోర్టు (ఎంపీ, ఎమ్మెల్యే కోర్టు) విచారణ తర్వాత కొట్టివేసింది. దీంతో నాగేశ్వర్ మిశ్రా అనే వ్యక్తి వారణాసి సెషన్స్ కోర్టులో రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ రివిజన్ పిటిషన్ ను స్వీకరించేందుకు 2025 జూలై 21 స్పెషల్ కోర్టు అంగీకరించింది. దీంతో స్పెషల్ కోర్టు ఉత్తర్వులను రాహుల్ గాంధీ అలహాబాద్ హైకోర్టులో సవాలు చేశారు. ఇరు వైపుల వాదనలు విన్న తర్వాత సెప్టెంబర్ 3న తీర్పును రిజర్వ్ చేసింది కోర్టు. లే-టె-స్టుగా రాహుల్ పిటిషన్ ను అలహాబాద్ హైకోర్టు రిజెక్ట్ చేయడంతో ఆయనపై విచారణ వేగవంతం కానుంది.

# పర్యాటక అభివృద్ధిపై ప్రభుత్వ దృష్టి

## నేడు శిల్పారామంలో టూరిజం కాంక్లేవ్

## హాజరుకానున్న సిఎం రేవంత్



**హైదరాబాద్, సెప్టెంబర్26(:** పర్యాటక రంగం అభివృద్ధిపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా శిల్పారామంలో టూరిజం కాంక్లేవ్ శనివారం జరుగనుంది. ఈ కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. టూరిజం కాంక్లేవ్ ద్వారా పర్యాటక రంగానికి రూ.15 వేల కోట్ల పెట్టుబడులు, 50 వేల ఉద్యోగాలు రానున్నాయి. హుస్సేన్ సాగర్‌లో డబుల్ డెక్కర్ బోట్‌ను 'ముచుకుందా' పేరుతో నేడు ప్రారంభించనుంది. అలాగే, తెలంగాణలో అంతర్జాతీయ స్థాయి హోటళ్లు, వెల్‌నెస్ సెంటర్లు, రిసార్టులు, ఫైవ్‌స్టార్ హోటళ్లు ఏర్పాటు- చేయనుంది. అలాగే, ఫిల్మ్ ఇన్ తెలంగాణ పోర్టల్‌ను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రారంభించనుంది. సినిమా షూటింగ్స్‌కు తెలంగాణ ప్రభుత్వం సింగిల్ విండో అనుమతులు ఇవ్వనుంది. మెడికల్ వాల్యూ టూరిజం పోర్టల్ ప్రారంభించనుంది. ప్రపంచం నలుమూలాల నుంచి పేషెంట్లకు సౌకర్యం కల్పించనుంది. తెలంగాణలో హెలికాప్టర్ టూరిజం ప్రారంభించనుంది. సోమశిల - శ్రీశైలం రూట్‌లో తొలి సర్వీసులు కల్పించనుంది. వీటితో పాటు- సీప్లేన్ టూరిజం కోసం ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. టూరిజం పోలీస్ ఫోర్స్ విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది. టూరిజం పోలీస్ ఫోర్స్‌లో 15 మంది నుంచి 90 మందికి పెంచనుంది. ఇందుకోసం ఐఆర్‌సీటీసీ, ట్రావెల్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకుంది. అలాగే, డిజిటల్ టూరిజం కార్డును కూడా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురానుంది.

## కెసిఆర్‌కు రుణపడి ఉంటా: మాగంటి సునీత

**హైదరాబాద్, సెప్టెంబర్26:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థిగా మాగంటి సునీతను గులాబీ బాస్ కేసీఆర్ ప్రకటించారు. ఈ సందర్భంగా కేసీఆర్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మాగంటి సునీత మాట్లాడుతూ... జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఎవరైనా టికెట్ ఆశించవచ్చని... కానీ తనమీద నమ్మకంతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ టికెట్ ఇచ్చారని చెప్పుకొచ్చారు. కేసీఆర్ చేసిన అభివృద్ధే తనను జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలిపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తాను ఇలాంటి పరిస్థితుల్లో ఎన్నికల్లో పోటీ- చేయాల్సి వస్తోందని ఎప్పుడూ అనుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు మాగంటి సునీత. తన భర్త మాగంటి గోపీనాథ్ పోటీ- చేసినప్పుడు బ్యాగ్రౌండ్ వర్క్ చేశానే తప్పా... బయటకు రాలేదని చెప్పుకొచ్చారు. తన భర్త గోపీనాథ్ మరణాన్ని ఇప్పటికీ జూబ్లీహిల్స్ ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారని తెలిపారు. జూబ్లీహిల్స్ ప్రజలకు గోపీనాథ్ పెద్ద కొడుకుగా ఎప్పుడూ అందుబాటు-లో ఉండేవారని స్పష్టం చేశారు. పార్టీలో అందర్నీ కలుపుతూ ముందుకు వెళ్తానని వెల్లడించారు. బీఆర్ఎస్ నాయకత్వం మద్దతుతోనే ఇక్కడి వరకూ వచ్చానని క్లారిటీ- ఇచ్చారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌ను తన భర్త గోపీనాథ్ పటిష్టంగా తయారు చేశారని మాగంటి సునీత పేర్కొన్నారు.

# నూతన డిజిపిగా శివధర్ రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్26(:** తెలంగాణ నూతన డీజీపీగా శివధర్ రెడ్డిని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నియమించింది. 1994 బ్యాచ్ ఐపీఎస్ అధికారిగా ఉన్నారు శివధర్ రెడ్డి. ప్రస్తుతం ఆయన తెలంగాణ ఇంటలిజెన్స్ చీఫ్‌గా పనిచేస్తున్నారు. శివధర్ రెడ్డిని నియమిస్తూ ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అక్టోబర్ 1వ తేదీన తెలంగాణ డీజీపీగా శివధర్ రెడ్డి బాధ్యతలు చేపట్టనున్నారు.

## అరెస్టుకు భయపడేది లేదు: కెటిఆర్



**హైదరాబాద్, సెప్టెంబర్26:** టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు స్ట్రాంరగ్ కౌంటర్ ఇచ్చారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. తన అరెస్టుపై కాంగ్రెస్ నేతలు కలలు కంటున్నారని కేటీఆర్ విమర్శించారు. తన అరెస్టు కోసం కాంగ్రెస్ నేతలు కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారని ఎద్దేవా చేశారు. అరెస్టు చేసుకోండి... అరెస్టు భయం తనకు లేదని స్పష్టం చేశారు. . తన అరెస్టుతో సీఎం రేవంత్‌రెడ్డికి పైశాచిక ఆనందం తప్ప మరొకటి రాదని కేటీఆర్ మండిపడ్డారు. తాను ఏ తప్పు చేయలేదని... ఏం చేసుకుంటారో చేసుకోవాలని సవాల్ విసిరారు. తనతో రేవంత్‌రెడ్డి లై డిటెక్టర్ టెస్ట్‌కు రావాలని ఛాలెంజ్ చేశారు కేటీఆర్. ఏసీబీ కేసు తనపై ఉందని... రేవంత్‌రెడ్డిపైనా ఏసీబీ కేసుందని గుర్తుచేశారు. ఆర్ఎస్ బ్రదర్స్‌కు ప్రజా సమస్యలు పట్టవని విమర్శించారు. ఆర్ఎస్ బ్రదర్స్‌కు తాను ఏ కారులో తిరుగుతున్నానో మాత్రమే కావాలని ఎద్దేవా చేశారు.

## స్పీకర్‌తో ఫిరాయింపు ఎమ్మెల్యేల భేటీ

**హైదరాబాద్, సెప్టెంబర్26:** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తో బీఆర్ఎస్ పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కాలే యాదయ్య, అరికెపూడి గాంధీ, ప్రకాష్ గౌడ్‌లు శుక్రవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు కూడా పాల్గొన్నారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నోటీసులకు ఇప్పటికే కాలే యాదయ్య, అరికెపూడి గాంధీ, ప్రకాష్ గౌడ్‌లు వివరణ ఇచ్చారు. అయితే, ఈ నెల 30వ తేదీ వరకూ కడియం శ్రీహరి గడువు కోరారు. ఈనెల 29 నుంచి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రత్యక్ష విచారణ చేపట్టే అవకాశాలు ఉన్నాయి. అక్టోబర్ 6వ తేదీ నుంచి 23వ తేదీ వరకు విదేశీ పర్యటనకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వెళ్లనున్నారు. విదేశీ పర్యటనకు ముందే ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంపై విచారణ చేపట్టే అవకాశాలు ఉన్నాయి. ఈక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు భేటీ- కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# ఇంద్రకీలాద్రిపై పోటెత్తిన భక్తులు

## అర్ధరాత్రి వరకు దర్శన సౌకర్యం

**విజయవాడ, సెప్టెంబర్26:** ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. 5వ రోజు అమ్మవారు శ్రీమహాలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం 6 గంటల వరకు 90 వేల మంది భక్తులు అమ్మవారి దర్శనం చేసుకున్నారని ఆలయ ఈవో శీనా నాయక్ తెలిపారు. రద్దీ కొనసాగడంతో పాటు వేలాదిమంది క్యూలైన్‌లో వేచి ఉండడంతో అర్ధరాత్రి 12.30 గంటలకు దర్శనానికి భక్తులను అనుమతిచ్చామని చెప్పారు. అనుకున్నదానికంటే అధికంగా రద్దీ ఉందని, భక్తులు సంతోషంగా క్యూ లైన్లలో వచ్చి దర్శనం చేసుకుంటున్నారని చెప్పారు. వీఐపీలు వచ్చే క్రమంలో సామాన్య భక్తులు కొంత ఇబ్బంది పడుతున్న మాట వాస్తవమేనని ఈవో వ్యాఖ్యానించారు. వీఐపీలకు కేటాయించిన సమయంలో వారిని ఆలయ సిబ్బంది తీసుకెళ్లి దర్శనం కల్పిస్తున్నారని తెలిపారు. సమయం దాటాక వచ్చే వీఐపీలు బంగారు వాకిలి నుంచే దర్శనం చేసుకోవాలని సూచించారు. చిన్న చిన్న సమస్యలను అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నామన్నారు. ఇవాళ ఆర్జితసేవలు, ప్రసాదాలు, ఇతర సేవల ద్వారా రూ.28,21,637లు ఆదాయం వచ్చిందని వివరించారు.

# విద్య,వైద్యాన్ని ప్రభుత్వమే చేపట్టాలి

## ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 28న రౌటండ్ టేబుల్ సమావేశం

**అమరావతి, సెప్టెంబర్26:** ప్రభుత్వ రంగంలోనే వైద్య విద్య, ప్రజారోగ్య వ్యవస్థను కొనసాగించాలని కోరుతూ.. జన విజ్ఞాన వేదిక, ప్రజా ఆరోగ్య వేదికల సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఈ నెల 28వ తేదీన నిర్వహించనున్నట్లు- జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు తెలిపారు. విజయవాడలోని బాలోత్సవ భవన్ లో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బాలోత్సవ భవన్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ రౌండ్‌టేబుల్ సమావేశానికి వైద్య రంగంలో నిపుణులు, వైద్యులు, మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పి.వి రమేష్ తదితరులు హాజరు కానున్నారని తెలిపారు. రాష్ట్రానికి మంజూరైన 17 వైద్య కళాశాలల్లో 10 కళాశాలలను పిపిపి విధానంలో ప్రైవేటీ-కరించేందుకు ఇటీ-వల మంత్రి వర్గం ఆమోదం తెలిపిందన్నారు. ఈ చర్యను జన విజ్ఞాన వేదిక, ప్రజా ఆరోగ్య వేదికలు తీవ్రంగా ఖండిస్తున్నట్లు- చెప్పారు. ఈ కళాశాలల నిర్మాణానికి అవసరమైన నిధుల్లో 60 శాతం కేంద్రం ఇస్తుండగా, రాష్ట్రం మరో 40 శాతం నిధులు సమకూర్చాల్సి ఉందని తెలిపారు. ఇందుకు రాష్ట్ర వాటా రూ.4,500 కోట్లు- అవసరం ఉండగా ఈ నిధులు ఇవ్వలేమంటూ.. రాష్ట్రం పిపిపి విధానం అమలు చేస్తామంటు-ందన్నారు. మంజూరైన 10 కళాశాలల్లో 8 వెనుకబడిన ప్రాంతాల్లోనే ఉన్నాయని చెప్పారు. వీటికి అనుబంధంగా 300 పడకల ఆసుపత్రులు ఏర్పాటు- చేయాల్సి ఉందన్నారు. ఇవి ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉంటే పేదలకు ఉచిత వైద్యం, పేద విద్యార్థులకు వైద్య విద్య అందుబాటు-లో ఉంటాయని తెలిపారు. ప్రజారోగ్య వేదిక రాష్ట్ర నిర్వహణ కార్యదర్శి జి.విజయ ప్రకాష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిర్ణయం వల్ల పేద విద్యార్థులకు వైద్య విద్య అందుబాటు-లోకి లేకుండా పోతుందన్నారు. కొందరు ప్రైవేటు- వ్యక్తులకే ఈ విధానం వల్ల లాభం చేకూరుతుందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేసేందుకు సిద్ధమవుతున్న ఈ విధానాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. తొలుత రౌండ్ టేబుల్ సమావేశం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.శ్రీనివాస్, కోశాధికారి మురళీధర్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.రవి, సహాయ రిజిస్ట్రార్ కె.ఎస్ కోటేశ్వరరావు, లెనిన్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

# గాంధీజయంతి రోజే..దసరా

## మందు షాపులు బంద్ అంటూ బోర్డులు

**హైదరాబాద్, సెప్టెంబర్26** తెలుగు రాష్ట్రాల్లో అతిపెద్ద పండుగ దసరా.. ఈ పర్వదినాన రెండు రాష్ట్రాలప్రజలు ఫుల్ జోష్‌లో ఉంటారు. బంధుమిత్రులందరినీ తమ ఇళ్లకు ఆహ్వానించి సంతోషంగా దసరాను జరుపుకుంటారు. దసరా రోజున ముక్కా, సుక్కతో ఫుల్ ఖుషీ అవుతారు. అయితే, ఈసారి మాత్రం ఆ పరిస్థితి కనిపించేలా లేదు. ఎందుకంటే.. దసరా పండుగ అక్టోబర్ 2వ తేదీన వచ్చింది. అక్టోబర్ 2 గాంధీ జయంతి. దీంతో ఆ రోజున మద్యం అమ్మకాలు పూర్తిగా నిషేధం. ఇదే విషయాన్ని తెలియజేస్తూ ఇప్పటికే చాలా వైన్స్ షాపుల వద్ద దసరా రోజున వైన్ షాప్స్ బంద్ అంటూ ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. సోషల్ మీడియాలోనూ ఈ అంశంపై రీల్స్ మీద రీల్స్ చేస్తున్నారు నెటిజన్లు. మరోవైపు.. అసలే దసరా.. అక్టోబర్ 2న మందు బంద్ అనడంతో.. మద్యం ప్రియులు వైన్ షాపుల వద్దకు పరుగెత్తుకెళ్తున్నారు. ముందే స్టాక్ తీసుకెళ్తున్నారు.

# హైదరాబాద్ వర్షానికి మూసీకి వరద

## మూసారాంబాగ్ వద్ద రాకపోకలు నిషేధం

## మంచిరేవుల వద్ద నిలిచిపోయిన రాకపోకలు

**హైదరాబాద్, సెప్టెంబర్26:** నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం మరోసారి భారీ వర్షం కురియడంతో పలు ప్రాంతాల్లో నగర వాసులు తడిసి ముద్దయ్యారు. వివిధ పనులపై బయటకు వచ్చిన వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బేగంబజార్, కోఠి, నాంపల్లి, హిమాయత్ నగర్, ఖైరతాబాద్, ట్యాంక్ బండ్, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి. జంటజలాశయాలు, హుస్సేన్ సాగర్ పూర్తిగా నిండిపోయాయి. దీంతో గేట్లు ఎత్తి నీటిని వదిలారు. ఈ క్రమంలో మరోమారు మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. రోడ్లపై భారీ వర్షం వల్ల మూసారాంబాగ్ బ్రిడ్జి పై నుంచి మూసీ వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో మూసారాంబాగ్ బ్రిడ్జిపైకి వాహనాలను.. పోలీసులు, రెవెన్యూ అధికారులు నిలిపివేశారు. భారీ వర్షాలకు ఉస్మాన్ సాగర్ నిండిపోవడంతో పైనుంచి నీటిని దిగువ ప్రాంతాలకు వదలడంతో అంబర్‌పేటలోని మూసారాంబాగ్ బ్రిడ్జిపై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో కాచిగూడ ట్రాఫిక్ పోలీసులు బ్రిడ్జిపై బారికేడ్లు ఏర్పాటు- చేసి వాహనాలను పూర్తిగా నిలిపివేశారు. దిల్‌సుఖ్‌నగర్ వైపు నుంచి వచ్చే వాహనాలను గోల్నాక కొత్త బ్రిడ్జి వైపు దారి మళ్లించారు.ఎగువన కురుస్తున్న కుండపోత వర్షాలతో జంట జలాశయాలైన ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ లోకి భారీగా వరద నీరు చేరుతోంది. ఈసా, మూసీ నదుల నుంచి పెద్ద ఎత్తున వరద ప్రవాహం జంట జలాశయాల్లోకి చేరడంతో అవి నిండుకుండలా మారాయి. గంటగంటకు వరద పెరుగుతుండటంతో జలమండలి అధికారులు రెండు జలాశయాల గేట్లను ఎత్తి మూసీలోకి వదులుతున్నారు. సాయంత్రం 4 గంటల వరకు ఉస్మాన్ సాగర్ 11 గేట్లు- 7 ఎడుగుల మేర ఎత్తి 7,986 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో మంచిరేవుల గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. వర్షాకాలం వచ్చిందంటే గండిపేట జలాశయం గేట్లు- ఎత్తడం, తద్వారా మూసీలోకి భారీ వరద ప్రవాహం కారణంగా నార్సింగి, మంచి రేవుల గ్రామాల మధ్యన రాకపోకలు నిలిచిపోవడం మంచిరేవుల గ్రామ ప్రజలకు శాపంగా మారింది. మూసీ నదిపై నాలుగు చోట్ల కల్వర్టులు ఉన్నా.. అన్నీ కూడా లో లెవెల్‌లో ఉండడంతో గండిపేట జలాశయం నాలుగు గేట్లు- ఎత్తి నీటిని విడుదల చేసిన వెంటనే ఈ కల్వర్టులపై నుంచి వరద ప్రవాహం ఉంటుంది. ఈ క్రమంలో.. ముందు జాగ్రత్త చర్యగా అధికారులు కల్వర్టులపై నుంచి రాకపోకలు నిలిపివేసారు. ఈ పరిణామం.. మంచిరేవుల గ్రామస్తులకు ప్రతీ సంవత్సరం వర్షాకాలంలో పెద్ద తలనొప్పిగా మారింది. ఉద్యోగాలు, ఉపాధి కోసం బయటకు వెళ్లిన వారు తిరిగి ఇంటికి చేరుకోవడానికి 4, 5 కిలోమీటర్లు చుట్టూ తిరిగి ఇంటికి చేరుకోవాల్సి వస్తుంది. ఈ సమస్యను అధిగమించేందుకు నార్సింగి, మంచి రేవుల గ్రామాల మధ్యన ప్రస్తుతం ఉన్న కల్వర్టు స్థానంలో పది అడుగుల ఎత్తులో బ్రిడ్జి నిర్మించేందుకు అధికారులు రూ. 40 కోట్లతో ప్రతిపాదనలు చేసి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ప్రభుత్వం ఇప్పటికైనా మంచి రేవుల గ్రామ ప్రజల సమస్యను గుర్తించి నార్సింగి, మంచి రేవుల గ్రామాల మధ్యన బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## చాకలి ఐలమ్మకు ఘనంగా నివాళి

**నల్లగొండ,సెప్టెంబర్26:** రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. తెలంగాణలో తొలి భూపోరాటానికి నాంది పలికిన చాకలి ఐలమ్మ 130వ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోంది. జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన జయంతి ఉత్సవాల్లో భాగంగా నల్లగొండ జిల్లా కేంద్రంలో నాగర్జున సాగర్ రోడ్ లో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు నివాళులర్పించారు కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్ర సక్సేనా. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ.. తెలంగాణలో తొలి భూ పోరాటానికి నాంది పలికిన ధీరవనిత చాకలి ఐలమ్మ అని కొనియాడరు.

# సంపాదకీయం

## రాజకీయ విలువలు లేని నేతలు !

రాజకీయమంటే పదవులు కావాలి. పదవి, హోదా ఉంటేనే ప్రజల గురించి మాట్లాడుతారు. ఎపిలో వైకాపానేత జగన్‌కు ఇది బాగా సరిపోతుంది. విపక్షనేత హోదా ఇస్తే తప్ప అసెంబ్లీకి రానని మొండికేశారు. చివరకు హైకోర్టు గడప తొక్కారు. ఐదేళ్లు సిఎంగా పనిచేసిన వ్యక్తికి నిబంధనలు తెలియకపోవడం, అసెంబ్లీకి రాకపోవడం సిగ్గుచేటు. తనకు విపక్ష పదవి కావాలని దేబురిస్తున్నారు. బయట ఉండి విమర్శలు చేస్తున్నారు. నిజానికి రాజకీయాల్లో రోజురోజుకూ విలువలు పడిపోతున్నాయి. సిద్ధాంతాలు పక్కకు పోయాయి. ఎదుటి పార్టీని ఎలా దిబ్బతీయాలా అన్నదే ఇప్పుడు అన్నిపార్టీల ప్రథమ లక్ష్యంగా మారింది. అధికారంలో ఉంటే అక్రమాలకు పాల్పడడం, ఆస్తులు సంపాదించుకోవడం, ఓడితే ఎదుటి పార్టీని విమర్శించడం అలవాటు చేసుకున్నారు. బిఆర్‌ఎస్, వైకాపాలు ఇదే కోవలో ఉన్నాయి. తమ పాలనలో జరిగిన అవినీతి వ్యవహారాలపై మాత్రం మాట్లాడడంలేదు. ఇకపోతే కొందరు నేతలు అధికారం ఉన్న పార్టీలో ఉండడం అలవాటు చేసుకున్నారు. ఎక్కడ అధికారం ఉంటే అక్కడ చేరిపోతున్నారు. విపక్ష పార్టీలు కూడా సమర్థంగా పనిచేయడం లేదు. అధికార పార్టీని విమర్శించడం, ఐదేళ్ల తరవాత అదృష్టం ఉంటే మళ్లీ మనదే అధికారం అన్న ధోరణిలో రాజకీయాలు నెరపుతున్నాయి. ప్రజల సమస్యలను గాలికి వదిలేసి.. పరస్పర విమర్శలతో పబ్బం గడుపుకునే పరిస్థితిలో రాజకీయ పార్టీలు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ఇప్పుడు అదే పరిస్థితి ఉంది. అనేక విషయాల్లో జగన్ అధికార టిడిపిపై విమర్శలు చేస్తే సరిపోతుందని ఎదురుదాడికి దిగుతున్నారు. తన హయాంలో జరగిన పాపాలపై జగన్ ఏనాడూ విచారణ కోరుకోవడం లేదు. అందుకే రాజకీయాల్లో విలువలు లేవనడానికి ఇంతకన్నా నిదర్శనం అక్కర్లేదు. ఇకపోతే తెలంగాణలో పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించి, భ్రష్టు పట్టించిన బిఆర్‌ఎస్, ఎపిలో ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో దివాళా తీయించిన జగన్ ఇప్పుడు ఒకే తరహా రాజకీయాలు చేస్తున్నారు. ఈ రెండు పార్టీల నేతలు తమ తప్పులను, అప్పులను కప్పి పుచ్చుకోవడానికి ఇప్పుడున్న ప్రభుత్వాలపై విరుచుకు పడుతున్నారు. ప్రాంతీయ పార్టీలు, సిద్ధాంత భావజాలాన్ని కలిగి ఉండడం లేదు. తమ రాజకీయ అవసరాన్ని ప్రజల అవసరంగా చిత్రీకరించి కొందరు పార్టీలు మారుతున్నారు. దీనికి ఎవరూ మినహా యింపు కాదు. అందుకే పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ పెరుగుతోంది. సుప్రీం తీర్పు ఇచ్చి సూచనలు చేశాక, తామంతా బిఆర్‌ఎస్‌లోనే ఉన్నామని పార్టీమారిన పదిమంది ఎమ్మెల్యేలు బుకాయిస్తున్నారు. ఎంతటి నేతలైనా అధికారపార్టీలో చేరడానికి వెరవడం లేదు. రాజకీయనిబద్ధత పక్కకుపెడుతున్నారు. అధికారపార్టీ అయితే తమ పబ్బం గడుపుకోవచ్చు. అందులో చేరడానికి సవాలక్ష కారణాలు చూపాల్సిన అసవరం లేదు. రాజకీయాల్లో విలువలు లేవని, వ్యక్తులకు పార్టీల పట్ల విశ్వాసం కన్నా పదవులపైనే మోహం ఉందనడానికి తాజా రాజకీయాలే ఉదాహరణ. ఇలా ఇప్పుడు ఇరు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయాలు ఆసక్తికరంగా ఉన్నాయి. ఇకపోతే మోడీ పనితీరు నచ్చిందని, దేశానికి ఆయనే ఆశాజ్యోతి అని బిజెపి పార్టీలో చేరేముందు కొందరు ప్రవచానాలు వల్లిస్తున్నారు. గతంలో తెలంగానలో పలువురు బిఆర్‌ఎస్‌లో చేరగా దానిని బిఆర్‌ఎస్ గర్వంగా చాటుకుంది. కానీ ఇప్పుడు తమ ఎమ్మెల్యేలు పార్టీని వీడేసరికి గగ్గోలు పెడుతోంది. ఇలా చేయడంలో కేవలం స్వార్థ రాజకీయాలు తప్ప మరోటి కాదు. ఏ పార్టీ అధికారంలో ఉంటే అక్కడ పదవులు అనుభవించి, పార్టీ అధినేత అడుగలకు మడుగులొత్తిన వారు అధికారం కోల్పోగానే అధికారంలో ఉన్న పార్టీలో చేరేందుకు ఉత్సాహం చూపుతున్నారు.అనేక పదవులు అనుభవించి, రాజకీయం గా ఎదుగుదలకు కారణం అయిన పార్టీని, దాని అధినేతలను తిట్టాల్సినన్ని తిట్లు తిట్టి మరీ పార్టీలు మారుతున్నారు. ఇదంతా రాజకీయంగా తమ అవసరం కోసమే అన్నది వేరుగా చెప్పాల్సిన పనిలేదు. రాజకీయ ఉనికి కోసం అనేక కారణాలు చూపుతున్నారు. అధికారంలో ఉన్నవారు రాజకీయ ఎత్తులు వేస్తూ వీరిని అక్కున చేర్చుకుంటున్నారు. పార్టీ మారదల్చు కుంటే మారాలి. అంతేగానీ వీడుతున్న పార్టీపై విమర్శలు చేస్తే ప్రజలు నమ్మరని నేతలు గుర్తించాలి. రాజకీయ అవసరార్థం ఎప్పుడు ఏదైనా మాట్లాడే అలవాటు మన రాజకీయ నేతలకు ఉంది. చాలామంది ప్రాంతీయ పార్టీల నాయకులు, ముఖ్యమంత్రులు అవకాశం వస్తే ఢిల్లీ గద్దెను ఎక్కాలనే కుతూహలంతో ఉన్నవారు అనేకులు ఉన్నారు. ఏ పార్టీకి కూడా సిద్ధాంతం లేదన్నది తాజా పరిణామాలను బట్టి గమనిం చాలి. అధికారమే అన్ని పార్టీల సిద్ధాంతం. అధికారం ఉంటేనే నేతలు పార్టీని అంటిపెట్టుకుని ఉంటారు. లేకుంటే అధికారం ఉన్న పార్టీలోకి జంప్ అవుతారు. ఇందుకు ఎవరు కూడా మినహాయింపు కాదు. రాష్ట్రం ఏదైనా, పార్టీ ఏదైనా అధికారం ఉంటే అదే తమ పార్టీ అన్న ధోరణిలో నేతలు ఉన్నారు. ఇది రాజకీయ పార్టీల పతనానికి దారితీస్తోంది. ప్రజల సమస్యలపై పోరాడే అవకాశం లేకుండా చేస్తోంది. రాజకీయనేతలు నిబద్ధత కోల్పోతే ఎక్కువ కాలం నేతలుగా మనలేమని గుర్తిస్తే మంచిది. తెలంగాణలో ఓ పదిమంది విపక్ష బిఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. వీరిపై చర్యలు తీసుకోవాలని బిఆర్‌ఎస్ కోర్టుల చుట్టూ తిరుగుతోంది. చివరకు సుప్రీంకోర్టు బాల్‌ను స్పీకర్ కోర్టులో వేసింది. పార్టీ వీడిని వారికి స్పీకర్ నోటీసులు ఇచ్చి, విచారణ చేశారు. తామంతా బిఆర్‌ఎస్‌లోనే ఉన్నామని అంటున్నారు. ఇక ఎపిలోనూ జగన్‌కు వీరవవిధేయులుగా ఉన్నవారు సైతం పార్టీని వీడుతు న్నారు. అధికారం పోవడంతో అధికార టిడిపి, జనసేనల్లో చేరుతున్నారు. వీరు కూడా సిద్ధాంతాలు, గత ప్రభుత్వ వైఫల్యాలను ప్రధానంగా తెరమీదకు తీసుకుని వస్తున్నారు. నిజానికి ఫిరాయింపుల చట్టం పకడ్బందీగా లేకపోవడం, దానిని అమలు చేయాలన్న చిత్తశుద్ధి పాలకుల్లో లేకపోవడం వల్ల ఇష్టం వచ్చినట్లుగా పార్టీ ఫిరాయింపులు సాగుతున్నాయి. ఇందుకు అన్ని పార్టీలది ఒకటే సిద్ధాంతం. దీనికి ఎక్కడో ఒకచోట తెరపడాలి. పార్టీ ఫిరాయింపులు, అవకాశవాద రాజకీయాలపై ప్రజలు నిలదీయడం అలవాటు చేసుకోవాలి.

# విమర్శలతో పాపాలను కడక్కోలేరు

# ప్రజలకు అందుబాటులోకి రాని కెసిఆర్



**హైదరాబాద్, సెప్టెంబర్26:** బిఆర్‌ఎస్ విమర్శలు కోటలు దాటుతున్నాయి. ఓ వైపు హరీష్ రావు, మరోవైపు కెటిఆర్ చేస్తున్న విమర్శలు గురివింద సామెతను గుర్తు చేస్తున్నాయి. బంగారు తెలంగాణ జరిగివుంటే ఇన్ని సమస్యలు మళ్లీ ఎందుకు వచ్చాయన్నది ఆలోచించాలి. ఇకపోతే కెసిఆర్ సామాన్యులకు అందుబాటులో ఉండడన్న విషయం అధికారంలో ఉన్నప్పుడే అందరికీ తెలుసు. అలాగే అధికారం కోల్పోయినా అలాగే వ్యవహరిస్తున్నారు. ఉద్యమ సమయంలో కూడా అదే ధోరణి కనబర్చారు. ఆయన నేరుగా ప్రజలను కలుసుకునే వీలు లేకుండా తన వైఖరిని ధృడపర్చుకున్నారు. అందుకే ప్రజలు ఆయనను కలవడానికి అవకాశం లేదు. ప్రజలను కలవకుండా,నేతలతో చర్చించకుండా బలమైన నేతగా ఎక్కువ కాలం మనలేరని కూడా రుజువు చేసుకున్నారు. గత పదేళ్ల ఆయన పాలనలో తనకు తానుగా నిర్మించుకున్న ఇనుపగోడల కారణంగా ప్రజల అవసరాలను గుర్తించలేక పోయారు. సమస్యలను ప్రస్తావిస్తే దాటవేతలు లేదా విమర్శలు ఎక్కువయ్యాయి. తెలంగాణ ఏర్పడ్డది మొదలు ప్రజల పక్షాలన నిలిచి పనులు చేసుకుంటూ పోతే ఇవాళ బిఆర్‌ఎస్ ఇంతగా ఇతర పార్టీలను విమర్శించాల్సిన అవసరం ఏర్పడేది కాదు. ప్రజలను పట్టించుకుని ఉంటే తెలంగాణ ఆకాంక్షను నెరవేర్చిన నేతగా కెసిఆర్‌కు ప్రజలు బ్రహ్మరథం పట్టేవారు. కానీ దాదాపు పదేళ్ల పాటు భరించారు. లాభం లేదనుకుని తీర్పు ఇచ్చారు. దీనిని బిఆర్‌ఎస్ నేతలు అర్థం చేసుకోవడం లేదు. తమ పదేళ్ల కాలంలో అంతా బ్రహ్మాండంగా చేశామని డప్పు కొట్టుకుంటున్నారు. అందుకే అదేపనిగా విమర్శల ద్వారా ప్రజల్లో ఉండాలని చూస్తున్నారు. వీరు గతంలోనే ప్రజలకు దగ్గరగా ఉంటే ఆ పార్టీని ప్రజలు విస్మరించేవారూ కాదు. కానీ పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. ఇంకా కాంగ్రెస్,టిడిపి, బిజెపిలను తిడుతూ, సెంటిమెంట్‌ను రెచ్చగొడుతూ పోతే ఓట్లు రాలే పరిస్థితి ఇప్పుడు కూడా లేదు. ఆరుదశాబ్దాల వివక్ష కారణంగా దెబ్బతిన్న తెలంగాణ ప్రాంతానికి నూతన దిశానిర్దేశం చేయడానికి, చరిత్రలో ఒక విశిష్ట నాయకుడిగా నిలవడానికి వచ్చిన అవకాశాలను కెసిఆర్ తనకు తానుగా చేజార్చుకున్నారు. ఎందరో బలిదానాలు చేస్తే తెలంగాణ రాష్ట్రం సిద్ధించినా, ఆ విజయం తనదేనని కెసిఆర్ అన్నా ఎవరుకూడా పెద్దగా అభ్యంతరం చెప్పలేదు. ఒక ఆశయం కోసం సుదీర్ఘపోరాటం జరిపి, దాని విజయాన్ని ప్రజలంతా కెసిఆర్ చేతిలో పెట్టారు. అయితే కెసిఆర్ సిఎం అయ్యాక అధికారాన్ని సంఖ్యాబలాన్ని సుస్థిరం చేసుకోవడానికి ప్రజలకు పింఛన్లు, తాయిలాలు ఇస్తూ సాదాసీదా నాయకుడిగా మిగిలిపోయారు. ప్రజలు ఇలాంటి పందేరాలను కోరుకోలేదు. పనులు చేయాలని చూశారు. హామీలను అమలు చేసి కొత్త తెలంగాణకు తెరతీయాలని చూశారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కోసం ఆయన కులవృత్తులకు ఆర్థిక సాయం అందించినా అది ఓట్ల కోసం చేస్తున్న ప్రయత్నంగా నిరూపితమయ్యింది. ఓటుకునోటు పథకాలు అమలవు తున్నాయన్న భావన ప్రజల్లో ఏర్పడింది. చెరువుల పూడికతీత అంతా ఆర్భాటపు ప్రచారంగా సాగింది. మిషన్ భగీరథ కూడా అంతే. ఇలాంటి వాటి ద్వారా లబ్ది పొందాలనుకున్నప్పుడు పటిష్టంగా కార్యక్రమాలు అము చేసి ఉంటే బాగండేది. అవేవీ చేయకుండా కేవలం కేంద్రాన్ని,ఎదుటి వారిని తిట్టడం ఇప్పుడు రాజకీయ ప్రచారంగా మారింది. విమర్శలతో ఒనగూరే ప్రయోజనం సున్నా బిఆర్‌ఎస్ నేతలు తెలుసుకోవాలి. కవత పార్టీ నుంచి వెళ్లడానికి, ఆమె చేస్తున్న విమర్శలకు ముందు సమాధానం చెప్పాలి. కెసిఆర్ కూడా ఫామ్‌హౌజ్ వీడి బయటకు రావాలి. తమ హయాంలో జరిగిన తప్పులను గుర్తించి చర్చించాలి. అప్పుడే ప్రజలు నమ్ముతారు.

## సీమ సమస్యలపై నాన్చివేత వెనకబాటుకు అందరూ బాధ్యులే

**కడప, సెప్టెంబర్26:** సీమ ప్రజల కష్టాల కన్నీళ్లు ఈనాటివి కావు. పాలకవర్గాల దగా చరిత్రా ఇప్పటిది కాదు. నాటి పెద్ద మనుషుల ఒప్పందంలోని అంశాల అమలుతో మొదలుపెడితే, నిన్న మొన్నటి రాష్ట్ర విభజన ప్రహసనం వరకు సీమ జిల్లాలకు పాలకులు రిక్తహస్తాలనే చూపించారు. హైకోర్టు బెంచ్ ఏర్పాటు ప్రకటన కొంత ఊరటనిచ్చేదే అయినా..సాగునీటి రంగాన్ని అభివృద్ధి చేయాల్సి ఉంది. అదే సీమ వెనకబాటును పారదోలుతుందని ఇక్కడి వారు అంటున్నారు. పలువురు నేతలు ఈ ప్రాంతం నుండి ప్రాతినిధ్యం వహించినా, ముఖ్య మంత్రులను, కేంద్ర మంత్రులను అందించినా సీమ ముఖచిత్రం మారడంలేదు. రాష్ట్ర విభజన తరువాతైనా తమ కష్టాలు తీరుతాయని, నిధుల కేటాయింపులో ప్రాధాన్యత లభిస్తుందని భావించిన ప్రజానీకానికి తీవ్ర నిరాశనే మిగిల్చింది. గత ఐదేళ్ల జగన్ పాలనలోనూ ఎలాంటి పురోగతి కనిపించలేదు. రాయలసీమలో వెనకబాటు నిర్మూలనకు గత ఐదేళ్లలో తీసుకున్న చర్యలు శూన్యం. పాలకుల వైఖరి కారణంగా నిరసన గళాలు వినిపస్తున్నాయి. విభజన తరవాత కూడా సీమకు న్యాయం జరగడం లేదన్న ఆందోళన ప్రజల్లో కనిపిస్తోంది. రాష్ట్ర జనాభాలో 30 శాతం, విస్తీర్ణంలో 40 శాతం ఉన్న సీమపై నిరసనలు పెరుగుతున్నాయి. ప్రధానంగా సాగునీటి, పారిశ్రామిక రంగం పురోగమించక పోవడం వల్ల నిరుద్యోగ యువతలో ఆందోళన పెరుగుతోంది. చంద్రబాబు, జగన్ సిఎంలుగా ఉన్నా సీమకు పెద్దగా ఒరిగిందేమీ లేదు. అయితే గతంతో పోలిస్తే ఇప్పుడు సీమకోసం కొంత ప్రత్యేక శ్రద్ధ కనిపిస్తోంది. సిఎం చంద్రబాబు సీమలో పరిశ్రమల కోసం కృషి చేస్తున్నారు. గత ఐదేళ్ల కాలంలో జగన్ హయాంలో కడప ఉక్కు ఫ్యాక్టరీకి దిక్కు లేకుండా పోయింది. ప్రాజెక్టులు ఇంకా పూర్తి కాలేదు. నీటి వనరులకు మోక్షం దక్కడం లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనంతను తాను దత్తత తీసుకున్నానని ప్రకటించిన సిఎం చంద్రబాబు, విభజన తరవాత కూడా అనంతపై ప్రత్యేక దృష్టి పెట్టానని చెప్పినా పెద్దగా ఫలితం కనిపించ లేదు. ఒకప్పటి రతనాల సీమ ఇప్పుడు నిత్య దుర్భిక్ష సీమగా మారడానికి పాలకుల నిర్లక్ష్యమే కారణం అన్న నిరసనలు వినిపిస్తున్నాయి. పునర్ వ్యవస్థీకరణ చట్టంలో పేర్కొన్న అనేక అంశాలు ఎప్పుడు కార్యరూపం లోకి వస్తాయో అంతుపట్టకుండా మారింది. ఎన్నికలప్పుడు పాలక వర్గాలు అరచేతిలో చూపించే స్వర్గం సామాన్య ప్రజానీకానికి ఎండమావి గానే మిగిలిపోయింది. ఊరించే నీటి ప్రాజెక్టులు ఏళ్ల తరబడి సాగుతూనే ఉన్నాయి. ప్రత్యేక ప్యాకేజీలు, అభివృద్ధి పథకాలు కాగితాలకే పరిమిత మయ్యాయి. రైతుల కడగండ్లకు అంతులేకుండా పోతోంది. ఉన్న ఊరిలో పనులు లేక, బతకడానికి మరో మార్గం లేక వలసపోతున్న వ్యథా భరిత దృశ్యాలు సీమ జిల్లాల్లో అడుగడుగునా కనిపిస్తున్నాయి. అప్పుడెప్పుడో ప్రారంభమైన హంద్రీ-నీవా, గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టుల ఫలితాలు ప్రజలకు ఎప్పుడందు తాయో తెలియని స్థితి. ఇప్పటికే పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేసిన ఈ ప్రాజెక్టులపై మరికొంత శ్రద్ధ చూపిస్తే కొంతమేరకైనా సీమ ప్రజల జలార్తి తీరే అవకాశం ఉంది. తక్షణ ప్రాధాన్యత ఉన్న వీటిని విస్మరించారు. హడావిడిగా నిధులు కేటాయించడం పాలకుల హ్రస్వ దృష్టికి, స్వార్థ ప్రయోజనాలకు నిదర్శనంగా భావించాలి. తుంగభద్ర హెచ్‌ఎల్‌సి, పెన్నా- అహోబిలం, తెలుగుగంగ ప్రాజెక్టుల పట్ల వీరిది చిన్నచూపే. సీమలో ప్రవహించే చిన్నాచితకా వాగులు, వంకల్లోని నీటిని సద్వినియోగం చేయాలన్న ఆలోచనగానీ, అటువంటి ప్రతిపాదనలు గానీ రాష్ట్ర సర్కారు చేయడం లేదు.

## ఆర్థిక వృద్ధిపై మొండి బకాయిలదెబ్బ

### ఎగవేత దారుల్లో కనిపించని భయం

### సామాన్య ఖాతాదారులే బలిపశువులు

ముంబయి,సెప్టెంబర్26(ఆర్‌ఎన్‌ఎ): పెద్దలు ఎగవేసిన మొత్తాల కారణంగా సామాన్యులకు గుదిబండగా మారింది. సామాన్యులు రూపాయి బాకీ ఉన్నా ముక్కుపిండి వసూలు చేస్తున్న బ్యాంకర్లు పెద్దల అప్పులపై నోరు మెదపడం లేదు. మొండి బాకీల భారం సామాన్యులపై భారీగా పడుతోంది. వాటి నష్టాన్ని పూడ్చుకోవడానికే అన్నట్లుగా బ్యాంకులు ఖాతాదారులపై ఇష్టం వచ్చినట్లుగా ఛార్జీలు వేస్తున్నారు. కొన్ని కేసుల్లో రుణగ్రహీతలను వదిలి బ్యాక్ అధికారులను బాధ్యులను చేస్తున్నారు.అక్రమ రుణాలకు సహకరించిన బ్యాంక్ అధికారులు మాత్రం ఊచలు లెక్కిస్తున్నారు. ఇలాంటి వారి భరతం పట్టే ఉపాయాలు ఆలోచించడం లేదు. తాజాగా బ్యాంకుల్లో దోపిడీ ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. తాకట్టు బంగారాన్ని మాయం చేస్తున్నారు. నకిలీ బంగారంతో రుణాలు ఇప్పిస్తున్నారు. బ్యాంక్ ఖాతాల్లో ఉన్న నగదను మార్చేస్తున్నారు. ఇవి కొత్త తరహా మోసాలు బయట పడుతున్నాయి. సామాన్యుల రుణాల విషయంలో ముక్కుపిండి వసూలు చేస్తున్న బ్యాంకులు పెద్దల విషయంలో మిన్నకుంటున్నారు. ఇకపోతే ఆయా బ్యాంకులు విధిస్తున్న ఛార్జీలు చూస్తే బ్యాంక్ ఖాతా లేకపోవడమే ఉత్తతమని ప్రజలు భావిస్తున్నారు. మరోవైపు పాతబకాయిల వసూలుకు సంబంధించి నిర్దుష్ట విధానం అవలంబించడం లేదు. మొండి బకాయిదారుల పేర్లను వెల్లడించాలని గతంలో సుప్రీం ఆదేశించినా ఎందుకనో ఆర్‌బిఐ ముందుకు రావడం లేదు. మొత్తంగా మొండి బకాయిల దెబ్బకు బ్యాంకుల నడ్డి విరుగుతోంది. దేశంలోని 50 అతిపెద్ద రుణ ఖాతాల మొండి బాకీల వల్ల వివిధ బ్యాంకులు దాదాపుగా రూ.2.4 లక్షల కోట్లు వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ గతంలోనే విశ్లేషించింది. ఈ నివేదిక ప్రకారం యాభై కంపెనీలకు ఇచ్చిన అప్పుల్లో మొండి బాకీలుగా మారిన మొత్తంలో 60 శాతం మేర రద్దు చేసుకోవాల్సిన దుస్తితి నెలకొంది. వీటి మొండిబకాయిలు రూ.4 లక్షల కోట్ల మేర ఉన్నాయి. 50 కంపెనీల్లో 30 శాతం అప్పులు మెటల్ రంగానివే అని గుర్తించారు. నిర్మాణ రంగం 25 శాతం, విద్యుత్ 15 శాతం చొప్పున బ్యాంకులకు నిరర్థక ఆస్తులను మిగిల్చాయి. బ్యాంకుల మొత్తం మొండి బాకీలు రూ.8 లక్షల కోట్లలో ఈ 50 కంపెనీల వాటా దాదాపుగా సగం మేర ఉన్నాయి. మొత్తం నిరర్థక ఆస్తుల్లో కనీసం సగానికి పైగా రుణాలు ఈ రంగాలివే. భారత జిడిపిలో ఇవి 5 శాతం. ఆర్థిక విలువ ఆధారితంగా ఈ రైటాఫ్ విలువను లెక్కించామని క్రిసిల్ రేటింగ్స్ ప్రతినిధి ఒకరు వెల్లడించారు. చివరిగా తీసుకునే రైటాఫ్ విలువ, బ్యాంకుల అంచనాలు, సబ్సిడరీలు వాల్యుయేషన్, కమోడిటీతో మిలితమయ్యే రంగాల ధరల అవుట్‌లుక్‌తో ప్రభావితమై ఉంటుందని క్రిసిల్ వివరించింది. ఈ కంపెనీలన్నీ వ్యాపారంలో సమగ్రత కలిగిలేవని పేర్కొన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న బ్యాంకింగ్ రంగంలో నూతన విధానాలు అమలు చేయడంలో ఆలస్యం వల్ల బ్యాంకులు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. నిర్వహణ వ్యయం పెరగడం, ప్రాజెక్టులకు తగు సమయంలో అనుమతులు లభించకపోవడం తదితర పరిణామాలు కంపెనీల చెల్లింపులపై ఒత్తిడిని పెంచాయి. ఇప్పటికే బ్యాంకులు మొండి బాకీల కింద కేటాయింపులు చేశాయని క్రిసిల్ రిపోర్టులో పేర్కొంది. తాజాగా మరో 20 శాతం పెంచాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నష్టాలను తట్టుకోవడానికి బ్యాంకులకు సరిపడ మూలధనం అవసరం ఉంటుంది.

## నిష్కామక కర్మ !

**తిరుమల, సెప్టెంబర్26:** యవ్వనంలో ఉంటే ముసలితనం వచ్చేస్తుందని భయపడతాం. ధనవంతులమైతే అనుకోకుండా పేదవాళ్లమై పోతామేమో అని భయపడతాం. ఏ స్థితిలోనూ భయం కలిగించనిది ఒకే ఒక్కటి. అదే వైరాగ్యం. 'నాకు అక్కర్లేదు!' అనుకునే వాడు ఉన్నంత నిర్భయంగా మరెవ్వడూ ఉండడు. 'నాకిది కావాలి!' అనుకుంటే వంద రకాల తాపత్రయాలు పడాల్సిందే. శివుడు మన్మథుని గర్వాన్ని నిర్మూలనం చేశాడు. మనం కూడా శివ భక్తులమై సంసారంలో ఉంటూనే కామవాంఛలను జయించాలి. అది గ్రహిస్తే యాభై ఏళ్లు దాటే సరికి కాస్త నెమ్మదిగా వైరాగ్య మార్గంలో పడతాం. అప్పుడు నిర్భయంగా ఉండగలుగుతాం. జీవితంలో ఏదైనా భయం కలిగించేదే. పాండిత్యం సంపాదిస్తే, అంతకన్నా ఎక్కువ పాండిత్యం ఉన్న వాడు వస్తాడని భయపడతాం. అందంగా ఉంటే ఈ అందం దెబ్బతింటుందేమోనని భయపడతాం. ఆ గర్వాన్ని జయించాలంటే పార్వతీ పరమేశ్వరులిద్దరినీ మనం ఆశ్రయించాలి. నారదుడు మొదలుకుని ముఖ్యమైన మునులందరూ నిరంతరం భగవంతుని ధ్యానంలో గడిపారు. వారి మనః పద్మాలలో శివుడు తుమ్మెదలా విహరిస్తున్నాడు. మనమూ అలా నిరంతరం భగవంతుని ధ్యానంలో గడుపుదాం. మనస్సులో భక్తి తప్ప మరేమీ ఉండకూడదు. 'అంతా నువ్వే!' అని భగవంతుణ్ణి వేడుకోవాలి. దేశం బాగుపడటానికి, జీవితం బాగుపడటానికి ఆధ్యాత్మికతను మించిన మార్గం లేదు. శంకరాచార్యుల నుంచి వివేకానందుల వరకు ఇదే ఆచరించి చూపారు. కావాలను కుంటేనే సమస్యలు వచ్చి పడతాయి. అందువల్ల తాహతుకు మంచి కోరికలను కోరుకుంటే సమస్యలు చుట్టుముడతాయి.



# రూ. 1,03,000 పిఎల్ఆర్ బోనస్ చెల్లింపుకు ఒప్పందం

## హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్



**యైటింక్లయిన్ కాలనీ. (ది క్రైమ్ న్యూస్). సెప్టెంబర్ 26**: బొగ్గు గని కార్మికులకు 2024బి25 ఆర్థిక సంవత్సరానికి పిఎల్ఆర్ (దీపావళి) బోనస్ 1,03,000 ఒక లక్షా మూడువేల రూపాయలు ఇచ్చేందుకు అంగీకారం కుదిరిందని జెబిసిసిఐ సభ్యులు, హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ అహమ్మద్ తెలిపారు. గురువారం రాత్రి ఆయన కోల్ కతా నుండి ఫోన్ లో మాట్లాడుతూ.. ఈ నెల 25న గురువారం కోల్ కతా లో జరిగిన జెబిసిసిఐబి ఆరవ ప్రమాణీకరణ సమావేశంలో ఈ ఒప్పందం జరిగిందన్నారు. ఇక ఈ ఒప్పందం ప్రకారం కోల్ ఇండియా లోని అన్ని బొగ్గు గనుల వేలాది మందికి ఉరట లభిస్తుందని, ఇది కార్మికుల విజయమన్నారు. ఇక ఈ విజయానికి హెచ్ ఎం ఎస్ కార్మిక హక్కుల కోరకు చేపట్టిన పోరాటాలు, నిరంతర కృషి ప్రధాన కారణాలని రియాజ్ వివరించారు.

## బతుకమ్మ ఘాట్ల ముందస్తు ఏర్పాటు



**ఎండపల్లి, సెప్టెంబర్ 26(ది క్రైమ్ న్యూస్ ):** జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం రాజారాంపల్లి గ్రామంలో పంచాయితీ కార్యదర్శి శ్రీకాంత్ ఆధ్వర్యంలో బతుకమ్మ ఘాట్ ల వద్ద ముందస్తుగా ఏర్పాటు చేస్తున్నారు. బతుకమ్మ ఆడుకునే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విద్యుత్ లైట్లను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఘాట్ ల వద్ద ట్రాక్టర్ తో చదును చేసి మహిళలకు ఇబ్బందులు కలగకుండా చూస్తునమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి శ్రీకాంత్, మహేందర్, నాయకులు గాజుల విజయ్, గొల్లే మహేందర్, గుండ్ల చంద్రమౌళి, గ్రామ పంచాయితీ సిబ్బంది సుధమల్ల విష్ణు, దేవి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు పంట సాగు వివరాలను నమోదు చేసుకోవాలి

### - జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జిల్లాలోని ప్రతి రైతు తన వ్యవసాయ క్షేత్ర విస్తీర్ణంలో సాగు చేస్తున్న పంటల వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లాలోని ప్రతి రైతు వారి క్లస్టర్ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారిని కలిసి ప్రస్తుత వానాకాలం సీజన్ లో సాగు చేస్తున్న పంటల వివరాలను ఎటువంటి పొరపాట్లు లేకుండా తప్పక నమోదు చేసుకోవాలని అన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో తిరుగుతూ పంటల సాగు వివరాలు క్లబ్ బుకింగ్ చేసుకుంటున్నారని, ప్రతి ఒక్క రైతు వ్యవసాయ విస్తరణ అధికారులకు సహకరిస్తూ వారిని కలిసి సాగు చేస్తున్న పంట వివరాలు చెక్ చేసుకోవాలని లేకపోతే పంట అమ్మే సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటారని, ఈ అంశాన్ని రైతులు గమనించాలని జిల్లా వ్యవసాయ అధికారి ప్రకటనలో పేర్కొన్నారు.

## తెలంగాణ వీరవనిత, మహిళా చైతన్యానికి ప్రత్యేకంగా నిలిచిన చాకలి ఐలమ్మ

### - ఘనంగా చాకలి ఐలమ్మ 130వ జయంతి వేడుకలు



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి పట్టణంలోని తిలక్ నగర్లో శుక్రవారం తెలంగాణ వీరవనిత, చాకలి ఐలమ్మ 130 జయంతిని పురస్కరించుకొని రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ విగ్రహానికి, పూలమాలలు వేసి, కేక్ కట్ చేసి, జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు మాట్లాడుతూ, చాకలి ఐలమ్మ, భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి, విముక్తి కోసం, సాయిధ పోరాట కాలంలో, హక్కుల సాధన కోసం, నిజం నవాబును, వ్యతిరేకించి పోరాడిన వీర వనిత ఐలమ్మ అని కొనియాడారు. మహిళ చైతన్యానికి, ప్రత్యేకంగా నిలిచిన చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో, రజక సంఘం, కుల పెద్దమనిషి, బొడ్డుపల్లి రామ్మూర్తి, గౌరవ అధ్యక్షులు, బొడ్డుపల్లి శ్రీనివాస్, బొడ్డుపల్లి నవీన్, కుమారస్వామి, బొడ్డుపల్లి అశోక్, కృష్ణ, పవనూరి లక్ష్మణ్, ఎలా పోతారం మొగిలి, ముక్కెర రాజసం, బొడ్డుపల్లి సంపత్, దొడ్డిపల్లి కొమరయ్య, ముత్తునూరి మల్లికార్జున్, కనకయ్య, మున్సిపల్ తాజా మాజీ కౌన్సిలర్లు, భూత గడ్డ సంపత్, తాదూరి శ్రీమన్, బిమోజు సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

## జెడ్పీటీసీ టికెట్ వరించేనా.....మరొకరికా...?



**బెజ్జంకి, సెప్టెంబర్ 26(ది క్రైమ్ న్యూస్):** సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలో బీసీ రిజర్వేషన్ల ప్రక్రియలో భాగంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బెజ్జంకి జడ్పిటిసి స్థానం బిసికి కేటాయిస్తే బిజెపి నుండి బరిలో నిలిచేందుకు ఆశావాహులు గట్టి ప్రయత్నాలే చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. బిజేపి సోషల్ మీడియా కన్వీనర్ దొడ్ల ప్రశాంత్, మండలాధ్యక్షుడు కొలిపాక రాజు,పట్టణాధ్యక్షుడు సంఘ రవి, బిజేవైఎం మండలాధ్యక్షుడు తూముల రమేష్ తోపాటు మరికొందరు జెడ్పీటీసీగా బరిలో నిలిచేందుకు పార్టీ టికెట్ కోసం ఎవరి ప్రయత్నాల్లో వాళ్ళున్నట్లు మండలంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. కాగా చాలారోజుల నుండి పార్టీని బలపరిచేందుకు క్రీయాశీలకంగా వ్యవహరిస్తూ ప్రజాదరణను కలిగిన దొడ్ల ప్రశాంత్ బరిలో నిలిచేందుకు ముందు వరుసలో ఉండగా ఎవరో ఒకరికి అధిష్టానం టికెట్ కేటాయించి గెలిపించుకుని వారికి అండగా నిలిచేందుకు నిర్ణయం తీసుకునే ఆలోచనలో అధిష్టానం ఉన్నట్లు సమాచారం.

# కనీస మద్దతు ధర పై పత్తి కొనుగోలుకు సిద్ధంగా ఉండాలి

- రైతులు నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ జిన్నింగ్ మిల్లులకు పత్తి తీసుకుని రావాలి
- పత్తి కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతుల కల్పన
- పత్తి కొనుగోలు పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ లో వచ్చే పత్తి పంటను కనీసం మద్దతు ధరపై కొనుగోలు చేసేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అదనపు కలెక్టర్ డి.వేణు తో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్ లో పత్తి కొనుగోలు పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ లో పత్తి కొనుగోలు యాక్షన్ ప్లాన్ ను అధికారులు జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, 2025-26 ఖరీఫ్ సీజన్లో పెద్దపల్లి జిల్లాలో 48 వేల 215 ఎకరాలలో పత్తి పంట సాగు జరిగిందని, 5 లక్షల 78 వేల 580 క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని అంచనా ఉందని, అక్టోబర్ 15 తర్వాత పత్తి దిగుబడి ప్రారంభమవుతుందని, నవంబర్ డిసెంబర్ నెలలో అధికంగా పంట వస్తుందని అన్నారు. మార్కెట్ లో నాణ్యమైన పత్తి పంటకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే తక్కువగా రేట్ పలికితే వెంటనే సిసిఐ కేంద్రాల ద్వారా మద్దతు ధర కల్పించాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలో సీసీఐ ద్వారా పత్తి పంట కొనుగోలు చేసేందుకు 5 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. పత్తి 8 శాతం తేమ ఉన్నట్టయితే కనీస మద్దతు ధర రూ.8110/- ఉన్నదని. పత్తి రైతులు తమ పత్తిని తక్కువ ధరకు దళారులకు కానీ, మధ్యవర్తులకు కానీ, ఇతరులకు కానీ అమ్ముకోకుండా పత్తి ధర కనీస మద్దతు ధర కన్నా తక్కువగా ఉన్నప్పుడు సీసీఐ వారిచే పెద్దపల్లి మార్కెట్ యార్డ్ , రెండు జిన్నింగ్ మిల్లులు, సుల్తానాబాద్ మార్కెట్ యార్డ్ పరిధిలో ఒక్క జిన్నింగ్ మిల్లు, కమాన్ పూర్ మార్కెట్ యార్డ్ పరిధిలో ఒక్క జిన్నింగ్ మిల్లు మొత్తం 5 పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పత్తి రైతులు తమ పత్తిని తీసుకొని వచ్చేటప్పుడు నాణ్యత ప్రమాణాలను పరిగణలోకి తీసుకొవాలని , నాణ్యమైన పత్తి పంటను వెంటనే కనీస మద్దతు ధర పై కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పత్తి పంట కొనుగోలు నిమిత్తం జిన్నింగ్ మిల్లులో నీరు , టాయిలెట్ అవసరమైన పరికరాలు మొదలగు సౌకర్యాలు సమకూర్చాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు పత్తి పంట తీసుకొని వచ్చే రైతులు తమ బ్యాంకు ఖాతాలు ఆధార్ కార్డుతో లింక్ చేయాలని, దీనిపై రైతులలో అవసరమైన అవగాహన కల్పించాలని కలెక్టర్ వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాలలో అవసరమైన తేమ యంత్రాలు, వెయింగ్ యంత్రాలు మొదలగు సామాగ్రి అందుబాటులో ఉంచాలని అన్నారు. రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ మద్దతు ధర కంటే తక్కువకు పత్తి పంట అమ్మవద్దని, మధ్య వర్తులను నమ్మి మోసపోవద్దని, ప్రైవేట్ వ్యాపారుల వద్ద మద్దతు ధర లభించని పక్షంలో నేరుగా జన్మింగ్ మిల్లులకు వచ్చి పత్తి పంట అమ్ముకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పత్తి పంటను క్రాప్ బుకింగ్ ప్రకారం సమీపంలో ఉన్న జిన్నింగ్ మిల్లులకు మ్యాప్ చేయాలని అన్నారు. ఒకే రోజు అధిక సంఖ్యలో రైతులు పత్తి తీసుకుని రాకుండా జాగ్రత్త వహించాలని రైతులకు జిన్నింగ్ మిల్లుల సామర్థ్యం ప్రకారం టోకెన్లు జారీ చేయాలని అన్నారు. పత్తి తరలింపు కోసం అవసరమైన వాహనాలు సిద్ధం చేసుకోవాలని అన్నారు పత్తి పంట తేమ శాతం పై కర పత్రాలను విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్ అన్నారు. పత్తి కొనుగోలు కేంద్రాలకు నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉండే విధంగా చూడాలని అన్నారు. పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద అగ్ని ప్రమాద నివారణ చర్యలు పటిష్టంగా తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అలాగే కప్పాస్ కిసాన్ ఆప్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని, అలాగే పత్తి అమ్ముకోవడానికి స్లాట్ బుకింగ్ చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్ , జిల్లా రవాణా శాఖ అధికారి రంగారావు, జిల్లా తూనికల కొలతల అధికారి , మార్కెట్ కార్యదర్శులు, సీసీఐ అధికారులు, జిన్నింగ్ మిల్లు ఓనర్లు , సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## వీర వనిత చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి మహిళా శక్తికి స్ఫూర్తిదాయకం

### - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** వీర వనిత చాకలి ఐలమ్మ ప్రదర్శించిన పోరాట స్ఫూర్తి మహిళా శక్తికి స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వీరనారి చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ డి.వేణు తో కలిసి చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ చాకలి ఐలమ్మ సంఘ సేవకురాలుగా, భూమి, సాయుధ రైతాంగ పోరాటంలో ప్రదర్శించిన పోరాట పటిమతో వీర వనితగా చరిత్రలో నిలిచి, ప్రతి ఒక్కరికి స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు. సమాజహితం కొరకు పోరాడిన మహనీయుల స్ఫూర్తి, వారి త్యాగాలు, గొప్పతనం ప్రజలకు తెలిసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మహనీయుల జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తుందని అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తిగా నిలిచి, తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తిని, మహిళా శక్తిని ప్రపంచానికి చాటి చెప్పిన వీర వనిత చాకలి ఐలమ్మ అని అటువంటి వీర వనితను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ



కార్యక్రమంలో జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి రంగారెడ్డి, రజక సంఘ నాయకులు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కొండపల్కలలో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



**మానకొండూర్, సెప్టెంబర్ 26(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం కొండపల్కలలో రజక సంఘ ఆద్వర్యంలో శుక్రవారం చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగు సంపత్ గౌడ్ మాట్లాడుతూ..... భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం తన పోరాటంతో ప్రజల తెగువను ప్రపంచానికి చాటి మహిళాలోకానికి పోరాట స్ఫూర్తినిచ్చిన నిప్పు కనిక, వీరవనిత ఐలమ్మ అంటూ ప్రశంసించారు. కార్యక్రమంలో రజక సంఘం మాజీ అధ్యక్షుడు శాతరాజు సంపత్, శాతరాజు మొండయ్య, లింగంపల్లి శంకర్, శాతరాజు శ్రీనివాస్, రవి,ఆంజనేయులు, తిరుపతి, ఏ. రవి,గట్టు శ్రీధర్, వ్యాసాల భానుచందర్, సాధినేని సుధాకర్, నల్గొండ రాములు, గట్టు లక్ష్మయ్య, గట్టు రాజయ్య, గట్టు కొమురెల్లి, దూలం కనకయ్య, రేగుల పోషాలు, కడారి రమేష్, గట్టు రమేష్, ఇజ్జగిరి రాజవీరు, పెద్దపల్లి రాములు, మిర్యాల మొండయ్య, చింతనిప్పుల మొగిలి,దాసరిశ్రీనివాస్,కోలిపాకరాయమల్లు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి..

**ఇల్లందకుంట సెప్టెంబర్ 26 (ది క్రైమ్ న్యూస్):** ఇల్లందకుంట లో చాకలి ఐలమ్మ 130 జయంతి సందర్భంగా ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రజక యూత్ హుజురాబాద్ నియోజకవర్గం ఆలేటి శ్రీరామ్ ఇల్లందకుంట రజక సంఘం మండల అధ్యక్షుడు రావుల ఎల్లయ్య శ్రీనివాస్ మల్లేష్ ఎల్లయ్య తదితర రజక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## పండుగల ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలి

### - బతుకమ్మ, దసరా పండుగలపై సమీక్షా సమావేశం నిర్వహించిన పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణ రావు



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమైన పండుగలైన సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం పెద్దపల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు నియోజకవర్గంలోని పలు మండలాల ఎంపీడీఓ లు, ఎంపీవో లతో కలిసి సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. పండుగలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ రమణ రావు మాట్లాడుతూ సోమవారం రోజున సద్దుల బతుకమ్మ పండగ సందర్భంగా నియోజకవర్గంలో పండగ ఘనంగా జరగడానికి అన్ని ఏర్పాట్లు చేయాలనీ అధికారులను ఆదేశించడం జరిగిందని అలాగే త్రాగు నీరు, విద్యుత్, పారిశుద్యం మరియు భద్రత వంటి సౌకర్యాలు అధికారులందరూ సమన్వయంతో కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎంపీడీఓ లు, ఎంపీవో లు తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహారం పై అవగాహన



**జమ్మికుంట సెప్టెంబర్ 26 (ది క్రైమ్ న్యూస్):** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని మోతుకులగూడెం 1,3 అంగన్వాడి కేంద్రం నందు పోషణ్ మహా కార్యక్రమం సెక్టర్ మొత్తం కలిసి నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా అన్నప్రాసన కార్యక్రమం లో తల్లులకు పోషకాహారం పై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఏసి డిపిఓ ప్రవళిక, సూపర్వైజర్ శిరీష బీసీ నాగరాజు జమ్మికుంట సెక్టర్ అంగన్వాడీ టీచర్స్ పాల్గొనడం జరిగింది.

# విప్లవాల వేగుచుక్క చాకలి ఐలమ్మ

**◆ వీర వనిత చాకలి ఐలమ్మ కి ఘనంగా జయంతి వేడుకలు ◆ పెద్దపల్లి జిల్లా రజక సంఘం సమన్వయకర్త నాగెల్లి సాంబయ్య**

**రామగిరి,సెప్టెంబర్26(ది క్రైమ్ న్యూస్):-** తెలంగాణలో తొలి భూ పోరాటానికి నాంది పలికిన విప్లవాల వేగుచుక్క చాకలి ఐలమ్మ అని పెద్దపల్లి జిల్లా రజక సంఘం సమన్వయకర్త నాగెల్లి సాంబయ్య కొనియాడారు.రామగిరి మండల కేంద్రం లో నీ తెలంగాణ చౌరస్తాలో రజక సంఘం ఆధ్వర్యంలో వీర వనిత చాకలి ఐలమ్మ కి ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పెద్దపల్లి జిల్లా రజక సంఘం సమన్వయకర్త, రామగిరి మండల రజక సంఘం గౌరవ అధ్యక్షులు నాగేల్లి సాంబయ్య ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళి ఆర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అణగారిన వర్గాల ఆత్మగౌరవ ప్రతీక చాకలి ఐలమ్మ అని ఐలమ్మ స్ఫూర్తితో అణగారిన వర్గాలు ఐక్యంగా ముందుకు సాగాలని అదేవిధంగా ఐలమ్మ పోరాట స్ఫూర్తి చరిత్ర భావితరాలకు తెలిసే విధంగా ప్రతి ఒక్కరు కంకణ బద్ధులై ముందుకు నడవాలని చాకలి ఐలమ్మ రజక జాతిలో పుట్టినందుకు గర్విస్తున్నామని అదేవిధంగా విసునూరు దొరలకు వ్యతిరేకంగా పోరాడి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి బీజం వేసిన చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి అనిర్వచనీ యమని ఇంతటి పోరాట స్ఫూర్తిని భావితరాలకు తెలియజేసే విధంగా రజక సంఘాలు ముందుకు నడవాలని కోరారు. అదేవిధంగా ఐలమ్మ స్ఫూర్తితో ఐక్యంగా ముందుకు సాగుతూ రాబోయే రోజుల్లో రాజ్యాధికారం దిశగా అడుగులు వేస్తూ సమాజంలో మన గౌరవం దక్కే విధంగా ఆత్మగౌరవంగా బ్రతకడానికి ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు సాగాలని,చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై నెలకొల్పి మరింత ఐలమ్మ స్ఫూర్తిని భావితరాలకు అందించే విధంగా చర్యలు



చేపట్టాలని అలాగే జనాగమ జిల్లాకు ఐలమ్మ పేరు ను పెట్టాలని ప్రతి జిల్ల కేంద్రంలో కలెక్టర్ ఆఫీసు లో తప్ప ఏ గవర్నమెంట్ ఆఫీస్ లో జయంతి వర్ధంతి చేయడం లేదని ఆయన అన్నారు. ఈ ఇకనైనా అధికారికంగా అన్ని ఆఫీస్ లలో జరిపించాలి అయన రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపెల్లి జిల్లా రజక సంఘం ఉపాధ్యక్షులు మాదాసి శ్రీనివాస్, కార్యదర్శి కొత్తపల్లి రాయమల్లు, రామగిరి రజక సంఘం అధ్యక్షులు ధర్మల రాజయ్య, సెంటినరీ కాలనీ రజక సంఘం అధ్యక్షులు పున్నం సమ్మయ్య, చెలికట్ల మల్లేష్, ఉల్లంగుల రాజయ్య, కొల్లూరు రాములు, ధర్మల చిన్న రాజయ్య, రవి, రాజు, సదయ్య, పూల లింగన్న, అంబాల కొమురయ్య, పెద్ద మనుషులతో పాటు రజక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పండుగ రోజున పంచాయతీ కార్మికులు పస్తులు ఉండాలా?

**◆ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్ వేతనాలు గ్రీన్ చానల్ ద్వారా విడుదల చేయాలి ◆ యూనియన్ జిల్లా అధ్యక్షులు సిపెల్లి రవీందర్**






**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు ఇవ్వకుండా కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నాదని పండగ పూట పంచాయతీ కార్మికులు పస్తులు ఉండాలా అంటూ రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సిపెల్లి రవీందర్ డిమాండ్ చేశారు.తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి కలెక్టర్ గారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సి పెల్లి రవీందర్,ఎండి ఖాజా మాట్లాడుతూ: తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు అతి ముఖ్యమైన దసర పండుగ రోజున గ్రామ పంచాయితీ సిబ్బందిని పస్తులుంచకుండా గత 3 నెలల బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి గారిచ్చిన హామీ ప్రకారం పంచాయతీ సిబ్బంది వేతనాలను గ్రీన్ ఛానల్ ద్వారా కార్మికుల బ్యాంక్ అకౌంట్లలో జమ చేయాలని, మల్టీపర్పస్ వర్కర్ పని విధానం వలన ప్రమాదాలు జరిగి మరణిస్తున్న కార్మికులకు రూ.20 లక్షల నష్ట పరిహారం ప్రకటించాలని, జీఓ నెం. 51ని సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్రంలో 12,796 గ్రామ పంచాయితీల్లో సుమారు 60,000 మంది గ్రామ పంచాయితీ ఉద్యోగులు, కార్మికులు పని చేస్తున్నారని, 2018 సం?లో గ్రామ పంచాయితీ ఉద్యోగ, కార్మికుల పోరాట ఫలితంగా 2019 అక్టోబర్లో గత రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెం.51ని విడుదల చేసి సిబ్బంది వేతనాలను రూ.8,500/-లుకు పెంచిందని, వేతనాలు పెంచుతూనే మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని ప్రవేశ పెట్టింది. ఈ విధానం అమల్లోకి వచ్చిన నాటినుండి నేటి వరకు అనేక జిల్లాలలో ప్రమాదాలు జరిగి కార్మికులు మరణిస్తున్నారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం నయా పైసా నష్ట పరిహారం చెల్లించడం లేదనీ అన్నారు.దీంతో ఆ కార్మికుల కుటుంబాలను ఆదుకోనే దిక్కు లేక రోడ్డున పడుతున్న పరిస్థితి ఉందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజలందరికి అతి ముఖ్యమైన పండుగగా దసర పండుగను జరుపుకుంటారు. రాష్ట్ర ప్రభుత్వం 2025 సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛోత్సవ్ పక్షోత్సవాలకు పిలుపు నిచ్చింది. దసర ఉత్సవాలు ప్రారంభమైనాయి. ఇలాంటి వాతవరణంలో పంచాయతి కార్మికుల కుటుంబాలు ప్రజలందరితో కలసి పండుగ ఉత్సవాలలో పాల్గొనే పరిస్థితి కల్పించకుండా రాష్ట్ర ప్రభుత్వం గత 3 నెలలుగా పంచాయతీ సిబ్బందికి వేతనాలు చెల్లించడం లేదు. ఫలితంగా దసర పండుగ సందర్భంగా పంచాయతి సిబ్బంది పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడిందనీ అన్నారు. ఏ పండుగ వచ్చిన పస్తులే, వేతనాలు నెలల తరబడి చెల్లించక పోవడంతో కుటుంబ పోషణ భారమై అప్పులు చేసి అవి తీర్చలేక మరో అప్పు దొరకకా ఆత్మహత్యలు చేసుకునే దయనీయమైన స్థితి ఏర్పడింది. పంచాయతీ కార్మికుల అనేక ఆందోళన పోరాటాల ఫలితంగా రాష్ట్ర ముఖ్యమంత్రి గారు స్పందించి పంచాయతీ కార్మికుల వేతనాల చెల్లింపులలో జరుగుతున్న సమస్యకు శావ్వతమైన పరిష్కారం చూపుతామని ప్రభుత్వ ఉద్యోగుల వలే గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లిస్తామని ప్రకటించారు. 9 నెలలు గడుస్తున్న ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదు. 6 నెలల క్రితం కార్మికుల వ్యక్తిగత సమాచారాన్ని ప్రభుత్వం తీసుకొని కార్మికుల బ్యాంక్ అకౌంట్లలో వేతనాలు జమచేస్తామన్నారు. కార్మికులు తమ అకౌంట్లలో వేతనాలు వేయాలని కోరుతున్నప్పటికి ఈ అంశాన్ని ప్రభుత్వం దాటవేస్తున్నదనీ అన్నారు.కావున పంచాయతీ ఉద్యోగ, కార్మికుల సేవలను గుర్తించాలని, పంచాయితీ సిబ్బంది 3 నెలల బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని, దసర పండుగ సందర్భంగా సిబ్బందికి బట్టలు, సబ్బులు, నూనెలు ఇతర సేఫ్టీ పరికరాలను అందించాలని, ప్రమాదాలలో మరణించిన కార్మికుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని, వారి స్థానంలో కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సిఐటియు జిల్లా నాయకులు యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ఇరుగురాల లచ్చయ్య, పైడిపల్లి నాగయ్య, సహాయ కార్యదర్శి నాగేశ్వర్, కమిటీ సభ్యులు కవంపల్లి దేవేందర్, భీమయ్య, ప్రేమ్ కుమార్ భాస్కర్, శంకర్, అప్సర్, మల్లేష్, రాజేష్, అశోక్, కార్మికులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అండగా నిలిచిన ఆలయ ఫౌండేషన్, నరహరి ఐఏఎస్ చొరవ

**- ఉచితంగా కృత్రిమ కాలు అందజేత: కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు**



**(ది క్రైమ్ న్యూస్) బ్యూరో:** పరికిపండ్ల నరహరి ఐఏఎస్ మార్గదర్శకత్వంలో విద్యా, వైద్యం,ఉపాధి రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న ఆలయ ఫౌండేషన్ ఒక పేదింటి కుటుంబానికి ఆసరాగా నిలబడింది. పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రానికి చెందిన దంతనపల్లి సమ్మయ్య కొంతకాలం క్రితం ప్రమాదవశాత్తు తన కాలును పోగొట్టుకున్నాడు. రెక్కాడితే గాని డొక్కాడని సమ్మయ్య పరిస్థితిని తెలుసుకున్న కాల్వ శ్రీరాంపూర్ ఆలయ ఫౌండేషన్ ఇంచార్జ్ కల్లేపల్లి సాగర్ ఫౌండేషన్ సభ్యులు కీర్తి నాగార్జున, తిట్ల రమేష్ బాబు, మిట్టపల్లి రాజేంద్ర కుమార్, లంక సురేష్ ల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో విషయాన్ని తెలుసుకున్న నరహరి ఐఏఎస్ బాధితునికి అండగా నిలబడి ప్రత్యేక చొరవ తీసుకుని హైదరాబాదులో ఉన్న భగవాన్ మహావీర్ ట్రస్ట్ సహకారంతో పూర్తి ఉచితంగా కృత్రిమ కాలు అమర్చడం జరిగింది. అడగగానే సహాయాన్ని అందించిన నరహరి ఐఏఎస్ కు ఆలయ ఫౌండేషన్ సభ్యులకు బాధితుని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. మానవతా దృక్పథంతో సమాజ సేవ చేస్తున్న ఆలయ ఫౌండేషన్ ను గ్రామస్తులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో తాండ్ర అనిల్,కరుణాకర్, సాయి,రాజేష్,గోపి తదితరులు పాల్గొన్నారు.

# గౌడ సంఘ నూతన కమిటీ ఎన్నిక



**ముత్తారం.సెప్టెంబర్.26.(ది క్రైమ్ న్యూస్):** ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామంలోని గౌడ కులస్తులంతా కలిసి శుక్రవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు.గౌడ కులస్తులంతా కలిసి కుల పెద్ద మనుషులుగా బోనగాని మొగిలి గౌడ్,దేశిని రవీందర్ గౌడ్ లను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరం ఐకమత్యంతో ఉంటూ కుల దైవమైన ఎల్లమ్మ తల్లి ఆలయ పనులను త్వరగా పూర్తిచేయాలని అన్నారు.ఈ ఎన్నికలో గౌడ కులస్తులు సదయ్య గౌడ్,రమేష్ గౌడ్,సాగర్ గౌడ్,సంతోష్ గౌడ్,సతీష్ గౌడ్,వెంకటేష్ గౌడ్,వీరస్వామి గౌడ్,తిరుపతి గౌడ్,గౌడ కులస్తులంతా పాల్గొన్నారు.

# ఫ్లెక్సీల ధ్వంసం దుండగులు దొరకడం లేదా?

**- నెల రోజులుగా పెండింగ్ - పోలీసులు పట్టుకోలేక పోతున్నారా? - కావాలని ఆపుతున్నారా? రాజకీయ ఒత్తిళ్లా? - గ్రామ శాఖ అధ్యక్షుడు పరుశరాములు డిమాండ్**

**(ది క్రైమ్ న్యూస్) బ్యూరో:** పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం రూపు నారాయణపేట గ్రామంలో కొద్ది రోజుల క్రితం బి ఆర్ఎస్ పార్టీకి చెందిన ఫ్లెక్సీలను కొందరు దుండగులు రాత్రిపూట ధ్వంసం చేయడంతో బి ఆర్ ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు బినవేణ పరుశరాములు స్థానిక పొత్కాపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడం అయింది. ఈరోజు పరుశరాములు ది క్రైమ్ న్యూస్ తో మాట్లాడుతూ.. దీనికి సంబంధించిన సీసీ ఫుటేజ్ కూడా ఉన్నదని, కానీ పోలీసుల పర్మిషన్ లేనిదే తాను ఆ సిసి ఫుటేజీని ఇవ్వనని సంబంధిత వ్యక్తి చెప్పడం జరిగిందని, ఈ విషయాన్ని సుల్తానాబాద్ సిఐ దృష్టికి కూడా తీసుకెళ్లడంతో పరిశీలించి తగుచర్య తీసుకుంటానని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. అయినా ఇప్పటివరకు కూడా పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోక పోవడంతో పలు అనుమానాలకు దారితీస్తున్నది. నెల రోజులు గడుస్తున్నా ఈ సంఘటనపై పోలీసులు దృష్టి పెట్టడం లేదంటూ, కావాలని పోలీసులే ఆలస్యం చేస్తున్నారా? లేక నిందితులు దొరకడం లేదా? ఇది గాక రాజకీయ ఒత్తిళ్లు ఏమైనా ఉన్నాయా?అని ప్రశ్నించారు.ఇకనైనా ఇలాంటి అసాంఘిక కార్యక్రమాలు చేసే వారిపై పోలీసులుచట్టపరమైన చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

# మినీ స్టేడియం మంజూరుకు హామీ

**- మంత్రికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు**



**తిమ్మాపూర్, సెప్టెంబర్ 26(ది క్రైమ్ న్యూస్):** రాష్ట్ర క్రీడలు,యువజన శాఖామంత్రి వాకిటి శ్రీహరిని శుక్రవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తిమ్మాపూర్ మాజీ వైస్ ఎంపిపి తుమ్మనపల్లి శ్రీనివాసరావుతోపాటు హైదరాబాద్లో కలిసి మానకొండూర్ నియోజకవర్గానికి మినీ స్టేడియం ఏర్పాటుపై చర్చించారు.మినీ స్టేడియంతో పాటు నియోజకవర్గానికి ఫిషరీస్ రీప్రొడక్టివ్ సెంటర్, సెట్ విన్ శిక్షణా కేంద్రాన్ని మంజూరు చేయాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి కోరగా, మంత్రి శ్రీహరి సానుకూలంగా స్పందించి త్వరలోనే వాటిని మంజూరు చేసి నియోజకవర్గంలో క్రీడలకు సదుపాయాలు, సామాగ్రి సమకూర్చడంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.మినీ స్టేడియం మంజూరు పట్ల ఎమ్మెల్యే కవ్వంపల్లి హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి వాకిటికి మానకొండూర్ నియోజకవర్గ ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు





**ధర్మపురి, సెప్టెంబర్ 26, (ది క్రైమ్ న్యూస్):** జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఎం.ఎల్.ఏ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం చింతామణి చెరువు కట్టమీద ఉన్న ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ చాకలి ఐలమ్మ సామాజిక సమానత్వానికి ప్రతీక, అణగారిన వర్గాల స్వాభిమానానికి చిహ్నం అని ఆమె పోరాటమే నేటి తరాలకు ప్రేరణ అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఐలమ్మ ఆశయ సాధనకు కట్టుబడి ఉందని, సమాజంలోని వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తోందని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రజక సంఘం సభ్యులు అధికారులు పాల్గొన్నారు.

## దుర్గా దేవి అమ్మవారిని దర్శించుకున్న సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి



**ధర్మపురి, సెప్టెంబర్ 26, (ది క్రైమ్ న్యూస్):** ధర్మపురి పట్టణంలోని కూరగాయల మార్కెట్ లో ఏర్పాటు చేసిన దుర్గా దేవి అమ్మవారిని శుక్రవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మాండపం నిర్వాహకులు మంత్రి అడ్లూరి కి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓసీపి-టు లో వర్షం ప్రభావం నీటమునిగిన మైనింగ్ ఆఫీసులు

**- ఉద్యోగుల భద్రత, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని తక్షణమే రక్షణ చర్యలు చేపట్టాలి**
**- ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్ రెడ్డి**



**రామగిరి, సెప్టెంబర్ 26(ది క్రైమ్ న్యూస్):-** ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షంతో నిన్న కాలువ తెగిపోవడంతో ఓసీపి-టు మైన్ మేనేజర్ ఆఫీస్,వెల్ఫేర్ సెక్షన్, క్యాంటీన్, మ్యాన్వే, సైట్ ఆఫీస్, సర్వే ఆఫీస్, ఎస్.ఎం.ఈ సెక్షన్ పూర్తిగా నీటమునిగాయి. ఆఫీసుల్లో పనిచేస్తున్న సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఫైల్ లు , పరికరాలు, ఫర్నిచర్ కూడా దెబ్బతిన్నాయి.ఈ ఘటనపై ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేస్తూ ప్రతిసారీ వర్షాల సమయంలో ఎస్ఎంఈ సెక్షన్, మ్యాన్ వే, సైట్ ఆఫీసు మునిగి పోతు ఉన్నాయి ఇలాంటి సమస్యలు మళ్లీ జరగకుండ యాజమాన్యం తక్షణమే శాశ్వత చర్యలు తీసుకోవాలిని అన్నారు. ముఖ్యంగా ఈ ఆఫీసులన్ని డౌన్ ఉన్నాయి కాబట్టి ఎత్తు లేపి నిర్మించాలిని బలమైన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలిని కోరారు. లేకపోతే భవిష్యత్తులో పనులపై తీవ్ర ప్రభావం పడుతుంది తెలిపారు.అలాగే, ఉద్యోగుల భద్రత, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని తక్షణమే రక్షణ చర్యలు చేపట్టాలని ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్ రెడ్డి యాజమాన్యాన్ని కోరారు. నీట మునిగిన ప్రదేశాలను, వాటి పరిస్థితులను పరిశీలించిన వారిలో కేంద్ర కార్యదర్శి వుయ్యాల కుమారస్వామి,పిట్ సెక్రటరీ రామిడ్ల మనోహర్ తదితరులు ఉన్నారు.

## జాతీయ స్థాయి క్రీడా పోటీలకు గురుకుల విద్యార్థి



**మానకొండూర్, సెప్టెంబర్ 26(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం దేవంపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పదవ తరగతి విద్యార్థి జిల్లాల వేణు ఈనెల13 నుండి 15వరకు జనగామ జిల్లా కోనూరులో జరిగిన సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో తృతీయ స్థానంలో నిలిచి తమిళనాడులోని దిండిగల్లో పిఎస్ఎన్ఏ కళాశాలలో నిర్వహించే జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు అర్హత సాధించారు..ఈ సందర్భంగా పాఠశాల ప్రధానాచార్యులు గోలి జగన్నాథం, వైస్ ప్రిన్సిపాల్ ఆది. కొమురయ్య, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ ఎం.రేణుక అధ్యాపకులు, అశోక రెడ్డి, శివప్రసాద్, మనోహర్, ఉపాధ్యాయ కార్యదర్శి నరసింహచారి, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రవీణ్, శివప్రసాద్, ఉపాధ్యాయ బృందం విద్యార్థి వేణును ప్రశంసించారు.

## ఛత్రపతి శివాజీ యువసేన వారి శ్రీ దుర్గామాత ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మార్వో



**మంథని, (ది క్రైమ్ న్యూస్):** చత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ దుర్గా దేవి నవరాత్రి ఉత్సవల్లో ఐదవ రోజు అమ్మవారు శ్రీ లలిత త్రిపుర సుందరి మాత రూపంలో దర్శనం ఇచ్చారు. ఆ తర్వాత నిత్య పూజ నిర్వహించి, పూజకు వచ్చే మహిళలచే కుంకుమ అర్చన నిర్వహించారు. అలాగే ఈరోజు పూజా కార్యక్రమానికి కమాన్ పూర్ఎమ్మార్వో వాసంతి గారు, ఆర్ ఐ స్రవంతి మరియు వారి ఆఫీసు సిబ్బంది అందరూ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చత్రపతి శివాజీ యువసేన నాయకులు, భక్తులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ130వ జయంతి వేడుకలు

### నిర్వహించిన జాతీయబీసీ సంక్షేమ సంఘం మంథని నియోజకవర్గ అధ్యక్షుడు తోట రాజ్ కుమార్



**మంథని, (ది క్రైమ్ న్యూస్): సెప్టెంబర్ 26:** కమాన్పూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వీరనారిచాకలి ఐలమ్మ 130వ జయంతి వేడుకలను జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో పార్టీ కమాన్పూర్ మండల యూత్ అధ్యక్షుడు బొమ్మగాని అనిల్ గౌడ్ %ూవీజ% కమాన్పూర్ మాజీ వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మీ మల్లు జలపల్లి మాజీ ఉపసర్పంచ్ సాయికుమార్ టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అనవేన భూమయ్య జూలపల్లి గ్రామ యూత్ అధ్యక్షుడు అనగానే దేవేందర్ పాల్గొన్నారు.

## రంగాధమునిపల్లిలో చాకలి ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణ



**గొల్లపల్లి, సెప్టెంబర్ 26(ది క్రైమ్ న్యూస్ ):** భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన వీర వనిత చాకలి ఐలమ్మ అని రజక సంఘం అధ్యక్షుడు రాముల్లు అన్నారు. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం రంగాధమునిపల్లి గ్రామంలో తెలంగాణ రైతాంగ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ(చిట్యాల ఐలమ్మ) 130వ జయంతి పురస్కరించుకొని ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుక ఘనంగా నిర్వహించారు. రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని శు క్రవారం రజక సంఘం అధ్యక్షులు రాగల్ల రాముల్లు తో కలసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా రాముల్లు మాట్లాడుతూ.. భూ పెత్తందారులకు, రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న ఐలమ్మ ఫ్యామిలీని ఎన్ని చిత్రహింసలు పెట్టిన ఎత్తిన జెండా దించని వీర వనిత ఐలమ్మ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రజక సంఘ సభ్యులు గ్రామ ప్రజలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు కష్టపడాలి

### - కాంగ్రెస్ సేవాదళ్ ప్రతినిధులకు దిశా నిర్దేశం



**ధర్మారం, సెప్టెంబర్,26 ( ది క్రైమ్ న్యూస్ ):** హైదరాబాద్ గాంధీభవన్ లో తెలంగాణ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గం, 33 జిల్లాల అధ్యక్షులు, నియోజక వర్గాల అధ్యక్షులు, మండలాల అధ్యక్షులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు.ఈ సమావేశంలో సేవాదళ్ యొక్క లక్ష్యాలు, పార్టీ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు కష్టపడలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం పాటుపడాలని, రాబోయే ఎంపీటీసీ, జెడ్పిటిసి, సర్పంచ్ ఎలక్షన్లలో మన అభ్యర్థులను గెలిపించుకోవాలని దిశ నిర్దేశం చేసినట్లు ధర్మారం మండలానికి చెందిన పెద్దపల్లి జిల్లా సేవా అధ్యక్షులు బోల్లి స్వామి తెలిపారు.ఇరుగురాల మహేష్,పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## భవాని మాతను దర్శించుకున్న మద్దుల గోపాల్ రెడ్డి



**ఎండపల్లి, సెప్టెంబర్26(ది క్రైమ్ న్యూస్):** జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలోని పలు గ్రామాలలో మండపల్లో కొలువుతిరిన భవాని మాతను కాంగ్రెస్ నాయకులు మద్దుల గోపాల్ రెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహణకై ఒక్కో మండపానికి రూ. 2వేల రూపాయలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... గ్రామాలలో భక్తి శ్రద్దలతో భవాని మాతని దర్శించుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. రానున్న సద్దుల బతుకమ్మ, దసరా పండుగకి మండల ప్రజలకు ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు.

# కార్మిక సంఘాల ఐక్యతతోనే (పిఎల్ఆర్) బోనస్ ఒప్పందం

### ◆ "సీఐటియూ" నాయకుల వెల్లడి



**యైటింక్లయిన్ కాలనీ. (ది క్రైమ్ న్యూస్). సెప్టెంబర్ 26:** కార్మిక సంఘాల ఐక్యత తోనే నేడు కోల్ కతా లో జరిగిన జెబిసిసిఐ సమావేశంలో బొగ్గు గని కార్మికులకు లక్షా మూడు వేల రూపాయల పిఎల్ఆర్ (దీపావళి) బోనస్ చెల్లింపుపై ఒప్పందం కుదిరిందని, సీఐటీయూ జాతీయ నాయకులు, జెబిసిసిఐ సభ్యులు డి.డి.రామానందన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు, ఆల్ ఇండియా కోల్ వర్కర్స్ ఫెడరేషన్ సభ్యులు కుంట ప్రవీణ్ కుమార్ లు శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. కోల్ ఇండియాలో 2024- 2025 సంవత్సరం వచ్చిన లాభాలపై ఈ నెల 25 న బోనస్ లపై చర్చించడానికి స్టాండర్డైజేషన్ కమిటీ కోల్ కతా లో సమావేశమై జరిపిన సుదీర్ఘ చర్చల తర్వాత, లక్ష మూడు వేల రూపాయల బోనస్‌ను నిర్ణయించడం జరిగిందనీ పేర్కొన్నారు. జరిగిన ఒప్పందం ప్రకారం పిఎల్ఆర్ బోనస్ గత సంవత్సరం కంటే పెరుగుదల రూ.8,750/- రూపాయలు, ఉండగా, ఈ సంవత్సరం, పెరుగుదల రూ.9,250/- రూపాయలుకు పెంచుకోవడం జరిగిందని తెలిపారు. మొదటగా సీఐటీయూ జాతీయ నాయకులు, జెబిసిసిఐ సభ్యులు డి.డి.రామనందన్ సంస్థ డివిడెంట్ లో సగం రూపాయలను బోనస్ గా అందించాలని డిమాండ్ చేయగా, మిగిలిన సంఘాలు ఒప్పుకోవడం జరిగిందని, ఆ తర్వాత స్టాండర్డైజేషన్ కమిటీ సమావేశంలో యూనియన్లు 1.50 లక్షల రూపాయలు డిమాండ్ చేసి సమావేశాన్ని బహిష్కరించి బయటికి రాగా, యాజమాన్యం అభ్యర్థన మేరకు మళ్ళీ పాల్గొనడం జరిగిందని తెలిపారు. ఇక అర్ధరాత్రి వరకూ జరిగిన సమావేశంలో చివరికి, లక్షా మూడు వేల రూపాయలపై ఒక ఒప్పందం కుదిరిందనీ వారు వివరించారు. ఈ బోనస్ డబ్బును 26.09.2025 న కోల్ ఇండియా కార్మికులకు వారి వారి ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. కార్మిక సంఘాల పిలుపుమేరకు కార్మికులు ఒక్క రోజు సమ్మెను విజయవంతం చేస్తూ, కార్మిక సంఘాలకు చేకూర్చిన బలంవల్లే ఈ ఒప్పందం కుదిరిందని, ఇది కార్మికుల విజయమని వారు భావిస్తున్నామ న్నారు. 2024-2025 ఆర్థిక సంవత్సరంలో 30 మస్టర్లు చేసిన ప్రతీ కార్మికుడు ఈ బోనస్ కు అర్హుడుగా ఉంటారని వారు వెల్లడించారు. ఇక రాష్ట్ర ప్రభుత్వము పెద్ద ఎత్తున సమావేశం ఏర్పాటు చేసి ప్రకటించిన సింగరేణి లాభాల వాటాతో కార్మికులు అసంతృప్తితో ఉన్నారని, ఈ విషయంలో పునరాలోచించాలని లేదా, కాలయాపన చేయకుండా లాభాల వాటా చెల్లింపుకు సర్క్యులర్ ను వెంటనే విడుదల చేసి, ఈ నెల 29 లోపు కార్మికుల ఖాతాల్లో జమచేయాలని, అలాగే అన్ని కార్మిక సంఘాల అభ్యర్థన మేరకు, దసరా సెలవు మార్పుపై స్పందించాలని వారు సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.

# సింగరేణి అధికారుల నిర్లక్ష్యం కార్మికుల కష్టానికి మచ్చ

### ◆ కార్మికులు చిన్న తప్పు చేసినా సస్పెన్షన్లు, చార్జ్‌షీట్లు ◆ కేంద్ర బొగ్గు గని శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి దృష్టికి ఈ విషయం తీసుకువెళ్తాం ◆ బీజేపీ జిల్లా ఎంపీటీసీ ఫోరం అధ్యక్షులు మొలుమూరి శ్రీనివాస్





**రామగిరి, సెప్టెంబర్ 26(ది క్రైమ్ న్యూస్):-** సింగరేణి ఆర్.జి-త్రీ, ఓసీపీ-టు లో నిన్న రాత్రి కురిసిన వర్షంతో మేనేజర్ ఆఫీస్, మెన్‌వే, క్యాంటీన్, సర్వే ఆఫీస్ అన్నీ నీటమునిగాయిని ఇది సహజ విపత్తు వల్ల కాదు, పూర్తిగా అధికారుల నిర్లక్ష్యం కారణంగానే జరిగిందని బీజేపీ జిల్లా ఎంపీటీసీ ఫోరం అధ్యక్షులు మొలుమూరి శ్రీనివాస్, కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు.మూడు నెలలుగా కాల్వ పనులు చేసినప్పటికీ, వర్షం రాగానే ఆఫీసులు మునిగిపోవడం అధికారుల పనితీరుకు నిదర్శనమని విమర్శలు వెల్లువెత్తాయి. ఓసీ-టు లో కార్మికులకు కనీస సౌకర్యాలు లేకపోవడం, రెస్ట్ హాల్ అధ్వానంగా ఉండడం, కార్మికుల పర్సనల్ ఫైల్స్ అప్‌డేట్ చేయకపోవడం వంటి అంశాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది. కార్మికుల సంక్షేమం కన్నా ఉత్పత్తిపైనే అధికారులు దృష్టి పెట్టడం వల్లే ఇలాంటి విపత్తులు జరుగుతు న్నాయని కార్మికులు ఆరోపించారు. వెంటనే చర్యలు తీసుకొని ఆఫీసులను ఎత్తైన ప్రదేశాలకు మార్చాలని, అలాగే కార్మికుల ఫైల్స్ సక్రమంగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు చిన్న తప్పు చేసినా సస్పెన్షన్లు, చార్జ్‌షీట్లు ఇస్తారు. మరి ఇప్పుడు కోట్ల నష్టం చేసిన అధికారులపై ఎవరు చర్య తీసుకుంటారు?" అని కార్మికులు ప్రశ్నించారు. వాతావరణ శాఖ ముందుగానే భారీ వర్షాలపై హెచ్చరించినా పట్టించు కోకపోవడం విచారకరమని తెలిపారు. సింగరేణి సి ఎండి, డైరెక్టర్ (పా) చర్యలు తీసుకోకపోతే, కేంద్ర బొగ్గు గని శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి దృష్టికి ఈ విషయం తీసుకెళ్తామని బీజేపీ జిల్లా ఎంపీటీసీ ఫోరం అధ్యక్షులు మొలుమూరి శ్రీనివాస్ హెచ్చరించారు.



# ఆవులాావులు పోట్లాట పెట్టుకుని.. పోటాపోటీ ప్రెస్ మీట్‌లు

### ◆ కొండంత రాగాలు-పనికిరాని పాటలు ◆ సమస్యను వదిలి-పొంతన లేని అంశాలు ◆వీళ్లు మారరా? అంటున్న జనాలు

### ◆ కాల్వ శ్రీరాంపూర్ రాజకీయ రంగస్థలంపై ది క్రైమ్ న్యూస్ అందిస్తున్న ప్రత్యేక కథనం అందరికోసం...

**(ది క్రైమ్ న్యూస్) బ్యూరో:** పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండల రాజకీయ వేదిక భలే రసవత్తరంగా మారింది. పోటాపోటీ ప్రెస్ మీట్లతో నువ్వెంత అంటే నువ్వెంత అనుకుంటూ బండ బూతులు తిట్టుకుంటూ బలా బలాలు చూపిస్తున్నారే తప్ప ప్రజల( రైతుల) సమస్యపై స్పష్టత ఇవ్వలేకపోతున్నారు.

ఒక సమస్య నుంచి తప్పించుకోవడం ఎలా? జనాల దృష్టిని మళ్లించడం ఎలా? అని ఒక రాజకీయ రాటుదేలిన నాయకున్ని అడిగితే... వెరీ సింపుల్ మరో సమస్యను సృష్టించు అన్నాడట. ప్రస్తుతం కాల్వ శ్రీరాంపూర్ లో జరుగుతున్న రాజకీయ రగడ కూడా అచ్చం ఇలాగే ఉంది.

సమస్యను పక్కదారి పట్టించడంలో అంటే డైవర్షన్ పాలిటిక్స్ లో కాంగ్రెస్ పార్టీది పెట్టింది పేరు. అవలీలగా సమస్యను పక్కదారి పట్టించడం వీళ్లకు వెన్నతో పెట్టిన విద్య. ప్రస్తుతం అధికార పక్ష నాయకులు ఈ సూత్రాన్నే తూచా తప్పకుండ పాటిస్తున్నారు. మండలంలోనే కాదు ప్రస్తుతం పెద్దపల్లి జిల్లాలో హాట్ టాపిక్‌గా మారిన నక్కల ఒర్రె అంశమే ఈ రచ్చ రాజకీయానికి ప్రధాన కారణం.

నాట్లేయడానికి వచ్చిన వేరే గ్రామ కూలీలు వరదలో కొట్టుకుపోవడం వల్ల మల్యాల



రైతులు ఈ సమస్యను లేవనెత్తడం జరిగింది. ఈ దుర్ఘటనను ఒక అధికారపక్ష నాయకుడు హేళన చేయడం, కావాలనే కూలీలు వరదలో కొట్టుకుపోయినట్టు నటించారని, మాపై బురదలడానికే ఇదంతా చేశారంటూ మల్యాల గ్రామ రైతులను ఎద్దేవా చేశాడు.పైగా ఇదే వాగుపై మరోచోట వంతెన నిర్మాణానికి సంబరాలు జరుపుకోవడం అసలు సమస్యకు ప్రధాన కారణం.

మా దగ్గర నిర్మించాల్సిన వంతెనను మరోచోట కట్టడం ఏమిటి? అంటూ మల్యాల గ్రామస్తులు ప్రతిపక్ష నాయకుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఈ అంశాలపై గట్టి సవాళ్లే విసిరారు. చర్చకు సిద్ధమా? అంటూ ప్రశ్నించారు. ఈ వీడియో కూడా జిల్లాలో వైరల్ అయింది.

దీంతో రైతులు అడిగిన సమస్యను పక్కనపెట్టి దిక్కారాన్ని సహించలేని అధికారపక్ష నాయకులు ప్రెస్ మీట్లకు తెరలేపి విపక్ష నాయకులపై విరుచుకు పడడమే ఎజెండాగా సంబంధం లేని అంశాలను లేవనెత్తుతూ విమర్శలు చేస్తున్నారు. అనవసరపు అంశాలను ప్రస్తావిస్తూ తామేదో దివి నుంచి భూమికి దిగివచ్చిన దేవతా మూర్తుల్లాగా వాళ్లకు వాళ్లే కీర్తించు కుంటున్నారు. పనికిమాలిన వ్యక్తిగత అంశాలను లేవనెత్తుతూ కొండంత రాగం తీసి దిక్కుమాలిన పాటలు పాడుతున్నారు.ఇదిగో సాంక్షన్ లెటర్ అంటూ పేపర్లను చూపిస్తున్నారు తప్ప శంకుస్థాపనకు మాత్రం రావడం లేదు. వాస్తవానికి ఈ వంతెన గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జరిగింది అంటూ ప్రతిపక్ష నాయకులే చెప్పడం గమనార్హం. దానిని ఇప్పుడు అధికార పార్టీ నాయకులు చూపిస్తూ ఆ ఘనత మాదే అంటున్నారు తప్ప కొబ్బరికాయ కొట్టడానికి మాత్రం ఎవరూ ముందుకు రావడం లేదేందుకు? అన్నదే ఇక్కడ ప్రశ్న. సాంక్షన్ లెటర్లు చూపించినంత మాత్రాన మాకు ఒరిగే లాభం ఏమిటి? ఇలాంటి సాంక్షన్లు ఎన్నో పనులకు జరుగుతూనే ఉంటాయి,అధికార పార్టీ నాయకులు బడ్జెట్ కేటాయించి టెండర్లు పిలిచి పనిని ప్రారంభించినప్పుడే కదా? మాకు న్యాయం జరిగినట్టు అంటున్నారు బాధిత రైతులు.

ఏది ఏమైనా గత పది రోజులుగా అధికార విపక్ష నాయకుల ప్రెస్ మీట్లను గమనిస్తున్న రైతులు ఆవులావులు కొట్లాడి దూడల కాళ్లు విరగొట్టినట్టు..మీ గొడవలన్నీ పక్కనపెట్టి మా గతి ఏమిటో చెప్పండి? అంటూ నిలదీస్తున్నారు. వంతెన పై స్పష్టమైన హామీ రావాలంటూ కోరుతున్నారు.

# హైడ్రా బాధితులకు అండగా నిలుస్తాం : బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్





**కుత్బుల్లాపూర్ (ది క్రైమ్ న్యూస్) సెప్టెంబర్ 26:** ఈరోజు 125 - గాజుల రామారం డివిజన్ బాలయ్య నగర్, గాలి పోచమ్మ బస్తీలలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పర్యటించి ఇటీవల హైడ్రా అధికారులు కూల్చివేసిన ఇళ్లను, బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...... సర్వే నెంబర్ 307లో ఏళ్లకు ఏళ్లుగా నివాసం ఉంటున్న రెక్కాడితే గానీ డొక్కాడని పేదవాళ్లు ఉంటున్న నివాసాలను, పండుగ పూట అధికారులు కూల్చివేయడం దారుణమన్నారు. ఈ కూల్చివేతలపై త్వరలోనే హైడ్రా కమిషనర్ రంగనాథ్ ను కలిసి పూర్తి సమాచారం అందజేసి నిజమైన బాధితులకు అండగా ఉండి వారికి న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా బస్తీల వాసులు, స్థానిక బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు....

# ఆటల పోటీలలో గెలుపు ఓటములు తాత్కాలికం

◆ క్రీడాకారులు పట్టు వదలకుండా సాధన చేస్తే విజయం తప్పకుండా వరిస్తుంది ◆ ముగిసిన కంపెనీ స్థాయి షెటిల్, టి.టి పోటీలు ◆ విజేతలకు బహుమతులు అందజేత ◆ రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు, ◆ అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు








**రామగిరి,సెప్టెంబర్26(ది క్రైమ్ న్యూస్):-** క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి, కోల్ ఇండియా స్థాయిలో సింగరేణి సంస్థ పేరు నిలబెట్టాలని రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు లు అన్నారు. రామగుండం-త్రీ, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహించిన కంపెనీ స్థాయి షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ పోటీలలో భాగంగా శుక్రవారం కమ్యూనిటీ హాల్ నందు ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు లు ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటల పోటీలలో గెలుపు ఓటములు తాత్కాలికమని , కావున క్రీడాకారులు పట్టు వదలకుండా సాధన చేస్తే విజయం తప్పకుండా వరిస్తుందని అన్నారు. క్రీడాకారులు క్రమం తప్పకుండా సాధన చేస్తూ కోల్ ఇండియా స్థాయి పోటీల్లో రాణించి సంస్థకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఈ పోటీలను నిర్వహించడంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, విజయవంతం చేయడంలో కృషి చేసిన నిర్వాహకు లందరికీ అభినందనలు తెలిపారు. ఈ పోటీలలో పాల్గొన్న క్రీడాకారులు వారి అభిప్రాయాలను తెలియజేస్తూ పోటీల సందర్భంగా చాలా చక్కని వసతులు, ఏర్పాట్లు చేశారని అన్నారు. ఎలాంటి విభేదాలకు తావివ్వకుండా నిర్వాహకులు ఈ పోటీలను నిర్వహించడం సంతోషకరమన్నారు. అనంతరం త్వరలోనే పదవి విరమణ పొందనున్న సీనియర్ క్రీడా కారులను సన్మానించారు. ఈ పోటీల్లో బెల్లంపల్లి-మందమర్రి, శ్రీరాంపూర్, రామగుండం -వన్ టు, రామగుండం-త్రీ -భూపాలపల్లి, మణుగూరు-ఇల్లందు, కార్పొరేట్-కొత్తగూడెం రీజియన్ల నుండి సుమారు 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు వై.వి.రావు, కోట రవీందర్ రెడ్డి, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, గౌరవ కార్యదర్శి సాయిస్వరూప్, అసిస్టెంట్ స్పోర్ట్స్ సూపర్వైజర్ నరేందర్ రెడ్డి, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ జవ్వాజి అంజయ్య, ఇతర అధికారులు, స్పోర్ట్స్ సూపర్వైజర్లు, కార్మిక సంఘాల నాయకులు, సీనియర్ క్రీడాకారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ వీరత్వాన్ని మహిళలు స్ఫూర్తిగా తీసుకోవాలి

◆ చాకలి ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించిన సెంటనరీ కాలనీ పట్టణ శాఖ అధ్యక్షులు తీగల శ్రీధర్

**రామగిరి, సెప్టెంబర్ 26(ది క్రైమ్ న్యూస్):-** రామగిరి మండలం సెంటనరీ కాలనీ బిజెపి పార్టీ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ములుమూరి శ్రీనివాస్ పాల్గొని వీరనారి చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూల మాల వేసి అనంతరం వారు మాట్లాడుతూ వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని తెలంగాణ సమాజం కోసం తెలంగాణ మహిళల కోసం నిజాం నవాబు పై పోరాటం చేసిన వీరనారి చాకలి ఐలమ్మ అని కొనియాడారు. టిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు చాకలి ఐలమ్మ జయంతిని కేవలం వాళ్ల పార్టీ ఉనికి కోసమే తప్ప చాకలి ఐలమ్మ ను జయంతిని చేసే నైతిక హక్కు టిఆర్ఎస్ కాంగ్రెస్కు లేదని 1948 సెప్టెంబర్ 17 నా తెలంగాణ విమోచన జరిగింది. అప్పుడు చాకలి ఐలమ్మ నిజాం నవాబుతో పోరాటం చేసిన వ్యక్తి తెలంగాణ మహిళలను నగ్నంగా నిజాం నవాబు బతుకమ్మ ఆడిస్తే వారిని తడిమి కొట్టిన చరిత్ర చాకలి ఐలమ్మ ది మరి ఆమె చరిత్రను పాఠ్య పుస్తకాలు చేర్చాలని అలాగే తెలంగాణ విమోచన దినోత్సవం గతంలో టిఆర్ఎస్ పార్టీ విమోచన కాదు విలీనం అన్నది ఇప్పుడున్న కాంగ్రెస్ పార్టీ ఇది ప్రజా పాలన అంటుంది కాంగ్రెస్ టిఆర్ఎస్ పార్టీలు కేవలం ఓట్ల రాజకీయమే చేస్తున్నది తప్ప వీళ్ళ పోరాట ప్రతిమను గుర్తించడం లేదు అని ఆయన అన్నారు. రాబోయే రోజుల్లో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వస్తే తెలంగాణ రాష్ట్రంలో చాకలి ఐలమ్మ జయంతిని ఆమె యొక్క పోరాడిన పోరాటాన్ని పాటే పుస్తకాల్లో చేర్చేలాగా రాష్ట్ర అధ్యక్షుని దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు తీగల శ్రీధర్, రజక సంఘం చిన్న రాజన్న, ధర్మంలో భూమయ్య, నవీన్, ప్రదీప్, రాజ్ పాల్గొన్నారు.



# నిర్లక్ష్యానికి మూల్యం ఓసీపి-టు సైట్ ఆఫీస్ జలమయం

◆ జల దిగ్బంధంలో....ఓసిపి టూ ◆ సీఐటీయూ బ్రాంచి కార్యదర్శి దొమ్మటి కొమురయ్య

**రామగిరి, సెప్టెంబర్ 26(ది క్రైమ్ న్యూస్):-** సింగరేణి యాజమాన్యం ముందు చూపు లేకుండా,సరైన ప్లాన్ తో వ్యవహరించని మూలంగా సైట్ ఆఫీస్ మొత్తం, వెల్ఫేర్ సెక్షన్, మ్యాన్వే చుట్టుగా ఉన్న సెక్షన్స్ అన్ని నీటిలో మునిగినాయి. వాటిలోని విలువైన వస్తువులు, సమాచారం,ఫైల్స్ గల్లంతు కావడం జరిగింది. వీటికి ఎవరు బాధ్యులు అని సీఐటీయూ బ్రాంచి కార్యదర్శి దొమ్మటి కొమురయ్య ప్రశ్నించారు. అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమని ఆరోపణలు విన వస్తున్నాయి. గతంలో కూడా ఇలాగే సుమారు 10 సంవత్సరాల క్రితం నష్టం జరిగినట్లుగా తెలుస్తోంది కాగా అప్పుడు కూడా తాత్కాలిక ఆలోచనలు చేయడం తప్ప దీర్ఘకాలిక ప్లాన్స్ చేయలేదు. ఇది మానవ తప్పిదం. ప్రకృతికి విరుద్ధంగా ప్లాన్స్ చేయడం సరికాదు. ఈ నీరు ఎక్కడి నుంచి వచ్చాయో చర్యలు చేపట్టారు. నీరు కాల్వలో ఒక్క బండ రాయి అడ్డుగా వస్తే బ్లాస్టింగ్ చేయగా ఇండ్లపైన పడి సమస్య వచ్చెను. దానిని అలాగే ఓదలకుండా మ్యాన్వెల్గా చేసినా కాలువ పూర్తి అవుతే ఇంత పెద్ద ఎత్తున ముంపు ఏర్పడేది కాదు అని మొదటి నుండి ఓసీపి-టు సరిఅయిన ప్లాన్ తో కట్టడాలు జరగలేదు కాబట్టే మొదటి నుండి సైట్ ఆఫీస్, ఎస్ఏంఈ, వెల్ఫేర్ సెక్షన్, మ్యాన్వే, వర్క్ షాప్ ప్రతి సంవత్సరం మునగడం లేదా బురదమయం అవడం జరుగుతుందని ఇప్పటి కయినా శాశ్వత పరిష్కారాన్ని గైకొనాలని సీఐటీయూ ఆర్.జీ-త్రీ కార్యదర్శి డి.కొమురయ్య డిమాండు చేస్తున్నారు.





# విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

◆ మైన్స్ సేఫ్టీ డైరెక్టర్ రాజ్ కుమార్

**యైటింక్లయిన్ కాలనీ. (ది క్రైమ్ న్యూస్). సెప్టెంబర్ 26:** విద్యుత్ ప్రమాదాల నివారణలో అప్రమత్తంగా ఉండాలని డైరెక్టర్ మైన్స్ సేఫ్టీ ఎలక్ట్రికల్ (డిఎంఎస్) రాజ్ కుమార్ అన్నారు. శుక్రవారం సాయంత్రం సింగరేణి రామగుండం రెండవ ఏరియా జనరల్ మేనేజర్ బి.వెంకటయ్య అధ్యక్షతన ఏరియా సిమ్ టార్సులో ఏర్పాటు చేసిన, విద్యుత్ ప్రమాదాలు నియంత్రణ అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డైరెక్టర్ మాట్లాడుతూ.. రామగుండం రీజియన్ లో వారం రోజులపాటు నిర్వహించిన విద్యుత్ సరఫరా తీరు తనిఖీల్లో గుర్తించిన లోపాలకు సంబధిత సింగరేణి అధికారులకు రక్షణ పరమైన అంశాలను వివరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో డైరెక్టర్ మైన్స్ సేఫ్టీ (ఎలక్ట్రికల్) రాజీవ్ ఓం ప్రకాష్ వర్మ కోమల్ చౌదరి, సింగరేణి ఏరియా ఎస్ఓ టు జిఎం రాముడు, ఏరియా సేఫ్టీ అధికారి ఎస్. సంతోష్ కుమార్, మూడవ ఏరియా ఇంజనీర్ శేఖర్ బాబు, ఒకటవ ఏరియా ఇంజనీర్ రామ్మోహన్, ఇంకా రామగుండం రీజియన్ లోని అన్ని ప్రాజెక్టు అధికారులు, మేనేజర్లు పాల్గొన్నారు.





## అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

- దుర్గామాత పూజ లో పాల్గొన్న జిఎంలు నరేంద్ర సుధాకరరావు, కొలిపాక నాగేశ్వరరావు



**రామగిరి, సెప్టెంబర్ 26(ది క్రైమ్ న్యూస్):-** సింగరేణి అడ్రియాల లాంగ్ వాల్ గని నందు దుర్గామాత శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా శుక్రవారం చండీ హోమం, మహా ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు లు సతీసమేతంగా పాల్గొని దుర్గామాత కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన మహా ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిఎం నరేంద్ర సుధాకర్ రావు మాట్లాడుతూ అమ్మవారి కృప వల్ల ఏరియాకు నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించడం జరుగుతుందని ప్రాజెక్టు జీవిత కాలం పొడిగింపు కొరకు పర్యావరణ అమతులు రావలసి ఉందని త్వరలోనే అనుమతులు వస్తాయని ఏరియా పరిధిలోని ఉద్యోగులకు అమ్మవారి కృపా కటాక్షం ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ కె.యాదయ్య, ఎస్వోటుజిఎం బండి సత్య నారాయణ, ప్రాజెక్ట్ ఆఫీసర్ కె.జనార్ధన్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, మేనేజర్ పెంచలయ్య తో పాటు ఇతర అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



**ఎండపల్లి, సెప్టెంబర్ 26(ది క్రైమ్ న్యూస్):** తెలంగాణలో భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగిన తొలి భూ పోరాటంలో కీలకపాత్ర పోషించిన వీరనారి చాకలి ఐలమ్మ అని రజక సంఘం నాయకులు అన్నారు. జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ 130వ జయంతి వేడుకలను రజక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి పలువురు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఐలమ్మ వరంగల్ జిల్లా రాయపర్తి మండలం క్రిష్టాపురం గ్రామంలో 1895 సెప్టెంబర్ 26న ఓరుగంటి మల్లమ్మ, సాయిలుకు నాలుగవ సంతానంగా చాకలి ఐలమ్మ జన్మించిందని అన్నారు. వీరిది వెనుకబడిన కుటుంబమని, చాకలి కులవృత్తే వారికి జీవనాధారమని, పాలకుర్తికి చెందిన చిట్యాల నర్సయ్యతో ఐలమ్మకి బాల్య వివాహం జరిగిందని తెలిపారు. నిజాం పాలనలో విస్నూర్ దేశ్‌ముఖ్‌కు వ్యతిరేకంగా ఆమె చేసిన తిరుగుబాటు ఆమెకు స్ఫూర్తిదాయకమైన చరిత్రను అందించిందని అన్నారు. తెలంగాణ ఉద్యమాల్లో ఆమె పాత్ర కీలకమని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నేరెళ్ల అశోక్, ఉపాధ్యక్షులు మెట్టుపల్లి సాగర్, గౌరవ అధ్యక్షులు కాల్వ రమేష్, ప్రధాన కార్యదర్శి మైలారం సతీష్, గన్నేరువరం సతీష్, నేరెళ్ల నరసయ్య, గన్నేరువరం శ్రీనివాస్, ఎండపల్లి అధ్యక్షులు నస్పూరి మల్లేష్, కామ్పల్లి సంపత్, పెద్దయ్య, శ్రీధర్, శ్రీకాంత్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

# లలితా పంచమి సందర్భంగా ఉపాంగ లలితా వ్రతం

**రామగిరి, సెప్టెంబర్ 26(ది క్రైమ్ న్యూస్):-** శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం మంచమి పట్టణంలోనే శ్రీ లలితాంబిక దేవాలయంలో అమ్మవారిని అందంగా అలంకరించారు. ఆశ్వయుజ శుద్ధ పంచమి శుక్రవారం 'ఉపాంగ లలితావ్రతం' భక్తులు ఘనంగా ఆచరించారు. ఈ రోజున అమ్మవారి ఆలయంలో భజనను చేస్తూ, జాగరణ చేశారు. ఈ వ్రతాన్ని చేయడంవల్ల అమ్మవారి కటాక్షం లభించి సకల శు భాలు కలుగుతాయి. 'త్రిపురత్రయం' లో రెండవ శక్తి స్వరూపిణి ఈ తల్లి. అందుకే శరన్నవరాత్రులలో వచ్చే పంచమిని లి'లలిత పంచమి'లి అని అంటారు. చెరకుగడ, విల్లు, పాశము, అంకుశము ధరించి, లక్ష్మీదేవి, సరస్వతీదేవి కుడి ఎడమలు సేవలు అందిస్తుండగా శ్రీ లలితా పరాభట్టారిక భక్తుల ఇక్కట్లు తొలగించి, అష్టైశ్వర్యాలను ప్రసాదిస్తుంది. కన్యలు మంచి భర్త కొరకు, ముత్తైదువులు దీర్ఘ సుమంగళి గా అఖండ సౌభాగ్యం కొరకు ఈ నవరాత్రులలో అయిదవ రోజు 'ఉపాంగ లలితా వ్రతం' ఆచరిస్తారు. అమ్మవారిని శ్రీలలితా దేవి అలంకారంలో సహస్రనామ, అష్టోత్తర నామాలతో కుంకుమ పూజలు చేసి , ముత్తైదువలకు తాంబూలాలు ఇచ్చుకుంటారు. ముత్తైదువులను పిలిచి , సువాసినీ పూజలు చేస్తారు. కైలాస గౌరీ నోము కాని గ్రామ కుంకుమ నోముకాని నోచుకున్న వారు చాలా మంది ఈ రోజు ఉద్యాపన చేసుకుంటారు. కొంతమంది తమ గృహాల్లోనే సామూహిక లక్ష కుంకుమార్చనలు ఏర్పాటు చేసుకుంటారు. బొమ్మల కొలువులు పెట్టుకున్న వారు పేరంటాలు చేసుకుంటారు. శ్రీ లలితా దేవి తనని కొలిచిన భక్తుల దారిద్ర దుఃఖాలు నశింపచేస్తుంది. కుంకుమ పూజలు సలిపేవారికి మాంగళ్య సౌభాగ్యాన్ని ప్రసాదిస్తుంది. పంచమి నాడు శ్రీ లలితాదేవి దేదీప్యమైన మూర్తిని మనస్సులో ప్రతిష్టించుకుని, 'ఓం ఐం హ్రీం శ్రీం శ్రీ మాత్రేనమః' అని వీలైనన్ని సార్లు జపించుకుంటే అమ్మ మాతృమూర్తి యై చల్లగా చూస్తుంది. ఈ రోజున తెలుపు వర్ణం వస్త్రంతో అమ్మవారిని అలంకరిస్తారు. అలాగే పులిహోర, పెసర బూరెలు నైవేద్యంగా సమర్పిస్తారు.



## మాడుగుల మండలంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు

- జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అనేపాక అంజయ్యకు సన్మానం



**మాడుగుల (ది క్రైమ్ న్యూస్) సెప్టెంబర్ 26** మాడుగుల మండల పరిధిలో శుక్రవారం 5 వా రోజు దుర్గామాత అమ్మవారికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అనేపాక అంజయ్య పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ మాడుగుల మండల ప్రజలను ఎల్లప్పుడు ఆ జగన్మాత ఆశీస్సులు ఉండాలి ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు. అనంతరం అంజయ్యకు యూత్ సభ్యులు ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మాడుగుల మండల ప్రజలు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అలోవేరా జ్యూస్ తయారీతో అదిరిపోయే లాభాలు..

# నెలనెలా లక్షల్లో ఆదాయం



ప్రస్తుత రోజుల్లో యువత ఉద్యోగం కంటే వ్యాపారమే మేలని భావిస్తుంది. అయితే వ్యాపారాన్ని ప్రారంభించాలనుకునే వారు మంచి వ్యాపారాల కోసం అన్వేషిస్తూ ఉన్నారు. బంపర్ ఆదాయం వచ్చే అవకాశం ఉన్న వ్యాపారాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. ముఖ్యంగా సీజన్‌తో సంబంధం లేకుండా ఏడాదంతా మంచి ఆదాయం ఇచ్చే వ్యాపారాల వైపు యువత ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. ఈ నేపథ్యంలో భారీ సామర్థ్యంతో వ్యాపారాన్ని నిర్వహించాలనుకునే వారు నెలనెలా లక్షల్లో ఆదాయాన్ని పొందాలని కోరుకుంటూ ఉంటారు. కాబట్టి అలోవెరా జ్యూస్ తయారీ యూనిట్ ద్వారా లక్షల్లో ఆదాయం పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు. అలోవేరా అంటే కలబంద, మన రాష్ట్రంలో ప్రతి ఇంట్లో ఈ మొక్క ఉంటుంది. అయితే ఈ మొక్క ద్వారా శరీరానికి అవసరమయ్యే విటమిన్లు, మినరల్స్ అందించవచ్చని చాలా మందికి తెలియదు. అలాగే ఈ మొక్కకు యాంటీబయాటిక్, యాంటీ ఫంగల్ వంటి లక్షణాలు ఉన్నాయి. కలబందకు పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా అలోవెరా జ్యూస్ తయారీ వ్యాపారం చాలా లాభదాయకంగా ఉంటుంది. కాబట్టి అలోవేరా జ్యూస్ వ్యాపారాన్ని పెట్టాలంటే ఎంత పెట్టుబడి కావాలి? వంటి విషయాలను ఓ సారి తెలుసుకుందాం. అలోవేరా జ్యూస్ వ్యాపారానికి ఎక్కువ పెట్టుబడి పెట్టాల్సిన అవసరం లేదు. ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ (కేవీఐసీ) అలోవెరా జ్యూస్ బిజినెస్ ప్రాజెక్ట్ కాస్ట్ రూ.26.56 లక్షలుగా ఉంది. అయితే పెట్టుబడిదారుడు కేవలం రూ.2.66 లక్షలు మాత్రమే పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. మిగిలిన మొత్తాన్ని ఫైనాన్స్ చేయవచ్చు. మీకు రూ. 18.90 లక్షల టర్మ్ లోన్ లభిస్తుంది. వర్కింగ్ క్యాపిటల్ కోసం రూ. 5 లక్షలు ఫైనాన్స్ చేస్తారు. ఈ వ్యాపారాన్ని ప్రారంభించడానికి జీఎస్టీ రిజిస్ట్రేషన్, ఉద్యోగ్ ఆధార్ నమోదు, ఉత్పత్తి బ్రాండ్ పేరు అవసరం అవుతుంది. అలోవేరా జ్యూస్ తయారీ వ్యాపారం నుంచి సంవత్సరానికి రూ. 13 లక్షల కంటే ఎక్కువ సంపాదించవచ్చు. మొదటి సంవత్సరంలో దాదాపు రూ.3.03 లక్షల లాభం ఉంటుంది. రెండో ఏడాది రూ.4.15 లక్షలు, మూడో ఏడాది రూ.7.76 లక్షలు లాభం ఉంటుంది. దీని తరువాత, ఈ లాభం వేగంగా పెరుగుతుంది. ముఖ్యంగా ఐదో సంవత్సరంలో దాదాపు రూ.13.88 లక్షల లాభం ఉంటుంది.

## ఎల్ఐసీ నుంచి కొత్త ప్లాన్.. భారీ ఆదాయం.. ప్రీమియం, నియమాలు ఏంటి?




దేశంలోనే అతిపెద్ద బీమా కంపెనీ సరికొత్త ప్లాన్‌తో ముందుకొచ్చింది. ఈ పథకం ద్వారా పెట్టుబడిదారులు స్టాక్ మార్కెట్ నుండి భారీ లాభాలను పొందుతారు. ఈ కొత్త ప్లాన్ పేరు లైఫ్ ఇన్సరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) ఇండెక్స్ ప్లస్. ఈ పథకం పెట్టుబడిదారులు క్రమ పద్ధతిలో ప్రీమియం చెల్లించాల్సిన వ్యక్తుల కోసం ఉద్దేశించబడింది. ఎల్ఐసీ ఈ ప్లాన్ ప్రత్యేకత ఏమిటంటే ఇది మొత్తం పాలసీ కాలవ్యవధికి పొదుపుతో జీవిత బీమా కవరేజీని అందిస్తుంది. ఎల్ఐసీ ఈ ప్రత్యేక ప్లాన్ గురించి తెలుసుకోండి. లాక్ ఇన్ పీరియడ్ ఎంతకాలం ఉంటుంది? ఈ కొత్త పథకం లాక్ ఇన్ పీరియడ్ 5 సంవత్సరాలు. అప్పుడు పాలసీదారు కొన్ని నిబంధనలు, షరతులకు లోబడి యూనిట్లను పాక్షికంగా ఉపసంహరించుకునే అవకాశం ఉంటుంది. ఎల్ఐసి సమాచారం ఇస్తూ వార్షిక ప్రీమియం శాతంగా లెక్కించబడిన హామీ అదనపు మొత్తాన్ని మిగిలిన పాలసీ సంవత్సరాల తర్వాత యూనిట్ ఫండ్‌కు జోడిస్తుంది. నియమం ఏమిటి? బీమా ప్లాన్ కోసం పాలసీదారుడి వయస్సు కనీసం 90 రోజులు ఉండాలి. అయితే పాలసీదారుని మొత్తాన్ని బట్టి వయస్సు 50 లేదా 60 సంవత్సరాల వరకు ఉండవచ్చు. 90 రోజులు, 50 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న పాలసీదారుల కోసం, ప్రాథమిక బీమా మొత్తం వార్షిక ప్రీమియం కంటే 7 నుండి 10 రెట్లు వరకు నిర్ణయించబడుతుంది. బీమా పాలసీ ప్రీమియం పాలసీదారుడి వయస్సు ఆధారంగా నిర్ణయించబడుతుంది. ప్రీమియం ఎంత ఉంటుంది? వార్షిక ప్రీమియం ఆధారంగా బీమా పథకం గరిష్టంగా 25 సంవత్సరాలు, కనిష్టంగా 10 నుండి 15 సంవత్సరాలు ఉంటుంది. పాలసీ వ్యవధి ప్రీమియం చెల్లింపు వ్యవధితో సరిపోలడం చాలా ముఖ్యం. మీరు వార్షిక చెల్లింపు చేస్తే, మీరు 30 వేల రూపాయలు చెల్లించాలి. 6 నెలలకు ఒకసారి చెల్లించే వారు రూ.15,000 చెల్లించాలి. పాలసీదారు త్రైమాసిక స్థిర ప్రీమియం రూ. 7,500, నెలవారీ ప్రీమియం రూ. 2,500 ఉంది. మీరు ఈ 2 ఫండ్లలో పెట్టుబడి పెట్టవచ్చు ఈ స్కీమ్‌లో పాలసీదారులు ప్రీమియంను పెట్టుబడి పెట్టగల రెండు ఫండ్‌ల మధ్య ఎంపికను కలిగి ఉంటారు. అందించే రెండు ఎంపికలు ఫ్లెక్సీ గ్రోత్ ఫండ్, ఫ్లెక్సీ స్మార్ట్ గ్రోత్ ఫండ్. ఈ ఫండ్‌లు ప్రధానంగా ఎన్ఎస్ఇ నిఫ్టీ 100 ఇండెక్స్ లేదా ఎన్ఎస్ఇ నిఫ్టీ 50 ఇండెక్స్‌లో భాగమైన ఎంచుకున్న స్టాక్‌లలో పెట్టుబడి పెడతాయి. పాలసీ హోల్డర్లు మొదట్లో ఒక ఫండ్‌ని ఎంచుకుని, ఆ తర్వాత వారి అవసరానికి అనుగుణంగా మారవచ్చు.

## సిబిల్ స్కోర్ తక్కువ ఉన్నా కారు రుణం ఇస్తారా? అసలైన నిబంధనలు తెలిస్తే షాక్



ఇటీవల కాలంలో పెరిగిన ఖర్చుల నేపథ్యంలో రుణం తీసుకోవడం పరిపాటిగా మారింది. ముఖ్యంగా వ్యక్తిగత, గృహ లేదా కారు రుణాలు తీసుకునే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. వివిధ రకాల రుణాల కోసం దరఖాస్తు చేసేటప్పుడు అధిక సిబిల్ స్కోర్‌ను నిర్వహించడం చాలా కీలకం. అధిక క్రెడిట్ స్కోర్ విశ్వసనీయత, బాధ్యతాయుతమైన క్రెడిట్ ప్రవర్తనను సూచిస్తుంది. ఇది అగ్ర బ్యాంకులు, నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కార్పొరేషన్‌లు అందించే వాహన రుణాలను తక్కువ వడ్డీ రేట్లతో పొందే అవకాశాన్ని ఇస్తుంది. కారు లోన్ లేదా మరేదైనా ఇతర రకమైన రుణం కోసం అర్హత పొందాలంటే వ్యక్తులు తప్పనిసరిగా అధిక క్రెడిట్ స్కోర్‌ని కలిగి ఉండాలి. సిబిల్ స్కోర్ అనేది 300 నుంచి 900 వరకు స్కోర్ ఇచ్చే మీ క్రెడిట్ నివేదిక. మీ స్కోర్ 900కి దగ్గరగా ఉన్న కొద్దీ మీ క్రెడిట్ రేటింగ్ బాగుందని అర్థం అందువల్ల రుణం కోసం దరఖాస్తు చేసినప్పుడు, మీ క్రెడిట్ చరిత్రను సమీక్షించి క్రెడిట్ నివేదికను రూపొందించడం ద్వారా మీ బ్యాంక్ మీ క్రెడిట్ యోగ్యతను అంచనా వేస్తుంది. ఈ నేపథ్యంలో కారు లోన్ పొందాలంటే క్రెడిట్ స్కోర్ ఎంత శాతం ఉండాలో? ఓ సారి తెలుసుకుందాం. క్రెడిట్ స్కోర్ అంటే రుణగ్రహీతకు సంబంధించిన క్రెడిట్ చరిత్రతో పాటు రుణ చెల్లింపు చరిత్ర రికార్డుగా ఉంటుంది. క్రెడిట్ రిపోర్ట్ అనేది బ్యాంకులు, క్రెడిట్ కార్డ్ కంపెనీలు, కలెక్షన్ ఏజెన్సీలు, ప్రభుత్వ సంస్థలతో సహా వివిధ వనరుల నుంచి పొందిన రుణగ్రహీతకు సంబంధించిన క్రెడిట్ చరిత్రకు ఆధారంగా ఉంటుంది. అదనంగా రుణగ్రహీత క్రెడిట్ స్కోర్ వారి క్రెడిట్ యోగ్యతను నిర్ణయించడానికి క్రెడిట్ డేటాను అంచనా వేసే గణిత అల్గారిథమ్ ద్వారా రూపొందించబడుతుంది. క్రెడిట్ స్కోర్ అభివృద్ధి చెందడానికి సమయం పడుతుంది. ఆమోదయోగ్యమైన క్రెడిట్ స్కోర్‌ను సాధించడానికి తరచుగా 18 నుండి 36 నెలలు లేదా అంతకంటే ఎక్కువ క్రెడిట్ వినియోగం పడుతుంది. కారు లోన్ విషయానికి వస్తే కారు రుణానికి అవసరమైన కనీస సిబిల్ స్కోర్ రుణదాత యొక్క ప్రమాణాలపై ఆధారపడి ఉంటుంది. అలాగే ఆదాయం, ప్రస్తుత రుణం, ఉద్యోగ స్థిరత్వం. డౌన్ పేమెంట్ మొత్తం వంటి ఇతర పరిగణనలపై ఆధారపడి ఉంటుంది. చాలా మంది రుణదాతలు కారు రుణం కోసం అర్హత పొందేందుకు కనీసం 700 సిబిల్ స్కోర్‌తో రుణగ్రహీతలను ఇష్టపడతారు. అధిక క్రెడిట్ స్కోర్ మీ కారు లోన్‌పై తగ్గిన వడ్డీ రేటును పొందేందుకు మిమ్మల్ని అనుమతిస్తుంది. రుణం జీవితకాలంలో మీ డబ్బును ఆదా చేస్తుంది. మీ క్రెడిట్ యోగ్యతను అంచనా వేయడానికి, వారు మీ ఆదాయం, ఉపాధి స్థిరత్వం, రుణం-ఆదాయ నిష్పత్తి, ఇతర ప్రమాణాలను పరిశీలిస్తే క్రెడిట్ స్కోర్‌ను ప్రామాణికంగా తీసుకోరు. మీ క్రెడిట్ స్కోరు 700 కంటే తక్కువగా ఉంటే మీరు ఇప్పటికీ కారు లోన్‌ను పొందగలుగుతారు. కానీ మీరు అధిక వడ్డీ రేట్లు చెల్లించాల్సి రావచ్చు లేదా కఠినమైన రుణ పరిమితులను అంగీకరించాలి. అలాంటి పరిస్థితుల్లో మీరు కారు లోన్ కోసం దరఖాస్తు చేసే ముందు ఆన్-టైమ్ చెల్లింపులు చేయడం, ఇప్పటికే ఉన్న రుణాన్ని తగ్గించడంతో పాటు మంచి క్రెడిట్ వినియోగ నిష్పత్తిని ఉంచడం ద్వారా మీ క్రెడిట్ స్కోర్‌ను మెరుగుపరచవచ్చు.

## మీరు కొనుగోలు చేసిన మెడిసిన్ నకిలీవా? అది నిజమైనవా? ఇలా తెలుసుకోండి



ఇటీవలి కాలంలో మెడికల్ దుకాణాల నుంచి మందులు కొనుగోలు చేసే వారి సంఖ్య పెరిగింది. జలుబు, దగ్గు వస్తే వైద్యులను సంప్రదించకుండా నేరుగా మెడికల్ స్టోర్ నుంచి మందులు వాడుతున్నారు. అయితే కొన్ని సందర్భాల్లో మీరు కొనుగోలు చేసే ఔషధం నకిలీదేనని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. నకిలీ మందులను ఎలా గుర్తించాలో తెలుసుకోవడం ముఖ్యం. ఘజియాబాద్ జిల్లా ఆసుపత్రిలోని ఫార్మా విభాగానికి చెందిన డాక్టర్ జతీందర్ కుమార్ కొన్ని సూచనలు చేశారు. కోడ్‌ని తనిఖీ చేయండి: మీరు ఔషధాన్ని కొనుగోలు చేసినప్పుడు దాని కోడ్‌ని తనిఖీ చేయండి. రూ.100 కంటే ఎక్కువ ఖరీదు చేసే మందులకు కచ్చితంగా క్యూఆర్ కోడ్ ఉంటుంది. కోడ్ లేకుండా ఔషధం కొనుగోలు చేయవద్దు. కోడ్ లేని మందులు నకిలీవి కావచ్చు. ఔషధం పేరు: మీరు ఔషధాన్ని కొనుగోలు చేసినప్పుడు దాని పేరును ఇంటర్నెట్‌లో శోధించండి. మీరు ఇప్పుడు కొనుగోలు చేసిన ఔషధం ప్యాకేజింగ్, స్పెల్లింగ్‌లో ఏదైనా తప్పు ఉందా? దాన్ని తనిఖీ చేయండి. మీరు కొనుగోలు చేసే ఔషధం సీల్డ్ ప్యాక్‌లో వస్తుందా లేదా అని కూడా తనిఖీ చేయండి. సీల్ లేని మందులు కూడా నకిలీ కావచ్చు. ఔషధ నాణ్యత: మంచి మందులు, బ్రాండెడ్ మందులు ఎల్లప్పుడూ ఫ్యాక్టరీలో తయారు చేయబడినవిగా కనిపిస్తాయి. అలాగే వాటిపై సరైన బ్రాండ్ పేరు ఉంటుంది. అయితే మీ మాత్రలు పగుళ్లుగా ఉన్నాయా లేదా బబుల్ కోటింగ్ కలిగి ఉన్నాయో చూడండి.

## డీఏ పెంపుతో బోలెడన్ని లాభాలు.. ఉద్యోగులకు ఆ విషయాలపై అవగాహన మస్ట్..!

డియర్‌నెస్ రిలీఫ్ (డీఆర్), డియర్‌నెస్ అలవెన్స్ (డీఏ)ని 4 శాతం పెంచాలని ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్‌లకు మొత్తం డీఏ వారి మూల వేతనంలో 50 శాతానికి సమానంగా ఉంటుంది. డియర్‌నెస్ రిలీఫ్, డియర్‌నెస్ అలవెన్స్‌కు సంబంధించిన మొత్తం వార్షిక ప్రభావం రూ. 12,868.72 కోట్లుగా ఉంది. డీఏ పెంపు వల్ల 67.95 లక్షలు, రూ.49.18 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు లబ్ధి పొందనున్నారు. ఈ నిర్ణయం వల్ల రవాణా, డిప్యూటేషన్, క్యాంటీన్ అలవెన్సులు 25% పెరుగుతాయని నిపుణుల అంచనా. అయితే డీఏ పెంపు పరిధిలోకి వచ్చే వారికి ఓ ఆరు విషయాలపై అవగాహన అవసరమని నిపుణులు వివరిస్తున్నారు. ఈ నేపథ్యంలో నిపుణులు వివరించే సూచనలను ఓ సారి తెలుసుకుందాం.కంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డియర్‌నెస్ అలవెన్స్ రేట్లు జనవరి 1, 2024 నాటికి వారి మూల వేతనంలో 46 శాతం నుంచి 50 శాతానికి పెరుగుతాయి. సవరించిన పే స్ట్రక్చర్‌లోని బేసిక్ పే అనేది 7వ సీపీసీకు సంబంధించిన ప్రభుత్వం ఆమోదించిన సిఫార్సులకు అనుగుణంగా పే మ్యాట్రిక్స్‌లో పేర్కొన్న స్థాయిలో డ్రా చేసిన వేతనాన్ని సూచిస్తుంది. ఇది ప్రత్యేక చెల్లింపు వంటి అన్ని ఇతర రకాల చెల్లింపులను మినహాయిస్తుంది. డియర్‌నెస్ అలవెన్స్ జీతంలో ప్రత్యేక భాగంగా ఉంటుంది. అలాగే ఎఫ్ఆర్ 9(21) ప్రకారం చెల్లింపుగా పరిగణించరు. 50 పైసలు లేదా అంతకంటే ఎక్కువ మొత్తాలకు డియర్‌నెస్ అలవెన్స్ చెల్లింపు తదుపరి మొత్తం రూపాయికి పూర్తి చేస్తారు. అయితే 50 పైసల కంటే తక్కువ మొత్తాలు విస్మరిస్తారనే విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలి. డియర్‌నెస్ అలవెన్స్ బకాయిలు మార్చి 2024 జీతం పంపిణీ తేదీ కంటే ముందు చెల్లింరు. ఈ ఆదేశాలు రక్షణ సేవల అంచనాల నుంచి వేతనం పొందే సైనికేతర సిబ్బందికి కూడా వర్తిస్తాయి. ఏదైనా అనుబంధిత ఖర్చులు తప్పనిసరిగా డిఫెన్స్ సర్వీసెస్ ఎస్టిమేట్స్‌కు సంబంధించిన హెడ్‌కు కేటాయిస్తారు. రైల్వే మంత్రిత్వ శాఖ, రక్షణ మంత్రిత్వ శాఖ వరుసగా రైల్వే, సాయుధ దళాల ఉద్యోగుల కోసం వేర్వేరు ఆదేశాలను ప్రచురిస్తాయి. డీఏ, డీఆర్ వినియోగదారుల ధరల సూచికను ఉపయోగించి సంవత్సరానికి రెండుసార్లు సవరిస్తారు. ప్రారంభ నవీకరణ, జనవరి 1 నుంచి అమలులోకి వస్తుంది. సాధారణంగా హెూలీ పండుగకు కొంతకాలం ముందు వెల్లడి చేస్తారు. ఇదిలా ఉండగా జూలై 1 నుంచి అమలులోకి వచ్చే రెండవ అప్‌డేట్ సాధారణంగా దుర్గా పూజ వేడుకకు ముందే నిర్ణయిస్తారు. డీఏ అనేది ఆల్-ఇండియా కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్‌ను ఉపయోగించి నిర్ణయిస్తారు. ఇది కాలక్రమేణా సాధారణ వస్తువుల ఖర్చులు ఎలా హెచ్చుతగ్గులకు గురవుతాయో సూచిస్తుంది.

## రైళ్లలో ప్రయాణించేటప్పుడు మహిళలకు ఎలాంటి హక్కులు ఉంటాయో తెలుసా?




మీరు భారతీయ రైల్వేలలో ప్రయాణించినప్పుడల్లా మీ హక్కులు, రైల్వే నియమాల గురించి తెలుసుకోవడం చాలా ముఖ్యం. సాధారణ ప్రయాణీకుల కోసం రైల్వే అనేక నిబంధనలను రూపొందించింది. దీంతో ప్రజల రాకపోకలు సులభతరంగా మారాయి. అదేవిధంగా రైల్వే కూడా మహిళల కోసం అనేక నియమాలను రూపొందించింది. ఇందులో మహిళలు ఒంటరిగా ప్రయాణించి టిక్కెట్టు పొందలేకపోతే వారికి ఎలాంటి హక్కులు లభిస్తాయి? వారి కోసం ఎన్నో నిబంధనలు రూపొందించారు. ఇలాంటి హక్కులు సామాన్యులకు అస్సలు తెలియవు. అందువల్ల ఈ నియమాల గురించి తెలుసుకోవడం చాలా ముఖ్యం. రైల్వేలో మహిళా కోటాలో 45 ఏళ్లు పైబడిన మహిళలకు ప్రాధాన్యత ఉంటుంది. దీనితో పాటు 3 సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలు కూడా ఈ మహిళలతో ప్రయాణించవచ్చు. ఆమె మహిళల కోటాలో మాత్రమే ఉంటారు. ఇంతకుముందు స్లీపర్ క్లాస్‌లో మాత్రమే అందుబాటులో ఉండే ఈ సదుపాయం ఇప్పుడు ఏసీలో కూడా అందుబాటులోకి వచ్చింది. రైలులో ప్రయాణించేటప్పుడు మహిళలు ఈ హక్కులు ట్రైన్‌లో రిజర్వేషన్లు లేకుంటే లేదా టిక్కెట్ లేకుండా ప్రయాణిస్తే టీటీఈ మహిళలను రైలు నుంచి దించలేరు. భారతీయ రైల్వే చట్టం ప్రకారం, మహిళ తన రైలు ప్రయాణాన్ని కొన్ని షరతులతో కొనసాగించడానికి అనుమతించబడింది. ఇది కాకుండా, రైలులో ఒక మహిళ ఒంటరిగా ప్రయాణిస్తుంటే, ఆమె టీటీఈతో మాట్లాడి తన సీటును మార్చవచ్చు. రైళ్లలో ఒంటరిగా ప్రయాణించే మహిళలకు హక్కులు ఉన్నాయి. అయితే ఒక మహిళా ప్రయాణికురాలు రైలులో ప్రయాణిస్తుంటే టిక్కెట్టు లేకుంటే, అటువంటి పరిస్థితిలో ఆమెను రైలు బోగీ నుండి బయటకు దించలేరు. %ుజు% తదుపరి స్టేషన్‌లో టికెట్ పొందమని మహిళకు విజ్ఞప్తి చేయవచ్చు. స్త్రీ వద్ద డబ్బు లేకపోతే ఆమెపై ఎలాంటి ఒత్తిడి చేయడానికి వీలు లేదు. ఈ చట్టం 1989లో రూపొందించబడింది. రాష్ట్రపతి నుంచి పోలీస్ మెడల్, ఇండియన్ పోలీస్ అవార్డు పొందిన మహిళలకు ఛార్జీలలో 50 శాతం రాయితీ ఇస్తారు. ఇది కాకుండా యుద్ధంలో వీరమరణం పొందిన సైనికుల భార్యలకు కూడా ఛార్జీలలో రాయితీ లభిస్తుంది. 182 హెల్ప్‌లైన్‌ను ప్రభుత్వం ప్రారంభించింది. ఇందులో మహిళలు భద్రతకు సంబంధించిన ఫిర్యాదులు చేయవచ్చు.

## ఖర్చుల అదుపు ఆ వయస్సులో చాలా కీలకం.. డబ్బు నిర్వహణలో కీలక సూచనలు



ప్రస్తుత ప్రపంచంలో డబ్బు అనేది అత్యంత ముఖ్యమైన వనరుల్లో ఒకటిగా ఉంది. అయితే యుక్తవయస్కులకు ఆర్థిక అక్షరాస్యత చాలా అరుదుగా బోధిస్తారు. అందువల్ల చాలా మంది వ్యక్తులు డబ్బు నిర్వహణ గురించి చాలా తక్కువ ఆలోచనతో పెరుగుతారు. పెట్టుబడులు, పొదుపులు, బడ్జెట్ వంటి అంశాలను ఎదుర్కొన్నప్పుడు నిమగ్నమైపోతారు. యుక్తవయసులో మనం నేర్చుకునే విషయాలు జీవితాంతం మనతోనే ఉంటాయి. అందువల్ల యుక్తవయస్కులకు మంచి డబ్బు అలవాట్లను నేర్పించాలని నిపుణులు వివరిస్తున్నారు. పిల్లల మాదిరిగా కాకుండా యువకులు ప్రాథమిక డబ్బు విషయాలను గ్రహించడానికి, డబ్బుకు ప్రాముఖ్యతను అర్థం చేసుకునే మానసిక స్థితితో ఉంటాయి. ఈ నేపథ్యంలో ఆర్థిక భద్రతకు టీనేజర్స్ నిపుణులు ఇచ్చే సూచనలు సలహాలను ఓ సారి తెలుసుకుందాం. పాకెట్ మనీ నెలవారీ లేదా వారానికోసారి పాకెట్ మనీ ఇవ్వడం వల్ల యువకులు తమ డబ్బును నిర్వహించేలా ప్రేరేపిస్తారు. మీ పిల్లలు ఎప్పుడు కావాలంటే అప్పుడు డబ్బు పొందడానికి అనుమతించే బదులు, ఒక సెట్ అలవెన్స్ ఇవ్వడం వల్ల వారి డబ్బును ట్రాక్ చేయడం టీనేజర్లకు నేర్పుతుంది. వారు పొందాలనుకునే దాని కోసం డబ్బును ఆదా చేయడంతో న్యాయపరంగా ఖర్చు చేయడం వంటి నిర్ణయాలు తీసుకునేలా ఇది వారిని ప్రేరేపిస్తుంది. ఆర్థిక విద్య టీనేజర్లకు పొదుపు ఖాతా అంటే ఏంటి? ఫిక్స్‌డ్ డిపాజిట్ అంటే ఏంటి? మ్యూచువల్ ఫండ్స్, డెట్ ఎలా పనిచేస్తుంది? లాంటి ప్రాథమిక అంశాలను నేర్పాలి. వీలైతే మీరు వారి కోసం బ్యాంక్ ఖాతాను కూడా తెరవవచ్చు. తద్వారా వారు బ్యాంకింగ్ వ్యవస్థ గురించి తెలుసుకుంటారు. ఈ విధంగా వారు 'లాభ-నష్టాల' లెక్కలతో పాటు ఆర్థిక నిర్వహణను నేర్చుకుంటారు. పొదుపు ప్రోత్సాహం టీనేజ్‌లో అవసరాలకు అనుగుణంగా ఖర్చు చేయడం అలవాటు చేసుకోవాలి. ముఖ్యంగా వచ్చిన సంపాదనలో కచ్చితంగా పొదుపు చేసేలా వారిని ప్రోత్సహించాలి. టీనేజర్లకు చిన్న పొదుపు లక్ష్యాలను కూడా సెట్ చేయడం ద్వారా లక్ష్యాలను సాధించడానికి వారిని ప్రోత్సహించడానికి రివార్డ్ సిస్టమ్‌ను పరిచయం చేయవచ్చు. ఖర్చులను ట్రాక్ చేయడం ఒకరి ఖర్చులను ట్రాక్ చేయడం వ్యక్తికి వారి ఖర్చు అలవాట్లలో ఒక నమూనాను చూడటానికి సహాయపడుతుంది. వారు ఎలా ఖర్చు చేస్తున్నారో? తెలుసుకోవడం ద్వారా టీనేజ్ వారి ఆర్థిక నిర్ణయాధికారాన్ని బాగా అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా డబ్బు-ట్రాకింగ్ యాప్‌లను ట్రాక్ చేయవచ్చు. గృహ బడ్జెటింగ్ ఇంటి ఖర్చుల్లో టీనేజర్లను పాల్గొనేలా చేయడం వారికి ఖర్చులపై అవగాహన కల్పించవచ్చు. విద్యుత్, నీరు, బీమా,ఇతర యుటిలిటీ బిల్లుల గురించి తెలియజేయడం వల్ల ఖర్చులపై అవగాహన వస్తుంది. ముఖ్యంగా గృహ అవసరాలకు అనువైన వస్తువుల కొనుగోలు చేసే సమయంలో వారిని మన వెంట తీసుకెళ్లడం ద్వారా ఆర్థిక నిర్వహణపై ఆలోచన ఉంటుంది.

## వన్ ప్లస్ నార్డ్ సీఈ4 ఆవిష్కరణకు ముహూర్తం ఖరారు.. ఎప్పుడంటే..?



చైనా టెక్నాలజీ సంస్థ వన్ ప్లస్ తన వన్ ప్లస్ నార్డ్ సీఈ4 ఫోన్‌ను ఏప్రిల్ ఒకటో తేదీన భారత్ మార్కెట్లో ఆవిష్కరించనున్నది. క్వాల్‌కామ్ స్నాప్ డ్రాగన్ 7 జెన్ 3 ప్రాసెసర్ తో పని చేస్తుంది. వన్ ప్లస్ నార్డ్ సీఈ4 ఫోన్ ధర రూ.25 వేలు ఉండొచ్చునని భావిస్తున్నారు. వన్ ప్లస్ నార్డ్ సీఈ4 ఫోన్ 120 హెర్ట్జ్ రీఫ్రెష్ రేటుతో (1440ఐ3168 పిక్సెల్స్ రిజొల్యూషన్) 6.7 అంగుళాల అమోలెడ్ డిస్ ప్లే కలిగి ఉంటుందని భావిస్తున్నారు. రేర్ డ్యుయల్ కెమెరా సెటప్ ఉండవచ్చునని తెలుస్తున్నది. 50-మెగా పిక్సెల్ ప్రైమరీ కెమెరా, 8-మెగా పిక్సెల్ అల్ట్రావైడ్ కెమెరా, సెల్ఫీలూ వీడియో కాల్స్ కోసం 16 మెగా పిక్సెల్ సెన్సర్ కెమెరా ఉంటుంది. బ్లాక్, గ్రీన్ కలర్ ఆప్షన్లలో ఫోన్ లభిస్తుంది. ఆండ్రాయిడ్ 13 బేస్డ్ ఆక్సిజన్ ఓఎస్ ఔటాఫ్ బాక్స్ వర్షన్ పై పని చేస్తుందీ వన్ ప్లస్ నార్డ్ సీఈ4 ఫోన్. 8జీబీ ర్యామ్ తో వస్తున్న ఈ ఫోన్ లో అదనంగా మరో 8 జీబీ ర్యామ్ వర్చువల్‌గా పెంచుకోవచ్చు. ఇన్ బిల్ట్ స్టోరేజీ 256 జీబీగా ఉంటుంది.. మైక్రో ఎస్డీ కార్డు సాయంతో ఒక టిగా బైట్ వరకూ పెంచుకోవచ్చు. 80వాట్ల ఫాస్ట్ చార్జింగ్ మద్దతుతో 5000 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీతో వస్తుంది. 5జీ, 4జీ, 3జీ, 2జీ, వై-ఫై, బ్లూటూత్ 5.2, జీపీఎస్, ఎఫ్ఎం రేడియో, యూఎస్బీ టైప్ సీ పోర్ట్ కనెక్టివిటీ కలిగి ఉంటుంది.

# ఎండు కొబ్బరి ముక్క తింటే ఎన్ని లాభాలో తెలుసా..?



## నరాల సమస్యతో బాధపడే వారికి వరంలాంటిది..!

మన దేశంలో ఎండు కొబ్బరిని అందరి ఇళ్లలో వాడుతుంటారు. పూజ నుండి వంట వరకు అన్నింటిలో కొబ్బరిని ఉపయోగిస్తుంటారు. ఎండు కొబ్బరిని అనేక వంటకాల తయారీలో కూడా వాడుతుంటారు. ఇది తినడానికి చాలా రుచిగా కూడా ఉంటాయి. ఎండు కొబ్బరిని ఉపయోగించడం వల్ల ఆహారం రుచి పెరగడమే కాకుండా, దాని వినియోగం ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరం అంటున్నారు నిపుణులు. ఎండుకొబ్బరిలో ప్రొటీన్లు, విటమిన్లు, ఐరన్, కాల్షియం, మాంగనీస్, సెలీనియం, కాపర్, ఫాస్పరస్, పొటాషియం, మెగ్నీషియం వంటి మూలకాలు ఉంటాయి. అంతే కాకుండా ఎండు కొబ్బరిలో యాంటీ ఆక్సిడెంట్ గుణాలు కూడా ఉన్నాయి. అయితే ఎండు కొబ్బరి తినడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నప్పటికీ, కొన్ని నష్టాలు కూడా ఉన్నాయి. కాబట్టి ఎండు కొబ్బరి వల్ల కలిగే లాభనష్టాలేంటో ఇక్కడ తెలుసుకుందాం..



రుచి కోసం ఎండు కొబ్బరి తినడం వల్ల మనకు అనేక ప్రయోజనాలు లభిస్తుండగా, ఏదైనా తీపి లేదా కూరగాయలలో ఎండు కొబ్బరిని కలుపుకుంటే, దాని రుచి మరింత పెరుగుతుంది. ఎండు కొబ్బరిని తీసుకోవడం వల్ల రోగనిరోధక వ్యవస్థ బలపడుతుంది. అనేక ఇతర వ్యాధులు కూడా నయమవుతాయి. ఇందులో ఉండే గుణాలు దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం కలిగించడమే కాకుండా శరీరంలోని కొలెస్ట్రాల్ ను కూడా సులభంగా తగ్గిస్తాయి. కాబట్టి తరచుగా అనారోగ్య సమస్యలతో బాధపడేవారు తప్పకుండా ఎండుకొబ్బరిని ఆహారంలో తీసుకోవాలి. ఎండు కొబ్బరి తినడం వల్ల మన మెదడుకు పదును పెట్టడంతోపాటు జ్ఞాపకశక్తి పెరుగుతుంది. అదే సమయంలో మన హృదయాన్ని బలపరుస్తుంది. కొబ్బరిని పొడి లేదా తడి రూపంలో తినడం వల్ల మన జుట్టుకు చాలా మేలు జరుగుతుంది. ఎండు కొబ్బరిని తినడం వల్ల మన జుట్టు రాలడం ఆగిపోతుంది. క్రమంగా కొత్త జుట్టు పెరిగేలా చేస్తుంది. పైగా మీ కేశాలు నల్లటి రంగులో నిగనిగలాడుతుంది. అంతేకాదు.. ఎముకలకు కూడా మేలు చేస్తుంది. ఎండు కొబ్బరి తినడం వల్ల మన ఎముకలకు బలం చేకూరడంతో పాటు వాటిలోని పగుళ్ల శబ్దం కూడా ఆగుతుంది. ఎండు కొబ్బరి తినడం తలనొప్పితో బాధపడేవారికి చాలా మేలు చేస్తుంది. ఎండు కొబ్బరి తింటే మన శరీరానికి బలం చేకూరుతుంది. ఎండు కొబ్బరిని తీసుకోవడం వల్ల రక్తహీనత సమస్య నుండి ఉపశమనం లభిస్తుంది. ఎందుకంటే ఎండు కొబ్బరిలో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. అందువల్ల, మీరు ఎండు కొబ్బరిని తీసుకుంటే, అది శరీరంలో హిమోగ్లోబిన్ స్థాయిని పెంచుతుంది. దీని వల్ల రక్తం లేకపోవడం పోతుంది. ఎండు కొబ్బరిని తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఎందుకంటే ఎండు కొబ్బరిలో యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉంటాయి. అందువల్ల, మీరు ఎండు కొబ్బరిని తీసుకుంటే, అది మీ రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. దీని వల్ల మీరు ఎలాంటి వైరల్ ఇన్ఫెక్షన్‌ను చాలా వరకు నివారించవచ్చు. ఎండిన కొబ్బరిని తీసుకోవడం గుండెకు చాలా ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. ఎండు కొబ్బరిని రోజూ తీసుకుంటే గుండె ఆరోగ్యంగా ఉంటుంది. అలాగే, ఎండు కొబ్బరి శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలను మెరుగ్గా ఉంచడంలో సహాయపడుతుంది. ఎందుకంటే ఇందులో ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. ఎండు కొబ్బరిని ఎక్కువ పరిమాణంలో తీసుకోవడం వల్ల బరువు పెరుగుతారు. కాబట్టి బరువు తగ్గాలనుకునే వారు కొబ్బరిని ఎక్కువ మోతాదులో తినకూడదు. ఎండు కొబ్బరిని తీసుకోవడం వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఎందుకంటే ఎండు కొబ్బరిలో చాలా పోషకాలు ఉంటాయి. అందువల్ల, మీరు దీనిని తీసుకుంటే, ఇది రొమ్ము క్యాన్సర్ మరియు ప్రోస్టేట్ క్యాన్సర్ కణాలు ఏర్పడకుండా నిరోధించవచ్చు. ఎండు కొబ్బరిని ఎక్కువ పరిమాణంలో తీసుకోవడం వల్ల కడుపు సంబంధిత సమస్యలు వస్తాయి. మీరు దానిని ఎక్కువగా తీసుకుంటే, వాంతులు, కడుపు నొప్పికి కారణం కావచ్చు. ఎండిన కొబ్బరిని అధికంగా తీసుకోవడం మధుమేహ రోగులకు మంచికాదంటున్నారు. ఎందుకంటే కొబ్బరిలో చాలా చక్కెర ఉంటుంది. కాబట్టి దీన్ని తీసుకోవడం వల్ల షుగర్ లెవల్స్ పెరుగుతాయి.

# ఫ్రిజ్‌లో ఉంచిన ఆహారాన్ని ఎన్ని గంటల తర్వాత తినకూడదు?



బిజీగా ఉన్న నగర జీవితంలో ఆకలితో ఉన్నప్పుడు తాజా ఆహారాన్ని తయారు చేయడం సాధ్యం కాదు. అయితే ఆహారం త్వరగా చెడిపోకుండా ఉండేందుకు, ఎక్కువ సేపు పాడైపోకుండా ఉండేందుకు ఆహారాన్ని తయారు చేసి ఫ్రిజ్‌లో పెట్టే వారు చాలా మందే ఉన్నారు. సమయాన్ని ఆదా చేయడానికి రిఫ్రిజిరేటర్‌లో నిల్వ చేస్తారు. రిఫ్రిజిరేటర్‌లో మిగిలిపోయిన వాటిని నిల్వ చేయడం ఉద్దేశ్యం ఆహారం వృధా కాకుండా నిరోధించడం లేదా సమయాన్ని ఆదా చేయడం. ఫ్రిజ్‌లో ఉంచిన ఆహారం పాడైపోకుండా కాపాడుతుంది. గడ్డకట్టడం ఉద్దేశ్యం ఏమిటంటే, కూరగాయలు, పండ్లు పాడవకుండా నిరోధించడం ద్వారా ఎక్కువ కాలం తాజాగా ఉంచడం. కానీ అన్ని ఆహారాలు ఎక్కువ కాలం ఉండవు. అందుకే రిఫ్రిజిరేటర్‌లో ఉంచిన ఆహారం, పండ్లు, కూరగాయలు ఎంత సమయం తర్వాత తినకూడదో తెలుసుకుందాం. రిఫ్రిజిరేటర్‌లో ఉంచిన వండిన అన్నం 1 రోజులోపు తినాలి. మీరు వండిన ఆహారాన్ని రిఫ్రిజిరేటర్‌లో ఉంచినట్లయితే అది తక్కువ సమయంలో దాని పోషక విలువలను కోల్పోతుంది. అయితే ఆయుర్వేదం ప్రకారం, అన్ని వండిన ఆహారం కేవలం 6 గంటల పాటు పోషకాహారాన్ని అందిస్తుంది. ఆ తర్వాత దానిలోని పోషకాలు కోల్పోతాయి. మీరు గోధుమ రోటీని రిఫ్రిజిరేటర్‌లో ఉంచినట్లయితే, అది రోటీని తయారు చేసిన 12 నుండి 14 గంటలలోపు తినాలి. అలా చేయకపోతే, అందులో ఉన్న పోషకాలు పోతాయి. ఎక్కువసేపు ఫ్రిజ్‌లో ఉంచిన బ్రెడ్‌ను తిన్నట్లయితే మీకు కడుపు నొప్పిని కూడా వస్తుంది మీరు మీ భోజనంలో మిగిలిపోయిన పప్పును చెడిపోకుండా ఉండటానికి మీరు ఫ్రిజ్‌లో ఉంచినట్లయితే, దానిని 2 రోజులలోపు తినండి. రిఫ్రిజిరేటర్‌లో నిల్వ ఉంచిన పప్పును 2 రోజుల తర్వాత తింటే, కడుపులో గ్యాస్ ఉత్పత్తి ప్రారంభమవుతుంది. చాలా సార్లు మనం ఫ్రిజ్‌లో ఒక వారం పాటు పండ్లు, కూరగాయలను నిల్వ చేస్తాము. అయితే ఎక్కువ కాలం పాటు ఫ్రిజ్‌లో ఉంచిన కూరగాయలు, పండ్లు వాటి పోషక విలువలను కోల్పోతాయి. వాటిని తినడం వల్ల మీకు మంచి కంటే హాని ఎక్కువ. కూరగాయలు, పండ్లు కోయకుండా 3 నుండి 4 రోజులు ఉంచవచ్చు. అంతకంటే ఎక్కువ రోజులు ఉంచకూడదని నిపుణులు సూచిస్తున్నారు. మీరు తరిగిన పండ్లను శీతలీకరించినట్లయితే, అది 6 గంటలలోపు తినాలి. లేకుంటే అది మీ అనారోగ్యానికి కారణమవుతుంది. బియ్యం, పప్పు, రోటీ లేదా రోటీ పిండి వంటి ఏదైనా రిఫ్రిజిరేటర్‌లో ఉంచిన తర్వాత అన్ని వస్తువులను పూర్తిగా పాత్రతో కప్పి, వండిన ఆహారాన్ని 24 గంటల్లోపు తినాలి.

# ఈ గింజాలు ఆరోగ్యానికి వరం కంటే ఎక్కువ..!

## రోజూ తింటే రోగాలు మాయం..

## మెరిసే, అందమైన చర్మం మీ సొంతం..!!



జాక్‌ఫ్రూట్ లాగానే జాక్‌ఫ్రూట్ విత్తనాలను తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. జాక్‌ఫ్రూట్ గింజల్లో ఐరన్, కాల్షియం, కాపర్, పొటాషియం వంటి అంశాలు ఉంటాయి. ఇవి అనేక వ్యాధులను నయం చేయడంలో సహాయపడతాయి. జాక్‌ఫ్రూట్ గింజలలో రిబోఫ్లావిన్, థయామిన్ కూడా ఉన్నాయి. ఇవి కళ్ళు, చర్మం, జుట్టుకు మేలు చేస్తాయి. అనేక పోషకాలు పుష్కలంగా ఉన్న పనస గింజలు జీర్ణవ్యవస్థను మెరుగుపరచడంలో సహాయపడతాయి. రక్తహీనతను అధిగమించడంలో జాక్‌ఫ్రూట్ గింజలు కూడా ప్రయోజనకరంగా పరిగణించబడతాయి. కావున, జాక్‌ఫ్రూట్ విత్తనాలను ఖచ్చితంగా తినండి. రక్తహీనతను అధిగమించడానికి జాక్‌ఫ్రూట్ విత్తనాలను తీసుకోవడం ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. ఎందుకంటే జాక్‌ఫ్రూట్ గింజలు ఇనుముకు మంచి మూలం. జాక్‌ఫ్రూట్ గింజలను తీసుకోవడం వల్ల శరీరంలో ఐరన్ పరిమాణం పెరుగుతుంది. ఇది రక్తహీనతను దూరం చేస్తుంది. జాక్‌ఫ్రూట్ గింజల్లో మంచి మొత్తంలో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. జాక్‌ఫ్రూట్ గింజలను తీసుకోవడం కళ్ళకు చాలా ప్రయోజనకరం అంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఎందుకంటే జాక్‌ఫ్రూట్ గింజల్లో విటమిన్ ఎ గుణాలు పుష్కలంగా ఉన్నాయి. ఇది కంటి చూపును మెరుగుపరచడంలో సహాయపడుతుంది. అందువల్ల, కంటి చూపును మెరుగుపరచడానికి, మీరు తప్పనిసరిగా జాక్‌ఫ్రూట్ గింజలను తినాలి. రోగ నిరోధక శక్తిని పెంచడంలో జాక్‌ఫ్రూట్ విత్తనాలను తీసుకోవడం చాలా ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. ఎందుకంటే జాక్‌ఫ్రూట్ సీడ్స్‌లో యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేసే విటమిన్ సి గుణాలు ఉంటాయి. దీని కారణంగా రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో సహాయపడుతుంది. బూస్ట్ జాక్‌ఫ్రూట్ గింజల్లో కార్బోహైడ్రేట్లు మరియు విటమిన్ బి కాంప్లెక్స్ ఉంటాయి. ఇవి మీ ఆహారాన్ని శక్తిగా మార్చడంలో మరియు ఆరోగ్యకరమైన జీవక్రియను పెంచడంలో సహాయపడతాయి. జాక్‌ఫ్రూట్ గింజలను తీసుకోవడం జీర్ణవ్యవస్థకు చాలా ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. ఎందుకంటే జాక్‌ఫ్రూట్ గింజల్లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. జాక్‌ఫ్రూట్ గింజలను తీసుకోవడం ద్వారా మలబద్ధకం, కడుపు సంబంధిత సమస్యలు నయమవుతాయి.

# మధుమేహుల ఆరోగ్యంపై సబ్జా గింజల మ్యాజిక్..లాభాలు మామూలుగా లేవుగా!!

జీవనశైలి సరిగ్గా లేకపోతే, శరీరంలో అనేక వ్యాధులు రావడం ప్రారంభమవుతాయి. అలసట, అనారోగ్యం ఒక వ్యక్తిని ఒత్తిడికి గురి చేస్తుంది. చెడు ఆహారపు అలవాట్లు, అస్తవ్యస్థమైన జీవనశైలి కారణంగా అనేక రోగాలు ప్రజలను వెంటాడుతున్నాయి. ప్రస్తుతం చాలా మంది ప్రజలు మధుమేహం, మలబద్ధకం వంటి ఆరోగ్య సంబంధిత సమస్యలను ఎదుర్కొంటున్నారు. మధుమేహం రావడం సర్వసాధారణం. నీరు, ఫైబర్ లేకపోవడం వల్ల మలబద్ధకం సమస్య ఏర్పడుతుంది. ఇటువంటి సమస్యలను తగ్గించడానికి లేదా ఉపశమనం పొందడానికి ఇంటి నివారణలు చక్కటి ఫలితాలను ఇస్తాయి. ఆయుర్వేదంలో చాలా ప్రయోజనకరంగా భావించే సబ్జా గింజలతో మధుమేహం, మలబద్ధకాన్ని ఎలా నివారించవచ్చో తెలుసుకుందాం.. మధుమేహం నయం కాదు. అయితే, కొన్ని ఇంటి చిట్కాలు, ఆయుర్వేద ఔషధాలు తీసుకోవడం వల్ల బ్లడ్ షుగర్‌ను అదుపులో ఉంచుకోవచ్చు. సబ్జా విత్తనాల్లో ప్రోటీన్, ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు, కార్బోహైడ్రేట్లు పుష్కలంగా ఉన్నాయి. మీరు తరచుగా మలబద్ధకంతో బాధపడుతుంటే, ప్రతిరోజూ సబ్జా గింజలను తినండి. ఇందులో పీచు పుష్కలంగా ఉండి మలబద్ధకాన్ని దూరం చేస్తుంది. మధుమేహంతో బాధపడేవారు సబ్జా గింజలను తీసుకోవచ్చు. వీటిని మీరు తాగే నీళ్లలో నానబెట్టుకుని తాగటం ఉత్తమం. ఖాళీ కడుపుతో ఈ నీటిని తాగటం వల్ల ఫలితం ఉంటుంది. శరీరంలోని బ్లడ్ షుగర్ లెవెల్‌ను కంట్రోల్‌లో ఉంచడంలో సహాయపడుతుంది. తక్కువ నీరు త్రాగడం, సరైన జీవనశైలి కారణంగా యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్ వస్తుంది. సబ్జా గింజలు వీలైనంత ఎక్కువ నీరు త్రాగడమే కాకుండా మూత్రనాళ ఇన్ఫెక్షన్లను కూడా నయం చేస్తాయి.

# కొవ్వే కదా అని లైట్ తీసుకోకండి.. తేడా కొడితే మీ పని అంతేనట.. బీకేర్‌ఫుల్..



కొలెస్ట్రాల్ సమస్య ఇప్పుడు ప్రతీ ఇంట్లో కూడా పట్టిపీడిస్తోంది. అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు ఈ సమస్యకు ప్రధాన కారణం.. బయటి ఆహారం ఎంత ఎక్కువగా తీసుకుంటే అంత చెడ్డ కొలెస్ట్రాల్ ఉంటుంది. ప్రతీరోజూ వ్యాయామం చేయకపోతే ప్రమాదం ఎక్కువ అవుతుంది. అయితే, మీ జీవక్రియ బాగా ఉంటే, కొలెస్ట్రాల్ స్థాయిల గురించి పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కానీ చెడు కొలెస్ట్రాల్ లెవెల్స్ ఒక్కసారిగా పెరిగితే ప్రమాదం కొనితెచ్చున్నట్లే.. చెడు కొలెస్ట్రాల్ స్థాయి పెరిగినప్పుడు, అది రక్తనాళాల్లో పేరుకుపోతుంది. దీని వల్ల రక్తనాళాలు ఇరుకుగా మారి రక్తప్రసరణకు ఆటంకం ఏర్పడుతుంది. ఇది రక్తపోటు, గుండె జబ్బులు ప్రమాదాన్ని పెంచుతుంది. అధిక కొలెస్ట్రాల్ గుండె జబ్బుల ప్రమాదాన్ని రెట్టింపు చేస్తుంది. చెడు కొలెస్ట్రాల్ అధిక స్థాయిలు ఏ సమయంలోనైనా గుండె సమస్యలకు దారితీస్తుంది. కానీ చాలా తక్కువ మందికి అధిక కొలెస్ట్రాల్, దాని ప్రభావాల గురించి తెలుసు.. అందుకే గుండెపోటు, పక్షవాతం లాంటి ప్రమాదకర వ్యాధులకు దూరంగా ఉండాలంటే.. కొలెస్ట్రాల్ స్థాయులను తగ్గించుకోవాలి. అధిక కొలెస్ట్రాల్ లక్షణాలు: కొలెస్ట్రాల్ స్థాయి పెరిగినప్పుడు, హృదయ స్పందన రేటు పెరుగుతుంది. కొంచెం గట్టిగా నడిచినా, మెట్లు ఎక్కినా ఊపిరి పీల్చుకునేందుకు ఆయాసంతో ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఇలాంటి సమయంలో చాలా మందికి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటుంది. కళ్ల కింద ఉబ్బడం కొలెస్ట్రాల్ లక్షణం. కొన్నిసార్లు పసుపు రంగు మచ్చల్లాంటివి కళ్ళపై కనిపిస్తాయి. ఇది హై కొలెస్ట్రాల్ లక్షణం కూడా కొలెస్ట్రాల్ స్థాయి పెరిగితే శరీరంలో రక్త ప్రసరణకు ఆటంకం ఏర్పడుతుంది. ఒక్కసారిగా నరాలు మొద్దుబారిపోతాయి. ఆ సమయంలో కాళ్లకు చలనం కూడా అనిపించదు.. ఛాతీ నొప్పి, ఛాతీలో ఒత్తిడి, అసౌకర్యం కొలెస్ట్రాల్ పెరిగిన లక్షణాలు. ధమనులలో కొలెస్ట్రాల్ పేరుకుపోవడం వల్ల అడ్డంకులు ఏర్పడతాయి. దీనివల్ల గుండె జబ్బులు పెరుగుతాయి. కొలెస్ట్రాల్ వల్ల కూడా అధిక రక్తపోటు రావచ్చు. అధిక రక్త కొలెస్ట్రాల్ స్థాయిలు ధమనులపై ఒత్తిడిని కలిగిస్తాయి. దీని కారణంగా, రక్త ప్రసరణ చెదిరిపోతుంది.. రక్తపోటు పెరుగుతుంది. కొలెస్ట్రాల్ వల్ల దృష్టి మసకబారుతుంది. కళ్లు దెబ్బతింటాయి. అందుకే.. ఇలాంటి పరిస్థితిని తెచ్చుకోవద్దంటున్నారు ఆరోగ్య నిపుణులు.. కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుకునే మార్గాలు.. కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడానికి తినడం, మద్యం త్రాగటం నియంత్రించాలి. వీధి ఆహారాన్ని తరచుగా తినవద్దు. నూనె, కొవ్వు రహిత ఆహారానికి దూరంగా ఉండాలి. కూరగాయలు, ధాన్యాలు, గింజలు, పండ్లు, చేపలు మొదలైన వాటిని ఎక్కువగా తినండి. తినడం, త్రాగడంతో పాటు, క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి. తగినంత నిద్ర పొందండి, ఒత్తిడిని తగ్గించుకోండి. ప్రతి 3 నెలలకు రక్త పరీక్ష చేయడం ద్వారా కొలెస్ట్రాల్ స్థాయిలను తనిఖీ చేయండి. ఇవన్నీ కొలెస్ట్రాల్ స్థాయిలను అదుపులో ఉంచుతాయి..

## ఇంత చిన్న వెల్లుల్లి ఏం చేస్తుందనుకుంటే పొరపాటే..! ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఇలా తింటే..

# ఎన్నో రోగాలకు దివ్యౌషధం..!!

అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలిగించే ఆహార పదార్థాలలో వెల్లుల్లి ఒకటి. వెల్లుల్లిలో విటమిన్లు సి, కె, ఫోలేట్, మాంగనీస్, సెలీనియం, ఫైబర్, ఐరన్, కాల్షియం, ఫాస్పరస్, కాపర్, పొటాషియం వంటి యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. విటమిన్ సి, ఇతర యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండే వెల్లుల్లి రసాన్ని ఉదయాన్నే పరగడుపున తాగితే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఉదయం ఖాళీ కడుపుతో వెల్లుల్లి రసం తాగితే ఎన్నో అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చునని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. అవేంటో ఇక్కడ తెలుసుకుందాం.. జీర్ణ సమస్యలు రాకుండా ఉండాలంటే వెల్లుల్లిని ఆహారంలో చేర్చుకోవడం మంచిది. వెల్లుల్లి రసం తాగడం వల్ల పొట్టలోని ఇన్ఫెక్షన్లు, గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలు రాకుండా కాపాడుతుంది. జీర్ణ సంబంధిత సమస్యలను దూరం చేస్తుంది. ఉబ్బరం, గ్యాస్ వంటి సమస్యలకు చెక్ పెడుతుంది. ఉదయం ఖాళీ కడుపుతో వెల్లుల్లి రసం తాగడం వల్ల శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ కూడా అదుపులో ఉంటుంది. వెల్లుల్లిలోని అల్లిసిన్ దీనికి సహాయపడుతుంది. అధిక కొలెస్ట్రాల్ తో బాధపడేవారు ఉదయాన్నే బ్రేక్ ఫాస్ట్ సమయంలో వెల్లుల్లి రసం తాగాలి. ఇది చెడు కొలెస్ట్రాల్‌తో పోరాడి టాక్సిన్స్ ను బయటకు పంపిస్తుంది. వెల్లుల్లి రసం తాగడం వల్ల గుండె ఆరోగ్యానికి మంచిది. రోజూ వెల్లుల్లి రసం తీసుకుంటే గుండె ఆరోగ్యంగా ఉంటుంది. గుండె సంబంధిత వ్యాధులు దూరం అవుతాయి. ఇవి రక్తపోటును తగ్గించడానికి, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయి. వెల్లుల్లి శ్వాసకోశసమస్యలనుండికూడాఉపశమనంకలిగిస్తుంది.వెల్లుల్లిలోఉండే యాంటీబ్యాక్టీరియల్ భాగాలు దీనికి సహాయపడతాయి. ఉదయాన్నే వెల్లుల్లి రసాన్ని తాగడం వల్ల ఇన్ఫెక్షన్లు, వ్యాధులు దూరం అవుతాయి. ఇమ్యూనిటీ పెరుగుతుంది. వెల్లుల్లి కాలేయ ఆరోగ్యానికి కూడా మంచిది. కాలేయం, మూత్రపిండాలు, రక్తప్రవాహానికి అద్భుతమై డిటాక్స్ ఫైయర్ గా పనిచేస్తుంది. మెదడు పనితీరును రక్షిస్తుంది. జ్ఞాపకశక్తి, దృష్టి మెరుగుపరుస్తుంది. యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండే వెల్లుల్లిని తినడం వల్ల కొన్ని రకాల క్యాన్సర్‌ల రిస్క్ తగ్గుతుంది. బరువు తగ్గడానికి వెల్లుల్లి రసాన్ని కూడా ఆహారంలో చేర్చుకోవచ్చు. శరీరంలోని అనవసరమైన క్యాలరీలను కరిగించడంలో ఇవి మేలు చేస్తాయి. వెల్లుల్లి రసం బరువును తగ్గించడంలో సహాయపడుతుంది. యాంటీ ఆక్సిడెంట్లు ఉండే వెల్లుల్లి రసం తాగడం వల్ల మెదడు ఆరోగ్యానికి కూడా మంచిది. విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండే వెల్లుల్లి రసం తాగడం వల్ల చర్మ ఆరోగ్యానికి కూడా మంచిది. చర్మ ఆరోగ్యానికి కూడా వెల్లుల్లి తోడ్పడుతుంది. మొటిమలను, మంటను తగ్గిస్తుంది.



# ఫైనల్‌లో పాకిస్తాన్‌తో తలపడనున్న భారత్

ఆసియా కప్ 2025 ఫైనల్ మ్యాచ్ భారత్, పాకిస్తాన్ మధ్య జరగనుంది. ఆసియా కప్ చరిత్రలో ఇరు జట్లు టైటిల్ కోసం తలపడటం ఇదే తొలిసారి. ఈ సీజన్‌లో ఇరు జట్లు 2 సార్లు తలపడ్డాయి. దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరిగిన రెండు మ్యాచ్‌లలోనూ టీమ్ ఇండియానే గెలిచింది. అయితే ఇప్పుడు ఫైనల్, సూర్యకుమార్ యాదవ్ అండ్ టీమ్ సల్మాన్ అలీ ఆగా, అతని ఆటగాళ్లను తేలిగ్గా తీసుకోకూడదు భారత క్రికెట్ జట్టు గ్రూప్ దశలో మూడు మ్యాచ్‌లను గెలుచుకుంది, ఇందులో పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్ కూడా ఉంది. సూపర్-4లో రెండు మ్యాచ్‌లు గెలిచి టీమ్ ఇండియా ఆసియా కప్ 2025 ఫైనల్‌కు చేరుకుంది, దీని మొదటి మ్యాచ్ కూడా పాకిస్తాన్‌తోనే జరిగింది. సూపర్-4లో మొదటి మ్యాచ్‌లో టీమ్ ఇండియాతో ఓడిపోయిన తర్వాత పాకిస్తాన్ శ్రీలంక, బంగ్లాదేశ్‌లను ఓడించింది. ఫైనల్ మ్యాచ్ ఆదివారం,



సెప్టెంబర్ 28న దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరగనుంది. భారతదేశం సమయం ప్రకారం ఫైనల్ మ్యాచ్ రాత్రి 8 గంటలకు ప్రారంభమవుతుంది. ఈ సమయంలో యూఏఈలో సాయంత్రం 6:30 అవుతుంది.గ్రూప్ దశలో ఈ రెండు జట్లు తలపడినప్పుడు భారత్ 7 వికెట్ల తేడాతో పాకిస్తాన్‌ను ఓడించింది. కుల్దీప్ యాదవ్ 3 వికెట్లు తీశాడు. భారత్ తరపున సూర్యకుమార్ యాదవ్ (47) అత్యధిక పరుగులు చేశాడు. సూపర్-4లో భారత్ 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది, అభిషేక్ శర్మ పాకిస్తాన్ బౌలర్లను చితకబాదాడు. అతను 39 బంతుల్లో 74 పరుగులు చేశాడు. ఇప్పుడు వరుసగా మూడో ఆదివారం మరోసారి భారత్, పాకిస్తాన్ మ్యాచ్ జరగనుంది, అయితే ఇది గత రెండు మ్యాచ్‌ల కంటే పెద్దది. ఎందుకంటే ఇది టైటిల్ కోసం పోరాటం. ఇప్పటికే రెండుసార్లు ఓడిపోయి తీవ్ర అవమానాలు ఎదుర్కొంటున్న పాకిస్తాన్ ఎలాగైనా భారత్‌పై పైచేయి సాధించాలనే కసితో ఉంది. అందుకే ఈసారి కచ్చితంగా భారత్ అందుకు తగ్గట్టుగానే పకడ్బంధిగా రెడీ అవుతోంది. సెప్టెంబర్ 2022లో పాకిస్తాన్ భారత్‌ను ఓడించింది, ఆ తర్వాత భారత్ పాకిస్తాన్‌ను వరుసగా 5 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లలో ఓడించింది. హెడ్ టు హెడ్‌లో భారత్దే పైచేయి. సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ ఆసియా కప్‌కు అధికారిక బ్రాడ్‌కాస్టర్. సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ ఛానెల్‌లలో మ్యాచ్‌ల ప్రత్యక్ష ప్రసారం ఉంటుంది.సోనీ లివ్ , ఫ్యాన్ కోడ్ యాప్, వెబ్‌సైట్‌లో భారత్, పాకిస్తాన్ ఆసియా కప్ 2025 ఫైనల్ మ్యాచ్‌ల ప్రత్యక్ష ప్రసారం ఉంటుంది.

# పాక్ ఓవర్ యాక్షన్ ఆటగాళ్లపై నిషేధం

ఆసియా కప్ ఫైనల్లో భారత్, పాకిస్తాన్ తొలిసారిగా తలపడనున్నాయి. గత రెండు మ్యాచ్‌లలో పాకిస్తాన్‌ను టీమిండియా చిత్తుగా ఓడించింది. ఇప్పుడు, సెప్టెంబర్ 28న దుబాయ్‌లో జరిగే మ్యాచ్‌లో భారత జట్టు హ్యాట్రిక్ విజయాలు సాధించి తన టైటిల్‌ను కాపాడుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ టైటిల్ పోరుకు ముందు పాకిస్తాన్‌కు పెద్ద ఎదురుదెబ్బ తగలవచ్చు. అయితే, పాక్ ఇద్దరు ఆటగాళ్లు హారిస్ రౌఫ్, సాహిబ్‌జాదా ఫర్హాన్ నిషేధం ఎదుర్కోవలసి రావొచ్చు. దీనికి ప్రధాన కారణం బయటపడింది. ఆసియా కప్ 2025లో టీమిండియాతో జరిగిన మ్యాచ్‌లో, పాకిస్తాన్ ఫాస్ట్ బౌలర్ హారిస్ రవూఫ్, ఓపెనింగ్ బ్యాట్స్‌మన్ సాహిబ్‌జాదా ఫర్హాన్ వింత చర్యలతో టీమిండియా ఫ్యాన్స్ ఆగ్రహానికి కారణమైంది. దీనిపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (%దీజజ×%) తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేసి మ్యాచ్ రిఫరీకి ఫిర్యాదు చేసింది. ఈ కేసులో విచారణ సెప్టెంబర్ 26 శుక్రవారం జరుగుతుంది. ఇద్దరు ఆటగాళ్లు దోషులుగా తేలితే, వారిపై తీవ్ర చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఫైనల్ మ్యాచ్ ఆడకుండా కూడా వారిని నిషేధించే అవకాశం ఉంది.సెప్టెంబర్ 21న దుబాయ్‌లో జరిగిన ఈ టోర్నమెంట్ సూపర్ ఫోర్‌లో భారత్ వర్సెస్ పాకిస్తాన్ రెండోసారి తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో టీమిండియా 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో, పాకిస్తాన్ ఓపెనింగ్ బ్యాట్స్‌మన్ సాహిబ్‌జాదా ఫర్హాన్ హాఫ్ సెంచరీ సాధించిన తర్వాత ఏకే 47 పేల్చుతూ సంబరాలు చేసుకున్నాడు. ఆ తర్వాత పాకిస్తాన్ ఫాస్ట్ బౌలర్ హారిస్ రౌఫ్ ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో విమానాలను నేల కూల్చినట్లు సంజ్ఞ చేశాడు. బీసీసీఐ మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్ కు ఫిర్యాదు చేసింది. ఈమెయిల్ తో పాటు హారిస్ రౌఫ్, సాహిబ్జాదా ఫర్హాన్ ల వీడియోలను కూడా పంపారు. ఈ సందర్భంగా, పాకిస్తాన్ ఓపెనర్ సాహిబ్జాదా ఫర్హాన్ ఏకే 47లా వేడుకను వివరించాడు.తన తుపాకీ వేడుక గురించి ఓపెనర్ సాహిబ్‌జాదా ఫర్హాన్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఇది కేవలం వేడుక క్షణం మాత్రమే అని అన్నాడు. "నేను



హాఫ్ సెంచరీ కొట్టిన తర్వాత పెద్దగా జరుపుకోను, కానీ అకస్మాత్తుగా ఈ రోజు జరుపుకోవాలని నాకు అనిపించింది. నేను అలాగే చేశాను. ప్రజలు దానిని ఎలా తీసుకుంటారో నాకు తెలియదు. నేను అది పట్టించుకోను" అంటూ చెప్పుకొచ్చాడు. ఇంతలో, ఫర్హాన్ ఉద్దేశపూర్వకంగా ఇలా చేశాడని, తనకు ఎటువంటి విచారం లేదని ఇప్పటికే పేర్కొన్నాడని బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు. "మేం పూర్తి పత్రాన్ని సిద్ధం చేసి మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్‌కు పంపాం." %ాజదీ% ఫిర్యాదు తర్వాత , సూర్యకుమార్ యాదవ్ విచారణ సెప్టెంబర్ 25న %×జజ% ఎలైట్ ప్యానెల్ మ్యాచ్ రిఫరీ రిచీ రిచర్డ్సన్ ముందు జరిగింది. నివేదికల ప్రకారం, రిఫరీ సెప్టెంబర్ 26న తన తుది నిర్ణయాన్ని వెలువరించనున్నాడు. ఈ నిర్ణయం భారత కెప్టెన్‌కు వ్యతిరేకంగా జరిగితే , అతనికి హెచ్చరిక లేదా అతని మ్యాచ్ ఫీజులో ఒక శాతం జరిమానా విధించవచ్చు.

## 9 ఫోర్లు, 12 సిక్సర్లతో వైభవ్ సంభవం

టీమిండియా అండర్ 19 ఆటగాడు వైభవ్ సూర్యవంశీ తన తొలి ఆస్ట్రేలియా వైట్-బాల్ సిరీస్‌లో 124 పరుగులు చేసి అదరగొట్టాడు. ఇంగ్లాండ్ పర్యటనలో తన ప్రతాపం చూపించిన వైభవ్.. ఇప్పుడుమరోసారి తన బ్యాట్‌తో రుచి చూపించాడు. ఆస్ట్రేలియాలో జరిగిన మూడు మ్యాచ్‌ల అండర్-19 వన్డే సిరీస్‌లో వైభవ్ సూర్యవంశీ 110 బంతులు ఎదుర్కొని 41.33 సగటు, 112.72 స్ట్రైక్ రేట్‌తో కేవలం 124 పరుగులు చేశాడు. ఈ ఇన్నింగ్స్‌లలో అతడి బ్యాట్ నుంచి 9 సిక్సర్లు, 12 ఫోర్లు వచ్చాయి. ఇంకో మ్యాచ్ మిగిలి ఉండగానే భారత్ అండర్-19 జట్టు సిరీస్ గెలుచుకుంది. సెప్టెంబర్ 24న బ్రిస్బేన్‌లోని ఇయాన్ హీలీ ఓవల్‌లో జరిగిన రెండవ యూత్ వన్డేలో భారత అండర్ 19 జట్టు ఆస్ట్రేలియా అండర్ 19 జట్టును 51 పరుగుల తేడాతో ఓడించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన టీమిండియా జట్టుకు వైభవ్ సూర్యవంశీ (68 బంతుల్లో 70), విహాన్ మల్హోత్రా (74 బంతుల్లో 70), అభిజ్ఞాన్ కుందు (64 బంతుల్లో 71) అద్భుతంగా బ్యాటింగ్ చేయడంతో 49.4 ఓవర్లలో 300 పరుగులకు ఆలౌటైంది. దీనికి సమాధానంగా ఆస్ట్రేలియా 47.2 ఓవర్లలో 249 పరుగులకు ఆలౌట్ అయింది. కెప్టెన్ ఆయుష్ మాత్రే(3/27, 4 ఓవర్లు) మూడు వికెట్లు పడగొట్టి కీలక పాత్ర పోషించాడు. మరోవైపు కనిష్క్ చౌహాన్ పది ఓవర్లలో రెండు వికెట్లు (2/50) తీసుకున్నాడు. ఆయుష్ మాత్రే రెండు బంతుల్లోనే డకౌట్ అయి పెవిలియన్‌కు చేరడంతో భారత్‌కు గొప్ప ఆరంభం లభించలేదు. ఆ తర్వాత విహాన్ మల్హోత్రా, వైభవ్ సూర్యవంశీతో కలిసి 111 బంతుల్లో రెండో వికెట్‌కు 117 పరుగులు జోడించారు. సూర్యవంశీ 54 బంతుల్లో తన అర్ధ సెంచరీని పూర్తి చేశాడు. తన మైలురాయిని చేరుకున్న తర్వాత గేర్ మార్చి.. మొత్తంగా 68 బంతుల్లో 70 పరుగులు చేసి అవుట్ అయ్యాడు. అతడు అవుట్ అనంతరం విహాన్‌మల్హోత్రా, అభిజ్ఞాన్ కుందు భారత్ 300 పరుగులు చేయడంలో సహాయపడ్డారు.

## టీమిండియా టెస్ట్ టీమ్ నుంచి కరుణ్ నాయర్ ఔట్..




వెస్టిండీస్‌తో సొంతగడ్డపై జరిగే టెస్ట్ సిరీస్‌కు ఎంపిక చేసిన భారత జట్టులో వెటరన్ బ్యాటర్ కరుణ్ నాయర్‌కు చోటు దక్కలేదు. 8 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత జట్టులోకి వచ్చిన కరుణ్ నాయర్.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయాడు. ఇంగ్లండ్ పర్యటనలో నాలుగు టెస్ట్‌ల్లో ఒకే ఒక్క హాఫ్ సెంచరీ నమోదు చేశాడు. దాంతో అతనిపై వేటు పడింది. తాజాగా తన వేటుపై స్పందించిన కరుణ్ నాయర్ నిరాశ వ్యక్తం చేశాడు. తనను ఎందుకు తప్పించారో తెలియదని, సెలెక్టర్లనే అడగాలని తెలిపాడు.'నాకు ఏం చెప్పాలో తెలియడం లేదు. మాటలు రావడం లేదు. దీని గురించి మీరు సెలెక్టర్లనే అడగాలి. ఇంగ్లండ్‌తో ఆఖరి టెస్ట్‌లో నేను 50 పరుగులు చేశాను. తొలి ఇన్నింగ్స్‌లో నేనే టాప్ స్కోరర్‌గా నిలిచాను. జట్టుకు నా వంతు సహాయ సహకారాన్ని అందించాను. ముఖ్యంగా ఆ మ్యాచ్‌లో మేం విజయం సాధించాం. కానీ సెలెక్టర్లు ఈ విషయాన్ని పట్టించుకోలేదు. నాకు జట్టులో స్థానం ఉంటుందని భావించాను.ప్రస్తుతానికి నేను చేయగలిగేది కూడా ఏమీ లేదు. నేను మరింత కష్టపడాలి. నా కెరీర్ గురించి నేను చాలా క్లారిటీతో ఉన్నాను. నా సాయశక్తులా ప్రయత్నించాను. కానీ సెలెక్టర్లు నిర్ణయం తీసుకున్నారు. వారి నిర్ణయాన్ని గౌరవించాలి. ఇప్పుడు నేను రంజీ ట్రోఫీ కోసం సిద్ధమవుతున్నాను.'అని కరుణ్ నాయర్ చెప్పుకొచ్చాడు.ఇంగ్లండ్ పర్యటనలో తాము ఆశించిన రీతిలో రాణించకపోవడంతోనే కరుణ్ నాయర్‌పై వేటు వేసామని భారత చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ వివరణ ఇచ్చాడు. జట్టు ప్రకటన అనంతరం మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు ఓపికగా సమాధానాలు ఇచ్చాడు. 'ఇంగ్లండ్ పర్యటనలో కరుణ్ నాయర్ నుంచి మేం మరింత నిలకడైన ప్రదర్శనను ఆశించాం. ఒక్క ఇన్నింగ్స్ గురించి మాట్లాడటం సరికాదు. ప్రస్తుతం సమయంలో పడిక్కల్ కాస్త మెరుగైన ప్రదర్శన ఇవ్వగలడని మేం భావిస్తున్నాం. మేం అందరికీ 15-20 టెస్ట్ మ్యాచ్‌లు ఆడే అవకాశం ఇవ్వలేం.'అని గవాస్కర్ సమాధానమిచ్చాడు. అక్టోబర్ 2 నుంచి అహ్మదాబాద్ వేదికగా భారత్, వెస్టిండీస్ మధ్య తొలి టెస్ట్ ప్రారంభం కానుంది. వెస్టిండీస్‌తో టెస్ట్ సిరీస్‌కు ఎంపికైన భారత జట్టు.. శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రవీంద్ర జడేజా(వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్,కేఎల్ రాహుల్, దేవదత్ పడిక్కల్, ధ్రువ్ జురెల్(వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, జస్ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, నితీష్ కుమార్ రెడ్డి, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్, ఎన్. జగదీశన్ (వికెట్ కీపర్), సాయి సుదర్శన్.

## భారత్‌ను రెచ్చగొట్టేందుకు ఆ సైగలు చేయలేదు పాకిస్థాన్ పేసర్ హరీస్ రౌఫ్

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్(ఐసీసీ) ముందు పాకిస్థాన్ పేసర్ హరీస్ రౌఫ్ ఎలాంటి పశ్చాత్తాపం వ్యక్తం చేయలేదు. తాను ఎలాంటి తప్పిదం చేయలేదని గట్టిగా వాదించినట్లు తెలుస్తోంది. ఆసియా కప్ 2025 టోర్నీలో భాగంగా భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో హరీస్ రౌఫ్ వివాదాస్పద సంజ్ఞలు చేసిన సంగతి తెలిసిందే. భారత్‌కు చెందిన జెట్ ఫైట్స్‌ను కూల్చేశామని ప్రేక్షకులకు తెలియజేస్తూ .. 6-0 అనే సంజ్ఞలు చేశాడు.పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో భారత సాయుధ బలగాలు ఆపరేషన్ సింధూర్ పేరిట పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిభిరాలపై దాడులు జరిపిన సంగతి తెలిసిందే. అయితే ఈ దాడుల సమయంలో భారత్‌కు చెందిన 6 రాఫెల్ యుద్ధ విమానాలను కూల్చినట్లు పాకిస్థాన్ అబద్ధపు ప్రకటన చేసింది. ఇందుకు సంబంధించిన ఆధారాలను ఇప్పటి వరకు ప్రపంచానికి చూపించలేదు. కానీ భారత్‌పై తామే యుద్ధం గెలిచామని సంబరాలు చేసుకుంది. భారత్‌తో మ్యాచ్‌లోనూ ఇదే విషయాన్ని తెలియజేస్తూ హరీస్ రౌఫ్ 6-0 సంజ్ఞలు చేశాడు. అంతేకాకుండా కవ్వింపులకు పాల్పడుతూ భారత్ ఆటగాళ్లతో వాగ్వాదానికి దిగాడు.అయితే హరీస్ రౌఫ్ తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. ముఖ్యంగా భారత అభిమానులు అతన్ని సోషల్ మీడియా వేదికగా ఏకిపారేసారు. అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే అతన్ని ఐసీసీ వివరణ కోరగా.. తాను భారత్‌ను ఉద్దేశించి ఆ సంజ్ఞలు చేయలేదని వాదించినట్లు సమాచారం. హాఫ్ సెంచరీ అనంతరం గన్ ఎక్కుపెట్టి సంబరాలు చేసుకున్న పాకిస్థాన్ ఓపెనర్ సహిబ్‌జాద్ ఫర్హాన్ సైతం.. ఇదే అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. తన సంబరాల వెనుక ఎలాంటి రాజకీయపరమైన చర్య లేదని, గతంలో ధోనీ, కోహ్లీ కూడా ఇలా సంబరాలు చేసుకున్నారని ఫర్హాన్ ఐసీసీకి వివరణ ఇచ్చినట్లు సమాచారం. అయితే ఈ ఇద్దరి మ్యాచ్ ఫీజులో ఐసీసీ కోత విధించే అవకాశం ఉంది. త్వరలోనే ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటన చేయనుంది. క్రికెట్ మ్యాచ్‌లో రాజకీయపరమైన విషయాలను ప్రస్తావించడం, సంజ్ఞలు చేయడం రూల్స్‌కు విరుద్ధం. ఇక పాక్‌పై విజయాన్ని భారత సాయుధ బలగాలకు అంకితం చేసిన సూర్యకుమార్ యాదవ్‌ను కూడా ఐసీసీ మందలించింది. భవిష్యత్తులో ఇలాంటి ప్రకటనలు చేయవద్దని, కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించింది.

## భారత్-ఏ జట్టు ఐదు వికెట్ల తేడాతో విజయం




వెస్టిండీస్‌తో టెస్ట్ సిరీస్‌కు ముందు టీమిండియా స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ ఫామ్ అందుకున్నాడు. ఆస్ట్రేలియా-ఏ జరిగిన రెండో అనధికారిక టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో ఈ వెటరన్ టీమిండియా బ్యాటర్ భారీ శతకంతో చెలరేగాడు. 210 బంతుల్లో 16 ఫోర్లు, 4 సిక్సలతో 176 పరుగులతో అజేయంగా నిలిచాడు. అతనికి తోడుగా సాయి సుదర్శన్(172 బంతుల్లో 9 ఫోర్లు, సిక్స్‌తో 100) కూడా శతక్కొట్టడంతో ఈ మ్యాచ్‌లో భారత్-ఏ జట్టు ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది.412 పరుగుల భారీ లక్ష్యచేధనలో భారత్-ఏ 91.3 ఓవర్లలో 5 వికెట్లకు 413 పరుగులు చేసి గెలుపొందింది. రాహుల్, సాయి సుదర్శన్‌కు తోడుగా కెప్టెన్ ధ్రువ్ జురెల్(66 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సలతో 56) హాఫ్ సెంచరీతో రాణించాడు. తెలుగు తేజం నితీష్ కుమార్ రెడ్డి(16 నాటౌట్)తో కలిసి కేఎల్ రాహుల్ విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు.ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా-ఏ జట్టు 420 పరుగుల భారీ స్కోర్ చేసింది. అనంతరం భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 194 పరుగులకే కుప్పకూలింది. సాయి సుదర్శన్(75) మినహా అంతా విఫలమయ్యారు. 226 పరుగుల భారీ ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియా 185 పరుగులకే కుప్పకూలింది. భారత బౌలర్లలో గుర్నూర్ బ్రార్, మనవ్ సుతార్ మూడేసి వికెట్లు తీయగా.. సిరాజ్, యశ్ ఠాకూర్ రెండేసి వికెట్లు పడగొట్టారు. తొలి ఇన్నింగ్స్‌తో ఆధక్యంతో భారత్ ముందు 412 పరుగుల లక్ష్యం నమోదవ్వగా.. భారత్-ఏ 413 పరుగులు చేసి గెలుపొందింది. అక్టోబర్ 2 నుంచి సొంతగడ్డపై వెస్టిండీస్‌తో టీమిండియా రెండు టెస్ట్‌ల సిరీస్ ఆడనుంది. తొలి మ్యాచ్ అహ్మదాబాద్ వేదికగా జరగనుంది. ఈ టెస్ట్ సిరీస్ కోసం భారత సెలెక్షన్ కమిటీ 15 మంది సభ్యులతో కూడిన జట్టును ప్రకటించింది. ఇంగ్లండ్ పర్యటనలో విఫలమైన కరుణ్ నాయర్‌పై వేటు పడగా.. గాయంతో రిషభ్ పంత్ దూరమయ్యాడు. ఆకాష్ దీప్‌కు చోటు దక్కలేదు. రిషభ్ పంత్ గైర్హాజరీ నేపథ్యంలో వైస్ కెప్టెన్సీ బాధ్యతలు జడేజాకు దక్కాయి. భారత్-ఏ జట్టు తరఫున మెరుగైన ప్రదర్శన చేసిన దేవదత్ పడిక్కల్‌కు అవకాశం దక్కగా..అభిమన్యు ఈశ్వరన్‌కు నిరాశే ఎదురైంది.

## ముంబై ఇండియన్స్‌లోకి సునీల్ గవాస్కర్..?



సునీల్ గవాస్కర్.. ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ జట్టుకు ఆడాలనుకుంటున్నాడు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా వెల్లడించాడు. తనను ముంబై ఇండియన్స్ జట్టులోకి తీసుకోవాలని ఆ జట్టు కెప్టెన్ హార్దిక్ పాండ్యాను కోరినట్లు తెలిపాడు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ఆసియా కప్ 2025 టోర్నీలో టీమిండియా దుమ్మురేపుతోంది. వరుసగా ఐదు మ్యాచ్‌ల్లో గెలిచి ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. గత బుధవారం బంగ్లాదేశ్‌తో జరిగిన సూపర్-4 మ్యాచ్‌లోనూ టీమిండియా ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతోనే ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఆసియా కప్ టోర్నీకి సునీల్ గవాస్కర్ కామెంటేటర్‌గా వ్యవహరిస్తున్నాడు. బంగ్లాదేశ్‌తో మ్యాచ్ అనంతరం సునీల్ గవాస్కర్.. హార్దిక్ పాండ్యా సుదీర్ఘంగా మాట్లాడాడు. ఈ సంభాషణ గురించి అధికారిక బ్రాడ్‌కాస్టర్ సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ హోస్ట్ ప్రశ్నించాడు.హార్దిక్ పాండ్యాతో ఏం మాట్లాడారని వివరణ కోరాడు. ఇందుకు సునీల్ గవాస్కర్ తనదైన శైలిలో సమాధానమిచ్చి నవ్వులు పూయించాడు. ముంబై ఇండియన్స్ కెప్టెప్ అయిన హార్దిక్ పాండ్యాను ఐపీఎల్‌లో తనను పరిగణలోకి తీసుకోవాలని కోరానని చెప్పాడు. దాంతో హోస్ట్ పగలబడి నవ్వాడు. ఈ వీడియోపై నెటిజన్లు తమదైన శైలిలో కామెంట్ చేస్తున్నారు. ఎటకారంలో గవాస్కర్‌ను మించినోడు లేడని కామెంట్ చేస్తున్నారు. తన కెరీర్‌లో 125 టెస్ట్‌లు ఆడిన గవాస్కర్ 10122 పరుగులు చేశాడు. ఇందులో 34 శతకాలు ఉన్నాయి. 108 వన్డేల్లో 3092 పరుగులతో రాణించాడు. 1983 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులో సునీల్ గవాస్కర్ ఒక సభ్యుడు. అతని సారథ్యంలో టీమిండియా వరల్డ్ ఛాంపియన్‌షిప్ టైటిల్ గెలిచింది.మరోవైపు ముంబై ఇండియన్స్‌తోనే తన ఐపీఎల్ కెరీర్ ప్రారంభించిన హార్దిక్ పాండ్యా 2021 వరకు ఆ జట్టుకే ఆడాడు. ఐపీఎల్ 2022 మెగా వేలానికి ముందు అతను గుజరాత్ టైటాన్స్‌కు వెళ్లి ఆ జట్టు సారథ్యం బాధ్యతలు చేపట్టాడు. అరంగేట్ర సీజన్‌లోనే టైటిల్ అందించిన హార్దిక్ పాండ్యా.. ఆ మరుసటి ఏడాది రన్నరప్ టైటిల్ అందుకున్నాడు. ఐపీఎల్ 2024 సీజన్‌కు ముందు క్యాష్ డీల్ ట్రేడింగ్ ద్వారా ముంబై ఇండియన్స్ జట్టులోకి వచ్చి సారథ్య బాధ్యతలు చేపట్టాడు. అయితే ఐపీఎల్ 2020 నుంచి ముంబై ఇండియన్స్ ఒక్క టైటిల్ కూడా గెలవలేదు.

## టీమిండియాలో 3 కీలక మార్పులు..

భారత జట్టు ఇప్పటికే ఆసియా కప్ 2025 ఫైనల్‌కు చేరుకుంది. అక్కడ పాకిస్తాన్‌తో తలపడేందుకు సిద్ధమైంది. అయితే, తన చిరకాల ప్రత్యర్థితో జరిగే ఫైనల్‌కు ముందు, భారత జట్టు శ్రీలంకతో ఒక చివరి సూపర్ ఫోర్ మ్యాచ్ కూడా ఆడనుంది. ఈ మ్యాచ్‌లో టీమిండియాలో గణనీయమైన మార్పులు జరిగే అవకాశం ఉంది. ఫైనల్‌కు ముందు భారత జట్టు యాజమాన్యం కొంతమంది ఆటగాళ్లకు విశ్రాంతి ఇవ్వవచ్చు అని తెలుస్తోంది. వారి స్థానంలో బెంచ్ మీద ఆటగాళ్లను బరిలోకి దింపనుంది. శ్రీలంకతో జరిగే మ్యాచ్‌లో టీం ఇండియాలో మూడు మార్పులు చేయడం ఖాయం. ఇప్పుడు ప్రశ్న ఏమిటంటే, టీమిండియాలో ఆ మూడు మార్పులు ఏమిటి? మొదటి మార్పు నిస్సందేహంగా జస్ప్రీత్ బుమ్రా అవుతుంది. అతనికి విరామం ఇవ్వవచ్చు. అర్ష్‌దీప్ సింగ్‌ను ప్లేయింగ్ ఎలెవన్‌లోకి తీసుకోవచ్చు. అతనితో పాటు, టీం ఇండియా మరోసారి వరుణ్ చక్రవర్తి స్థానంలో హర్షిత్ రాణాను తీసుకోవచ్చు. జట్టులో మూడవ మార్పు హార్దిక్ పాండ్యా లేదా తిలక్ వర్మ కావొచ్చు. ఈ ఇద్దరు ఆటగాళ్లలో ఒకరిని తొలగించడం ద్వారా, భారత జట్టు రింకు సింగ్ లేదా జితేష్ శర్మను తీసుకోవచ్చు.2025 ఆసియా కప్‌లో టీమిండియా విజయం దిశగా దూసుకుపోతోంది. టోర్నమెంట్‌లో ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోని ఏకైక జట్టుగా నిలిచింది. ఇప్పుడు ఆ రికార్డును నిలబెట్టుకుని ఫైనల్‌కు చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. అందుకే శ్రీలంకతో జరిగే మ్యాచ్‌లో జట్టులో కీలక మార్పులకు అవకాశం తక్కువగా కనిపిస్తోంది.

## భారత్‌ను ఓడించడం పాకిస్థాన్‌కు చాలా కష్టమని పాకిస్థాన్ జట్టు మాజీ పేసర్ షోయబ్ అక్తర్



ఆసియా కప్ 2025 టోర్నీలో మరోసారి భారత్, పాకిస్థాన్ జట్లు తలపడున్నాయి. ఇరు జట్లు ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకున్నాయి. ఆదివారం జరిగే ఫైనల్లో అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఈ టోర్నీలో ఇప్పటికే దాయాదీ దేశాలు రెండు సార్లు తలపడ్డాయి. అయితే ఈ రెండు మ్యాచ్‌ల్లోనూ పాకిస్థాన్‌ను భారత్ చిత్తు చేసింది. తొలి మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో గెలిచిన భారత్.. రెండో మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో ఓడించింది. ముచ్చటగా మూడోసారి భారత్, పాక్‌లు ఫైనల్లో తలపడుతున్నాయి.ఆసియా కప్ చరిత్రలోనే భారత్, పాక్‌లు ఫైనల్లో తలపడటం ఇదే తొలిసారి. దాంతో ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. మరోవైపు ఫైనల్లో భారత్‌ను ఓడిస్తామని పాకిస్థాన్ ఆటగాళ్లు సవాల్ విసిరారు. దాంతో ఈ మ్యాచ్‌పై మరింత హైప్ క్రియేట్ అయ్యింది.హ్యాట్రిక్ విజయంపై కన్నేసిన భారత్‌ను ఓడించడం పాకిస్థాన్‌కు చాలా కష్టమని ఆ జట్టు మాజీ పేసర్ షోయబ్ అక్తర్ అన్నాడు. అయితే టీమిండియా ఓపెనర్ అభిషేక్ శర్మను త్వరగా ఔట్ చేస్తే భారత్‌ను ఓడించవచ్చని పాక్ ఆటగాళ్లకు సూచించాడు. 'భారత్‌తో మ్యాచ్ అనగానే ఒత్తిడికి గురయ్యే మైండ్‌సెట్ నుంచి పాకిస్థాన్ ఆటగాళ్లు బయటకు రావాలి. బంగ్లాదేశ్‌పై ఎలా ఆడారో అలాగే భారత్‌ను ఓడించాలి. మొత్తం 20 ఓవర్లూ బౌలింగ్ చేయకుండా.. 10 వికెట్లు తీసేందుకు ప్రయత్నించాలి.ముఖ్యంగా అభిషేక్ శర్మను తొలి మూడు ఓవర్లలోనే ఔట్ చేయాలి. అప్పుడే భారత్‌పై ఒత్తిడి పెట్టవచ్చు. భారత్‌కు ఇప్పటి వరకు వచ్చిన ఆరంభాలన్నీ అభిషేక్ శర్మ అందించినవే. అభిషేక్ శర్మను ఔట్ చేయకపోతే మాత్రం పాకిస్థాన్ గెలవడం కష్టం. అభిషేక్ తప్పిదం చేయడం కూడా చాలా తక్కువ. కాబట్టి అతనిపై అటాకింగ్ బౌలింగ్ చేయాలి. అప్పుడే మిగతా భారత్ బ్యాటర్లు ఆచితూచి ఆడేందుకు ప్రయత్నిస్తారు. పరుగుల కోసం కష్టపడుతారు. అయితే భారత్ తమ అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. అక్కడ హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఉన్నాడు. పాక్‌పై టాప్ క్లాస్ ఆటను ఆడాలని భారత్‌కు చెబుతాడు. చెత్త జట్టుతో దిగినా.. నాసికరంగా ఆడినా.. పాక్ ఫైనల్ చేరుకుంది. తుదిపోరులో మాత్రం దూకుడుగా ఆడేందుకు ప్రయత్నిస్తారని భావిస్తున్నా.'అని షోయబ్ అక్తర్ చెప్పుకొచ్చాడు.

# వెంకీ సినిమా కోసం త్రివిక్రమ్ కొత్త టీమ్



'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంతో బ్లాక్ బస్టర్ అందుకున్న నటుడు విక్టరీ వెంకటేశ్ ప్రస్తుతం త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో సినిమా చేయబోతున్న విషయం తెలిసిందే. ఇటీవలే ఈ సినిమాద పూజ కార్యక్రామాలు పూర్తి చేసుకున్న చిత్రయూనిట్ అక్టోబర్‌లో రెగ్యూలర్ షూటింగ్ ప్రారంభించనుంది. ఈ చిత్రాన్ని హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ నిర్మించనున్నట్లు తెలుస్తోంది. వెంకీ 77 అనే వర్కింగ్ –టైటిల్‌తో ఈ ప్రాజెక్ట్ రాబోతుంది. అయితే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి తాజాగా ఒక విషయం వైరల్‌గా మారింది. ఈ సినిమా కోసం త్రివిక్రమ్ తన టీమ్ మొత్తాన్ని మార్చినట్లు– తెలుస్తుంది. కొత్తవారిని ఈ సినిమా కోసం తీసుకున్నట్లు– ఫిల్మ్ నగర్‌లో టాక్ నడుస్తుంది. అయితే ఇది ఎంతవరకు నిజం అనేది తెలియాల్సి ఉంది. వెంకటేశ్ నటించిన నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి చిత్రాలకు త్రివిక్రమ్ మాటలు రాశారు. దర్శకుడయ్యాక ఆయన వెంకీతో సినిమా చేస్తారని అందరూ భావించారు. కానీ ఎందుకో ఆ కాంబినేషన్ సెట్ కాలేదు. అయితే.. ఎట్టకేలకు వెంకీ, త్రివిక్రమ్‌ల కాంబినేషన్ సెట్ అవ్వడంతో అభిమానులు ఈ సినిమా కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారు.

# ఓటిటిలోకి మళయాళ హిట్ మూవీ హృదయపూర్వం



విలక్షణ పాత్రలతో మెప్పించే మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్ నటించిన తాజా చిత్రం 'హృదయపూర్వం'. బాక్సాఫీస్ వద్ద రూ.100 కోట్లు– వసూలుచేసిన ఈ మూవీ ఇప్పుడు ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్న సందీప్ బాలకృష్ణన్ (మోహన్‌లాల్)కు రోడ్డు ప్రమాదంలో చనిపోయిన ఆర్మీ కర్నల్ రవిచంద్రన్ గుండెను వైద్యులు అమరుస్తారు. అతడి ఆరోగ్యం కుదుటపడేవరకూ సహాయం చేయడానికి తోడుగా జెర్రీ (సంగీత్ ప్రతాప్)ను ఆస్పత్రి నియమిస్తుంది. సందీప్ తాను నడుపుతున్న క్లౌడ్ కిచెన్ వ్యవహారాలు చూసుకుంటూ ఉండగా, కర్నల్ రవిచంద్రన్ కుమార్తె హరిత (మాళవిక మోహనన్) అతడి దగ్గరకు వస్తుంది. తనకు నిశ్చితార్థం కుదిరిందని, ఆ వేడుకకు రావాలని కోరుతుంది. తొలుత రానని చెప్పినా, ఆ తర్వాత జెర్రీతో కలిసి సందీప్ పుణె వెళ్తాడు. మరి అక్కడికి వెళ్లాక అతడికి ఎదురైన పరిస్థితులు ఏంటి? హరిత నిశ్చితార్థం ఆగిపోవడానికి కారణం ఎవరు? కర్నల్ రవి భార్య, కుమార్తె హరిత.. సందీప్‌పై చూపిన ప్రేమ, ఆప్యాయత ఎలాంటి పరిస్థితులకు దారితీసింది? తెలియాలంటే సినిమా చూడాల్సిందే. తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడే వారికి మరణించిన వేరొకరి అవయవాలను అమర్చడం ఒకరకంగా ఇద్దరికీ పునర్జన్మ ఇచ్చినట్లే. ఈ నేపథ్యంతో ఇప్పటికే ఎన్నో కథలు వచ్చాయి. 'హృదయపూర్వం' కూడా ఈతరహా నేపథ్యమే అయినా, దర్శకుడు సత్యన్ అంతికాడ్ దీనిని ఒక అందమైన ప్రయాణంలా తీర్చిదిద్ది ప్రేక్షకులను మెప్పించారు. అందుకే మలయాళంలో బాక్సాఫీస్ వద్ద డీసెంట్ హిట్ అందుకుంది. కర్నల్ రవిచంద్రన్ గుండెను సందీప్‌కు అమర్చడంతోనే నేరుగా కథను ప్రారంభించాడు దర్శకుడు. ఆ తర్వాత నెమ్మదిగా సందీప్ నేపథ్యం, అతడి చుట్టూ ఉన్న ప్రపంచాన్ని ఆవిష్కరించాడు. సందీప్, జెర్రీలు పుణె వెళ్లిన తర్వాత కథలో అసలైన సంఘర్షణ మొదలవుతుంది. అనుకోకుండా హరిత నిశ్చితార్థం ఆగిపోవడం, సందీప్ రెండు వారాల పాటు– పుణెలో ఉండాల్సిన పరిస్థితి తలెత్తుంది. ఇక్కడినుంచి కథ రొమాంటిక్ టర్న్ తీసుకుంటుంది. హరిత ఇంటికి సందీప్ వెళ్లిన దగ్గరి నుంచి వారి మధ్య వచ్చే సన్నివేశాలు సరదాగా సాగిపోతూ చక్కటి వినోదాన్ని పంచుతాయి. అటు తల్లి, ఇటు– కుమార్తె సందీప్‌పై చూపే చొరవ, దానిని అతడు అర్థం చేసుకొనే తీరు, మధ్యలో జెర్రీ చేసే హంగామా అలరిస్తుంది. సందీప్‌ను వెతక్కుంటూ అతడి బావ పణికర్ పుణెకు వచ్చిన తర్వాత వినోదం పాళ్లు మరింత పెరుగుతాయి. ఒక బలమైన ఎమోషనల్ నోట్‌తో సినిమాను ముగించిన తీరు బాగుంది. సందీప్ బాలకృష్ణన్ వంటి పాత్రలు చేయడం మోహన్‌లాల్‌కు వెన్నతో పెట్టిన విద్య. అయితే, ఆ పాత్రకు ఎంత చేయాలో అంతే చేశారు. ఆయన చేసే ఒక్క ఫైట్ కూడా చాలా రియలిస్టిక్‌గా ఉంటుంది. ఇక చెర్రీగా సంగీత్ నవ్వులు పంచాడు. హరితగా మాళవిక మోహనన్, ఆమె తల్లి పాత్రలో సంగీత మాధవన్ నాయర్ ఒదిగిపోయారు. సందీప్ బావ పాత్రలో సిద్ధిఖీ నటన మరో హైలైట్. ఆయన ఉన్నంతసేపు స్క్రీన్‌పై నవ్వుల టపాసులు పేలుతూనే ఉంటాయి. సాంకేతికంగా సినిమా బాగానే ఉంది. జియో హాట్‌స్టార్ వేదికగా తెలుగులోనూ స్ట్రీమింగ్ అవుతోంది.

# ఓజి విజయం .. సుజిత్ త్యాగాలకు నిదర్శనం

'ఓజీ' సినిమా విజయం ఆ దర్శకుడు చేసిన త్యాగాలకు నిదర్శనమని నటి శ్రియా రెడ్డి అన్నారు. పవన్ కల్యాణ్ హీరోగా సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ గ్యాంగ్‌స్టర్ మూవీలో గీతగా శ్రియారెడ్డి పవర్‌ఫుల్ పాత్రలో కనిపించారు. తాజాగా ఆమె సుజీత్‌పై ప్రశంసలు కురిపిస్తూ ఓ పోస్ట్ పెట్టారు. సుజీత్ రాసిన పాత్ర తెరపై మరోసారి అద్భుతం సృష్టించింది. 'ఓజీ'లాంటి సినిమాను అంగీకరించడానికి అంత పెద్ద ప్రాజెక్ట్‌లో గుర్తింపు తెచ్చుకోవడానికి ఆత్మవిశ్వాసం ఉన్న దర్శకుడు అవసరం. సుజీత్ అలాంటి దర్శకుడే. ఈ పాత్రకు నన్ను ఎంపిక చేసినందుకు ధన్యవాదాలు. ఉన్నతంగా ఆలోచించినప్పుడు ఇలాంటి అద్భుతాలు జరుగుతాయి. నేను చూసిన గొప్ప వ్యక్తుల్లో మీరూ ఒకరు. ఈ విజయానికి పూర్తి అర్హులు. మీ కృషి, విశ్వాసం, మీరు చేసిన త్యాగాలు అన్నీ ఈ విజయానికి నిదర్శనం అంటూ పోస్ట్‌లో రాసుకొచ్చారు. గురువారం ప్రేక్షకుల ముందుకువచ్చిన 'ఓజీ'ని ఇప్పటికే సినీ ప్రముఖులు వీక్షించి రివ్యూలు ఇచ్చారు. తాజాగా ఈ చిత్రాన్ని చూడడం కోసమే హైదరాబాద్ వచ్చినట్లు– కోలీవుడ్ హీరో ప్రదీప్ రంగనాథన్ తెలిపారు. 'ఈ మాస్ చిత్రాన్ని తెలుగు ఆడియన్స్‌తో కలిసి చూస్తేనే కదా అసలైన ఆనందం' అని తాను సినిమా చూస్తోన్న వీడియోను పంచుకున్నారు.



# నవీన్ పొలిశెట్టి.. అనగనగా ఒకరాజు




నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి ప్రధాన పాత్రల్లో దర్శకుడు మారి తెరకెక్కిస్తున్న చిత్రం 'అనగనగా ఒక రాజు'. ఈ కామెడీ ఎంటర్‌టైనర్ మూవీ సంక్రాంతి కానుకగా 2026 జనవరి 14న విడుదల కానుంది. తాజాగా ఓ స్పెషల్ ప్రోమోను టీ–మ్ షేర్ చేసింది. నటీ–నటు–లిద్దరూ జ్యువెలరీ యాడ్‌లో నటిస్తున్నట్లు–గా రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. దీన్ని 'సంక్రాంతి ప్రోమో' పేరుతో టీ–మ్ షేర్ చేసింది. తనదైన కామెడీ –టైమింగ్ తో ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న నవీన్ పొలిశెట్టి, మరో ఫ్యామిలీ చిత్రం 'అనగనగా ఒక రాజు'తో అలరించడానికి సిద్ధమవుతున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి విడుదలైన టీజర్, ఈ సంక్రాంతికి ప్రేక్షకులను నవ్వుల కనుక అందివ్వబోతున్నట్టు అర్థం అవుతోంది. బంగారు ఆభరణాల ప్రకటనపై స్పూఫ్ తో ప్రారంభమైన ఈ టీ–జర్, ఎంతో వైవిధ్యంగా ఉంది. ఒంటి నిండా ఆభరణాలు ధరించిన మీనాక్షి చౌదరి, తమ సినిమా గురించి కాకుండా ఆభరణాల గురించి మాట్లాడుతుండటంతో ఆమె ఆభరణాలను నవీన్ పొలిశెట్టి ధరించి కనిపించడం భలే సరదాగా ఉంది. టీజర్ లో నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి పోటాపోటీగా నవ్వులు పంచారు. వినోదాల వేడుకకు వేదికగా ఈ టీజర్ నిలిచింది. ఇప్పటికే విడుదైన పోస్టర్లు, గ్లింప్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టు–కున్నాయి. తాజా టీజర్ అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తూ.. సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. నవీన్ యొక్క అద్భుతమైన కామెడీ –టైమింగ్ ప్రతి ఫ్రేమ్ లో ప్రకాశించింది. తెరపై నవీన్ ఉత్సాహంగా కనిపించిన తీరు సంక్రాంతి పండుగకు ప్రేక్షకులు కోరుకునే అసలైన వినోదాల విందుకి వాగ్దానంలా ఈ టీ–జర్ నిలిచింది. కేవలం ఒక నిమిషం కంటే ఎక్కువ నిడివితో రూపొందిన ఈ టీజర్, సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. అంతేకాకుండా హాస్యం, తాజాదనం మరియు కమర్షియల్ పంచ్‌లను మిళితం చేసే చిత్రాలను ఎంచుకోవడంలో నవీన్ పొలిశెట్టి నైపుణ్యాన్ని పునరుద్ఘాటించింది. టీ–జర్ చూసిన ప్రతి ఒక్కరూ నవీన్ ఖాతాలో మరో ఘన విజయం ఖాయమని ప్రశంసలు కురిపిస్తున్నారు. సంక్రాంతి కానుకగా 2026 జనవరి 14న విడుదల కానున్న 'అనగనగ ఒక రాజు'పై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి

# ఓజి తొలిరోజు 154 కోట్ల కలెక్షన్

సినీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన 'ఓజీ' విడుదలైంది. ఫ్యాన్స్ ఆశించినట్టే హిట్ టాక్ సొంతం చేసుకుంది. ఫస్ట్ డే కలెక్షన్స్ ఎంత వసూలు చేసిందన్న ప్రశ్నకు చిత్ర బృందం తాజాగా సమాధానమిచ్చింది. ప్రపంచవ్యాప్తంగా తొలి రోజు రూ.154కోట్లకుపైగా వసూలు చేసిందని నిర్మాణ సంస్థ డీవీవీ ఎంటర్–టైన్‌మెంట్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. ఈ మేరకు పవర్‌ఫుల్ పోస్టర్ పంచుకుంటూ 'ఇది పవన్ కల్యాణ్ సినిమా. చరిత్రను ఓజీ చెరిపేసింది' అని క్యాప్షన్ పెట్టింది.




Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 9014159785, Mail:thecrimenews123@gmail.com